www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

ఆదివారం | 9-11-2025 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 243 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, బహుళపక్షం, తిథి: పంచమి రా.1:55 తదుపరి షష్ఠి, నక్షత్రం: ఆర్ద్ర రా.8:04 తదుపరి పునర్వసు, వర్జ్యం: శేషం ఉ.7:12, దుర్ముహూర్తం: సా.4:06-4:51, అమృతఘడియలు: ఉ.10:53-12:21, రాహుకాలం: సా.4:30-6:00, సూర్యోదయం: 6:20, సూర్యాస్తమయం: 5:36 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

నిర్లక్ష్యంగా ఉంటే కఠినంగా ఉంటా!



కుప్పంలో ఏర్పాటు చేస్తున్న పలు పరిశ్రమలకు వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తున్న సీఎం చంద్రబాబు

పార్టీ కార్యక్రమాల పట్ల నిర్లక్ష్యాన్ని సహించను

ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులకు సీఎం హెచ్చరిక

'నిర్లక్ష్యం' జాబితాలో 48 మంది ఎమ్మెల్యేలు!

ప్రతిష్ఠాత్మకంగా పింఛన్ల పంపిణీ నిర్వహిస్తున్నాం

స్వయంగా ప్రతినెలా నేనూ హాజరవుతున్నా..

ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు వెళ్లకపోతే ఎలా?

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు మురిగిపోతున్నా పంచరా?

పార్టీ నేతల తీరుపై టీడీపీ అధినేత అసంతృప్తి

అమరావతి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పార్టీ కార్యక్రమాలతో సంబంధం లేనట్లు నిర్లక్ష్యంగా వ్యవహరించే నాయకుల విషయంలో తానూ కఠినంగా ఉండాల్సి ఉంటుందని టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు హెచ్చరించారు. ఎన్ని కార్యక్రమాలు ఉన్నా పక్కన పెట్టి ప్రతి నెలా 1వ తేదీన 'పేదల సేవలో' పేరుతో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో స్వయంగా తాను పాల్గొంటున్నానని, కానీ కొందరు ఎంపీలు,

మిగతా 13వ పేజీలో...

కుప్పానికి పారిశ్రామిక కళ

నియోజకవర్గానికి ఏడు పరిశ్రమలు 13

వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన సీఎం

"సూపర్ జీఎస్టీ అమలు వల్ల రాష్ట్రానికి ఏడాదికి రూ.8 వేల కోట్ల నష్టం వస్తుంది. ఆ మేరకు ప్రజలకు ఆదా అవుతూ, వారి జీవనశైలి మెరుగుపడుతుంది కాబట్టి, జీఎస్టీ 2.0 సంస్కరణలను ఆహ్వానిస్తున్నాం" అని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. క్షేత్రస్థాయిలో చూస్తే జీఎస్టీ పన్నుల తగ్గింపు వల్ల ప్రభుత్వానికి ఎలాగూ నష్టమే వస్తుంది. కానీ, ముఖ్యమంత్రి ఆశించినట్టు ఆ డబ్బు పొదుపు రూపంలో ప్రజలకు కూడా మిగలడం లేదు. కొత్త సంస్కరణల అమలుతో ప్రభుత్వం కోల్పోయే ఆదాయం, సామాన్యుల సేవింగ్స్... రెండూ రిటైల్ మార్కెట్ల మాయాజాలంతో ఆవిరైపోతున్నాయి.

జీఎస్టీ సంస్కరణలకు ముందున్న ధరలు, తర్వాతి ధరల్లోని వ్యత్యాసం తెలిపే బోర్డులు ఏవో కొన్ని దుకాణాల వద్ద తప్ప.. దాదాపుగా ఎక్కడా కనిపించడంలేదు. సూపర్ జీఎస్టీపై ప్రభుత్వ ప్రచార ప్రభావంతో ఎవరైనా.. 'రేట్లు తగ్గించరా..' అని అడిగితే.. పాతస్టాక్ అని.. పరిమాణం పెరిగిందని.. డిస్కౌంట్ ఇస్తున్నామని.. ఈ వస్తువుపై తగ్గింపు లేదంటూ కిరాణాషాపులవాళ్లు ఘరానా మోసాలకు పాల్పడుతున్నారు.

సేవింగ్స్‌కు సూపర్ మస్కా

రిటైలర్ల మాయలో జీఎస్టీ పొదుపు ఆవిరి

కొత్త సంస్కరణల అమలుతో ప్రభుత్వం కోల్పోయే ఆదాయమూ వాళ్ల జేబుల్లోకే!

ధరల్లోని తేడా తెలిపే బోర్డులు లేవు

పాత స్టాక్ అంటూ అవే ధరలకు అమ్మకం

డిస్కౌంట్ ఇస్తున్నామంటూ బాదుడు

ఆరోగ్యంపై భారీగా తగ్గిన జీఎస్టీ

మెడికల్ షాపుల్లో ఆ మేరకు తగ్గని భారం

పాత ధరలకే నిత్యావసరాల విక్రయం

షోరూమ్‌లు, సూపర్ మార్కెట్లలోనే కొత్త ధరలు

కొత్త విధానం వచ్చి 50 రోజులైనా చర్యల్లేవు

ఆకస్మిక తనిఖీలు, విజిలెన్స్ దాడులెక్కడ?



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్ అంటూ ప్రభుత్వం నెలరోజులపాటు రూ.కోట్లు ఖర్చు పెట్టి చేసిన ప్రచార హడావుడి వల్ల సామాన్యులకు ఎలాంటి ప్రయోజనం కనిపించడం లేదు. దసరా నుంచి దీపావళి వరకు 65,000 అవగాహన సమావేశాలతోపాటు, ప్రభుత్వం జీఎస్టీ సంబరాలు కూడా నిర్వహించింది. ఖజానాకు రూ.8 వేల కోట్ల నష్టమైనా పర్లేదు.. ఆ మేరకు ప్రజలకు ఆ డబ్బు ఆదా అవుతుందంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు అసెంబ్లీ వేదికగా సంతోషం వ్యక్తం చేశారు. కానీ, ఆ వేల

మిగతా 13వ పేజీలో...



ఫిర్యాదులకు టోల్‌ఫ్రీ నంబర్
1915
ఎస్ఎమ్ఎస్ సర్వీసుకు
88000 01915

ఎర్రచందనం.. తాకితే తాట తీస్తాం



ఎర్రచందనం గోదాములో దుంగలను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం పవన్



ఒక్క చెట్టు కూడా నరకడానికి వీల్లేదు

శ్రీవారి గాయం నుంచి వచ్చిన చెట్లవి

ఆ పవిత్ర వృక్షాలను నరికితే తీవ్ర పరిణామాలు

ఆపరేషన్ కగార్ తరహాలో స్మగ్లర్ల భరతం పడతాం

వారి ఆస్తులను స్వాధీనం చేసుకొనేలా చట్టం తెస్తాం

కింగ్‌పిన్‌లు, స్మగ్లర్లకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హెచ్చరిక

అటవీ శాఖ గోదాముల్లోని ఎర్రచందనం దుంగల పరిశీలన

మామండూరు అటవీ ప్రాంతంలో ఎకో టూరిజం పార్కు సందర్శన

తిరుపతి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో శేషాచలం అడవులకే పరిమితమైన ఎర్రచందనం వృక్షాలను ఇకపై ఎవరూ తాకొద్దని, ఒక్క చెట్టూ నరకడానికి వీల్లేదని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. తిరుపతి కలెక్టరేట్‌లో శనివారం సాయంత్రం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. శేషాచలం అడవుల్లోనే ఎర్రచందనం ఉండటానికి ఓ ఆధ్యాత్మిక కారణం ఉంది. శ్రీ వేంకటేశ్వర స్వామి గాయం నుంచి పుట్టిన చెట్టు ఇది. అత్యంత పవిత్రమైన వీటిని

మిగతా 2వ పేజీలో...

వైవీ పాత్ర అనుమానాస్పదం





కల్తీ అని తేలిన తర్వాత కూడా అవే సంస్థలను నెయ్యి సరఫరాకు సుబ్బారెడ్డి అనుమతించారు

సందేహం ఉంటే ఖాతాలను తనిఖీ చేయొచ్చు

ఆ అధికారం దర్యాప్తు అధికారికి ఉంటుంది

సుబ్బారెడ్డి దంపతుల పిటిషన్ కొట్టివేయండి

హైకోర్టులో కౌంటరు దాఖలుచేసిన 'సిట్'

అమరావతి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి లడ్డూ తయారీకి నకిలీ నెయ్యి సరఫరా చేసిన వ్యవహారంలో అప్పటి టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పాత్ర అనుమానాస్పదంగా ఉందని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) హైకోర్టుకు నివేదించింది. ప్రీమియర్ అగ్రిఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్, వైష్ణవి డెయిరీ స్పెషాలిటీస్ లిమిటెడ్, భోలేబాబా డెయిరీలు సరఫరా చేసిన నెయ్యిలో కల్తీ జరిగినట్లు తేలినప్పటికీ.. సుబ్బారెడ్డి అప్పట్లో ఆ కంపెనీలపై ఎలాంటి చర్యలూ తీసుకోకపోగా, ఆ తర్వాత కూడా ఆ సంస్థలను ఆయన అనుమతించారని వివరించింది. లావాదేవీలపై అనుమానం వస్తే బ్యాంక్ ఖాతాలను పరిశీలించే అధికారం దర్యాప్తు అధికారికి (ఐవో) ఉంటుందని తెలిపింది. దర్యాప్తును తుదిదశకు తెచ్చేందుకే సుబ్బారెడ్డి, ఆయన సతీమణి స్వర్ణలతారెడ్డి బ్యాంకు ఖాతాల వివరాలు కోరుతున్నామని పేర్కొంది. ఈ నేపథ్యంలో వారిద్దరు దాఖలు చేసిన పిటిషన్లను కొట్టివేయాలని కోరింది. "వైవీ సుబ్బారెడ్డి 2019-23 మధ్య టీటీడీ చైర్మన్‌గా పనిచేశారు. ఆ సమయంలో వచ్చిన ఓ అనామక ఫిర్యాదును 2022 మే 16న టీటీడీ ప్రొక్యూర్‌మెంట్ జీఎం

మిగతా 11వ పేజీలో...

కల్తీ నెయ్యి కేసులో మరో అరెస్టు

కెమికల్ వ్యాపారి అజయ్ అదుపులోకి

కల్తీ నెయ్యిలో వాడిన రసాయనాలు ఈయనే సరఫరా చేసినట్టు నిర్ధారణ

'తిరుమల లడ్డూ కల్తీ' కేసులో ఏ16

రేపు కస్టడీ పిటిషన్ వేయనున్న సిట్ 11



తప్పంతా కొలికపూడిదే!

కఠిన చర్యలు తీసుకోవాలి.. పార్టీ లైన్ దాటి ప్రవర్తించారు

ఒక్క ఆరోపణకూ ఆధారం ఇవ్వలేదు.. సస్పెన్షన్ లేదా అధికారాలు తీసేయాలి

ఎమ్మెల్యే వర్సెస్ ఎంపీ వివాదంపై సీఎంకు క్రమశిక్షణ కమిటీ నివేదిక

మాట్లాడి నిర్ణయం తీసుకుంటానన్న ముఖ్యమంత్రి చంద్రబాబు

అమరావతి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): టీడీపీ నేతలు.. తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) మధ్య తలెత్తిన వివాదంలో తప్పంతా కొలికపూడిదేనని పార్టీ క్రమశిక్షణ కమిటీ తేల్చింది. ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని సిఫారసు చేసింది. ఈ మేరకు శనివారం సీఎం చంద్రబాబుకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు నేతృత్వంలోని కమిటీ సభ్యులు

మిగతా 13వ పేజీలో...

డిసెంబరు 1నుంచి పార్లమెంటు సమావేశాలు

మూడు వారాల పాటు శీతాకాల సెషన్ నిర్వహణ

19న ముగింపు

సమావేశాల వ్యవధిని కుదించడంపై విపక్షాల ఫైర్ 12

పాక్ ఆర్మీ చీఫ్‌కు త్రివిధ దళాలపై పెత్తనం!

కొత్తగా సీడీఎఫ్ పదవి.. పాక్ సెనేట్‌లో బిల్లు

దేశంలో సైన్యం ఆధిపత్యం ఇంకా పెరుగుతుందంటూ విశ్లేషకుల ఆందోళన

వైసీపీ పాలనలో చీకటి రాజ్యం

బీసీలు మాట్లాడితే దాడులు చేశారు

పెట్రోలు పోసి తగలబెట్టారు

ఆ వర్గాల్లో తిరుగుబాటుతోనే కూటమి గెలుపు

కురుబలకు ఇచ్చిన హామీ మేరకే రాష్ట్ర పండుగగా కనకదాస జయంతి

టీటీడీ సహకారంతో బీరప్ప ఆలయాలను కట్టిస్తాం

గుడికట్ల పూజారులకు త్వరలో గౌరవ వేతనం

పవన్ కల్యాణ్‌తో మాట్లాడి కురుబలకు షెడ్లు వేయిస్తా

కల్యాణదుర్గంలో భక్త కనకదాస కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించిన లోకేశ్

ఘనంగా 538వ జయంతి వేడుకలు



కల్యాణదుర్గంలో భక్త కనకదాస విగ్రహావిష్కరణ కార్యక్రమంలో మంత్రులు లోకేశ్, సవిత, పయ్యావుల, ఇతర నాయకులు

అనంతపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ పాలనలో చీకటి రాజ్యం చూశామని, జగన్ పాలనపై బీసీలు మాట్లాడితే దాడులు చేశారని, పెట్రోలు పోసి తగలబెట్టారని మంత్రి లోకేశ్ అన్నారు. ఆ చీకటి పాలనను అంతమొందించేందుకు బీసీలు తిరుగుబాటు చేసి కూటమిని గెలిపించారని

మిగతా 13వ పేజీలో...

మహారాష్ట్ర మంత్రుల మెడకు భూమి కొనుగోళ్ల ఉచ్చు

అక్రమాలు జరిగాయన్న విపక్షాలు 12

అజిత్‌పవార్ కుమారుడు పార్థపవార్ 40 ఎకరాల కొనుగోలు రద్దు

అయినా క్యాన్సిలేషన్ చార్జీల కింద సర్కారుకు 41 కోట్లు చెల్లించాల్సిందే

రవాణా మంత్రి ప్రతాప్ సర్నాయక్ పైనా అక్రమ భూ కొనుగోళ్ల ఆరోపణలు

ముంబైలో 4 ఎకరాలు కేవలం రూ.3 కోట్లకేనా?.. కాంగ్రెస్ నిలదీత



బీజేపీ కురువృద్ధ నాయకుడు ఎల్‌కే అడ్వాణీ 98వ పుట్టినరోజు సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రధాని మోదీ

పిల్లలకు వారు తుపాకులిస్తే.. మేం ల్యాప్‌టాప్‌లిస్తున్నాం

వారి పిల్లలకు పదవులు ఆశిస్తూ మీ పిల్లల భవితను కాలరాస్తున్నారు

ఆర్జేడీ సహా విపక్షాలపై ప్రధాని ఫైర్

విపక్షాలకు '65 వోల్టుల' షాకిచ్చారు

బిహార్‌లో తొలి దశ పోలింగ్‌పై మోదీ

రోడ్డు పక్కన వీవీప్యాట్ స్లిప్పులు

సహాయ రిటర్నింగ్ అధికారిపై వేటు

పట్నా, నవంబరు 8: బిహార్ ఎన్నికల రెండో దశ పోలింగ్ జరగనున్న నియోజకవర్గాల్లో ఎన్డీయే అభ్యర్థుల తరపున ప్రధాన మంత్రి నరేంద్రమోదీ శనివారం సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా ప్రధాన ప్రతిపక్షం ఆర్జేడీ, కాంగ్రెస్ సహా ఇతర విపక్షాలపై నిప్పులు చెరిగారు. సీతామర్హి, బెట్టియా జిల్లాల్లో నిర్వహించిన ప్రచార

మిగతా 12వ పేజీలో...

న్యూస్ పేపర్‌లో మధ్యాహ్న భోజనం!



మధ్యప్రదేశ్‌లోని ఓ బడిలో ఘటన.. వీడియో వైరల్

నా హృదయం ముక్కలైంది.. రాహుల్ గాంధీ ఆవేదన

20 ఏళ్లుగా రాష్ట్రాన్ని ఏలుతున్నారు.. పిల్లల ప్లేట్లనూ దొంగిలిస్తారా?

వారి భవిష్యత్తును చిదిమేస్తున్నందుకు మోదీ సిగ్గుపడాలన్న రాహుల్

సునీత దంపతులపై కేసు పెట్టించిన అధికారుల విచారణ

కేసు నమోదు చేసిన పులివెందుల పోలీసులు

గతంలోనే రాష్ట్ర ప్రభుత్వం ఆదేశం

కర్నూలు డీఐజీకి ఓ వ్యక్తి ఫిర్యాదు కూడా

వివేకా కుమార్తెపై కేసు పెట్టడం వెనుక ఎవరున్నారో తేల్చే పనిలో పోలీసులు

నాడు కేసు నమోదులో ప్రమేయమున్న ఏఎస్ఐ, రిటైర్డ్ ఏఎస్పీల విచారణ

వీరిద్దరూ వైసీపీ అధినేత జగన్‌కు సన్నిహితులే

అప్పటి ఏఎస్పీ రాజేశ్వర్‌రెడ్డి కుమారుడికి ఎంబీబీఎస్ సీటును ఉచితంగా ఇప్పించిన వైనం



పులివెందుల, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె నర్రెడ్డి సునీత, ఆమె భర్త రాజశేఖర్‌రెడ్డి, సీబీఐ ఎస్పీ రామ్‌సింగ్‌పై తప్పుడు కేసు నమోదులో ప్రమేయం ఉన్న అప్పటి పోలీసు అధికారులను పులివెందుల పోలీసులు విచారించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతోపాటు..

మిగతా 12వ పేజీలో...



జయంతి కనకమహాలక్ష్మి



నిందితురాలు లలితాదేవి

12

యూట్యూబ్ చూసి అత్తను చంపిన కోడలు

దొంగా పోలీస్ ఆటంటూ పెట్రోల్ పోసి హత్య

అగ్నిప్రమాదమని ఇరుగుపొరుగును నమ్మించే ప్రయత్నం

విశాఖ జిల్లాలో ఘోరం.. చాదస్తంతో వేధిస్తోందనే!

మస్కట్‌లో గుంతకల్లు మహిళకు నరకం

- ఇండియాకు రప్పించాలని వేడుకోలు
- లోకేశ్‌ను కలిసిన బాధిత కుటుంబం


జుబేదా

గుంతకల్లు టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కోసం మస్కట్ వెళ్లిన జుబేదా బేగం అనే మహిళ తిండికి తిండిలేక నరకం చూస్తున్నారు. తనను స్వదేశానికి తీసుకువెళ్లాలని సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్, గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంను కోరుతూ సెల్ఫీ వీడియోను కుటుంబ సభ్యులకు పంపించారు. అనంతపురం జిల్లా గుంతకల్లు పట్టణానికి చెందిన ఆటో డ్రైవర్ షేక్ ఆలీ బాషా భార్య జుబేదా బేగం బద్వేలుకు చెందిన ఏజెంట్ మహమ్మద్ రఫీ ద్వారా మస్కట్‌కు వెళ్లారు. 8నెలల క్రితం అక్కడ ఓ సేఠ్ ఇంట్లో పని మనిషిగా చేరారు. నాటినుంచి తనకు సరిగా భోజనం పెట్టడం లేదని, జీతం ఇవ్వకుండా హింసిస్తున్నారని, ఆరోగ్యం కూడా దెబ్బతిందని రెండు రోజుల క్రితం సెల్ఫీ వీడియో పంపించారు. తనను కాపాడాలని ఏజెంట్‌కు ఫోన్ చేస్తే.. రూ.2లక్షలు అడుగుతున్నాడని వాపోయారు. ఇక్కడే ఉంటే చచ్చిపోతానని, దయచేసి ఇండియాకు రప్పించాలని వేడుకున్నారు. ఈ విషయాన్ని బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. అలాగే కళ్యాణదుర్గం పర్యటనకు వచ్చిన మంత్రి నారా లోకేశ్ వద్దకు శనివారం బాధితురాలి కుటుంబ సభ్యులను తీసుకెళ్లి సమస్యను వివరించారు. జుబేదాను స్వదేశానికి వెంటనే రప్పిస్తామని మంత్రి లోకేశ్ హామీ ఇచ్చారని బాధిత కుటుంబం తెలిపింది.

ఎర్రచందనం... తాకితే తాట తీస్తాం


అటవీ ప్రాంతంలో కాలి నడకన వెళ్తున్న డిప్యూటీ సీఎం పవన్

(మొదటి పేజీ తరువాయి)

కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. ఆపరేషన్ కగార్ తరహాలో ఎర్రచందనం స్మగ్లర్లు, కింగ్‌పిన్‌లతో పాటు చెట్లను నరికేవారి తాట తీస్తాం" అని పవన్ హెచ్చరించారు. తిరుపతి గోదాములో 2.60 లక్షల ఎర్రచందనం దుంగల నిల్వలు ఉన్నాయని, రెండు దుంగలు కలిపి ఒక చెట్టుగా లెక్కించినా గత ఐదారేళ్లలో 1.30 లక్షల వృక్షాలు నరికివేతకు గురయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్మగ్లర్ల నుంచి పట్టుబడిన ఈ కలప మార్కెట్ విలువ రూ.5వేల కోట్ల వరకు ఉంటుందని తెలిపారు. ఇక పట్టుబడని ఎర్రచందనం ఎంత పరిమాణంలో సరిహద్దులు దాటిందో అంతుబట్టడం లేదన్నారు. గడచిన ఐదారేళ్లలోనే రూ.8 వేల కోట్ల నుంచి రూ.10 వేల కోట్ల విలువైన ఎర్రచందనం అక్రమ రవాణా జరిగిందని, దీనికి గత ప్రభుత్వ యంత్రాంగం అలసత్వమే కారణమని ఆయన ఆరోపించారు. ఎర్రచందనం నరికివేత, అక్రమ రవాణా చేసినా వారిపై కేసులు పెట్టడంతో సరిపెట్టకుండా వారి ఆస్తులు కూడా స్వాధీనం చేసుకునేలా చట్టం తీసుకొస్తామని హెచ్చరించారు. ఇతర దేశాల్లో పట్టుబడే ఎర్ర దుంగల్ని మన దేశానికి అప్పగించేలా కేంద్రం విధానం తీసుకొచ్చిందని, అయితే ఇతర రాష్ట్రాల్లో పట్టుబడే ఎర్రచందనం మాత్రం ఏపీకి రావడం లేదని పవన్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇకపై ఏ రాష్ట్రంలో ఎర్రచందనం పట్టుబడినా దాన్ని ఏపీకి అప్పగించేలా అన్ని రాష్ట్రాలతో ఒప్పందం చేసుకోబోతున్నాం" అని తెలిపారు.


ఎర్రచందనం గోదాములో దుంగలను పరిశీలిస్తున్న పవన్

నలుగురు కింగ్‌పిన్‌లను గుర్తించాం

ఎర్రచందనం స్మగ్లింగ్‌కు సంబంధించి తెర వెనుక కీలకపాత్ర పోషిస్తున్న నలుగురు కింగ్‌పిన్‌లను గుర్తించామని పవన్ వెల్లడించారు. వారిని పట్టుకునే విషయమై కసరత్తు నడుస్తోందని తెలిపారు. స్మగ్లర్ల తరఫున చెట్లు నరికే పని చేపట్టవద్దంటూ స్థానికులను కోరారు. ఇతర రాష్ట్రాల కూలీలకు కూడా అవగాహన కల్పిస్తామని చెప్పారు. ఎర్రచందనం స్మగ్లింగ్ స్వచ్ఛందంగా ఆపేయాలని లేకుంటే చెట్టు కొట్టాలంటేనే భయపడేలా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆపరేషన్ కగార్ తరహాలో కార్యాచరణ చేపట్టేందుకు కసరత్తు చేస్తున్నామని, 6 నుంచి 9 నెలల్లో ఆపరేషన్ ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

డిప్యూటీ సీఎం సుడిగాలి పర్యటన

తిరుపతి పరిసరాల్లో పవన్ శనివారం సుడిగాలి పర్యటన చేపట్టారు. ఉదయం 9.30 గంటలకు తిరుపతి విమానాశ్రయానికి వచ్చారు. అక్కడి నుంచి రేణిగుంట మండలం మామండూరు చేరుకుని అటవీ ప్రాంతంలోని ఏకో టూరిజం ప్రాజెక్టును సందర్శించారు. జలపాతం నుంచి వెళ్లే వాగు వెంబడి కొంతదూరం నడిచారు. కొంతసేపు వాగులో దిగి ప్రకృతి ఒడిలో సేద దీరారు. అడవిలో పలు చెట్ల పేర్లు, ప్రత్యేకతలను అటవీశాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. వాచ్‌టవర్ ఎక్కి శేషాచల అడవులను పరిశీలించారు. తిరుపతి మంగళంలో అటవీశాఖ నిర్వహిస్తున్న 8గోదాముల్లో నిల్వ ఉంచిన ఎర్రచందనం దుంగలను ఆయన పరిశీలించారు. అనంతరం కలెక్టరేట్ చేరుకుని తిరుపతి, అన్నమయ్య, నెల్లూరు, ప్రకాశం, నంద్యాల జిల్లాల డీఎఫ్‌వోలు, ఎస్పీలు, ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక టాస్క్‌ఫోర్స్ అధికారులతో సమావేశమయ్యారు. ఎర్రచందనం స్మగ్లింగ్‌ను పూర్తిగా అరికట్టే విషయమై తీసుకోవాల్సిన చర్యలను సమీక్షించారు.


తొలి స్త్రీ శక్తి హస్తకళ స్టోర్‌ను ప్రారంభించిన భువనేశ్వరి

అమరావతి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): స్త్రీ శక్తి హస్తకళ స్టోర్‌ను ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి శనివారం సాయంత్రం ప్రారంభించారు. ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన 600 మందికిపైగా స్త్రీ శక్తి ఉమెన్ ఆర్టిసియన్స్ సభ్యులు వారి ఉత్పత్తుల మార్కెటింగ్ కోసం హైదరాబాద్‌లో తొలిసారిగా ఈ స్టోర్‌ను ఏర్పాటు చేశారు.

రేవంత్‌కు చంద్రబాబు జన్మదిన శుభాకాంక్షలు

అమరావతి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి ఆంధ్ర ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈమేరకు ఎక్స్‌లో పోస్టు చేశారు. రాష్ట్ర మంత్రి లోకేశ్ కూడా తెలంగాణ సీఎంకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కాగా, ప్రముఖ సీనియర్ బీజేపీ నేత ఎల్‌కే అద్వానీకి కూడా సీఎం చంద్రబాబు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

టైరు పేలి.. జనంపైకి పెళ్లి కారు.. ముగ్గురు మృతి


కిర్లంపూడి మండలం సోమవరం హైవేపై ప్రమాదం జరిగిన ప్రాంతం

కిర్లంపూడి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): హైవేపై వెళ్తున్న కారు టైరు పేలడంతో.. రోడ్డు పక్క బస్టాప్ వద్ద నిలబడి ఉన్నవారిపైకి దూసుకెళ్లి ముగ్గురు మృత్యువాతపడ్డారు కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం సోమవరం గ్రామం వద్ద.. జాతీయ రహదారిపై శనివారం ఈ ప్రమాదం జరిగింది. ఉదయం 7.40గంటల సమయంలో అన్నవరం నుంచి జగ్గంపేట వైపు హైవేపై ఓ పెళ్లి కారు అతివేగంగా వస్తోంది. సోమవరంలో రిక్వెస్ట్ బస్టాప్ వద్దకు వచ్చేసరికి టైరు పేలడంతో కారు అక్కడున్నవారిపైకి దూసుకొచ్చింది. ఈ ఘటనలో కాకాడ రాజు(45), తాతా మనవళ్లు మోర్త ఆనందరావు(65), మోర్త కొండయ్య(30) అక్కడికక్కడే మృతిచెందారు. చీపురుపల్లి ఫణిశ్రీ, కొండ్రాపు చైతన్య, బత్తిన భద్రం తీవ్రంగా గాయపడ్డారు. పరిస్థితి విషమంగా ఉన్న ఇద్దరిని కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. మృతుల కుటుంబీకులకు తక్షణ సాయంగా రూ.25వేల చొప్పున ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అందించారు.

ఢిల్లీ టీటీడీ ఆలయంలోనూ నిత్యాన్నదానం

న్యూఢిల్లీ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): తిరుమలలో మాదిరిగా ఢిల్లీలోని టీటీడీ ఆలయంలో కూడా నిత్య పూజలు, అన్నదానం, సేవా కార్యక్రమాలు త్వరలో నిర్వహిస్తామని ఢిల్లీ టీటీడీ పాలకమండలి చైర్మన్ సుమంత్ రెడ్డి తెలిపారు. కాగా, ఇక్కడి టీటీడీ ఆలయాన్ని ఈవో సింఘాల్, ఏపీ భవన్ స్పెషల్ కమిషనర్ అర్జా శ్రీకాంత్ దర్శించారు. .

నాసా పనితీరుపై ఏపీ విద్యార్థులకు అవగాహన


నాసా రిటైర్డ్ ఇంజనీరు గాబె గాబ్రియెల్లాతో ఏపీ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు

న్యూఢిల్లీ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఏరోస్పేస్ టెక్నాలజీ, నాసా పనితీరుపై ఆ సంస్థలో పనిచేసిన రిటైర్డు ఇంజనీర్లు వివరించారు. ఏపీ సైన్స్ సిటీ సీఈవో కేశినేని వెంకటేశ్వర్లు అధ్వర్యంలో సైన్స్ ఎక్స్‌పోజర్ టూర్ పేరిట ఢిల్లీలో పర్యటించిన 52 మంది విద్యార్థులతో శనివారం, నాసా రిటైర్డ్ ఇంజనీర్ల ముఖాముఖి పరిచయ కార్యక్రమం జరిగింది. కాగా, ఆదివారం విద్యార్థులు ఢిల్లీ నుంచి విమానంలో విజయవాడకు బయలుదేరి వెళ్లనున్నారు.

ఆరుగురు మెడికోలపై ఎలుక దాడి!

ఏలూరు క్రైం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఏలూరు ప్రభుత్వ మెడికల్ కళాశాలకు చెందిన విద్యార్థులపై ఎలుక దాడి చేసింది! నిద్రపోతున్న సమయంలో ఏకంగా ఆరుగురిని కరవడంతో వారంతా శనివారం ప్రభుత్వాసుపత్రిలో యాంటీ రేబిస్ వ్యాక్సిన్ డోసు వేయించుకున్నారు. విద్యార్థులు స్థానిక ప్రభుత్వాసుపత్రి ఆవరణలోని మెడికల్ కాలేజీ హాస్టల్‌లో ఉంటున్నారు. కాలేజీ భవనాలు నిర్మాణాలు జరుపుతున్న నేపథ్యంలో అక్కడున్న పొదలు, చెట్లను కొట్టి వేయడంతో ఆ ప్రాంతంలో ఉండే ఎలుకలు, ఇతర విషపురుగులు ఆస్పత్రి, హాస్టల్‌లోకి వస్తున్నాయి. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహిస్తున్నప్పటికీ.. ఆస్పత్రి అధికారులు మాత్రం నెలనెలా లక్షలాది రూపాయల బిల్లులు మంజూరు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

రాష్ట్రంలో పెరుగుతున్న చలి

విశాఖపట్నం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో ఈశాన్య రుతుపవనాలు బలహీనంగా ఉన్నాయి. దీంతో రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో పగటిపూట ఎండ కొనసాగడంతోపాటు పొడి వాతావరణం నెలకొంది. మరోవైపు ఉత్తర, మధ్య భారతంలో రాత్రిపూట చలి ఒక్కసారిగా పెరిగింది. ఆ ప్రభావంతో కోస్తాలో పలు చోట్ల చలి పెరిగింది. అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగులలో శనివారం 14.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న రెండు, మూడు రోజులు రాష్ట్రవ్యాప్తంగా అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు. ఈనెల రెండో వారం తర్వాత బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని, దీని ప్రభావంతో దక్షిణ కోస్తా, రాయలసీమల్లోని కొన్ని ప్రాంతాల్లో వర్షాలు కురుస్తాయని తెలిపారు.

సీజేఐ దళితుడు కాబట్టే.. ఆ న్యాయవాదిని అరెస్టు చేయలేదు: మంద కృష్ణ

చిత్తూరు అర్బన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు సీజే బీఆర్ గవాయ్‌పై బూటు విసిరి దాడి చేయబోయిన న్యాయవాదిని ఇంకా ఎందుకు అరెస్టు చేయలేదని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ప్రశ్నించారు. సీజేఐ దళితుడు అయినందునే దాడి చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవడానికి వ్యవస్థలు ఆసక్తి చూపించడం లేదన్నారు. ఈ నెల 17న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపడుతున్నామని, న్యాయ వ్యవస్థపై గౌరవమున్న ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమానికి తరలిరావాలని కోరారు.

చంద్రయాన్-2 నుంచి కొత్త డేటా

సూళ్లూరుపేట, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): చంద్రుడిపై సాఫ్ట్ ల్యాండ్ కావడంలో చంద్రయాన్-2 విఫలమైనా.. ఆ ఆర్బిటర్ కీలక సమాచారాన్ని మాత్రం భూమిపైకి పంపుతూనే ఉంది. ఈ క్రమంలోనే చంద్రయాన్-2 అందించిన డేటాను ఇస్రో తాజాగా విడుదల చేసింది. జాబిల్లిపై మట్టి ఎలా ఉంది? నీటి జాడలు ఎక్కడ ఉన్నాయనే వాటిపై మరిన్ని పరిశోధనలు చేసేందుకు ఆ డేటా కీలకం కానుంది. చంద్రుడిపైకి మరిన్ని ప్రయోగాలు చేసేందుకు ఈ సమాచారం మరింత ఉపయోగపడనుంది. చంద్రయాన్-2 నుంచి సేకరించిన సమాచారంతో అధునాతన డేటాను అభివృద్ధి చేస్తున్నట్లు ఇస్రో ఓ ప్రకటనలో వెల్లడించింది. జాబిల్లిపై పరిశోధనల కోసం ఇస్రో 2019లో చంద్రయాన్-2 ప్రయోగం చేపట్టిన సంగతి తెలిసిందే. అయితే చంద్రయాన్-2లో ల్యాండర్ జాబిల్లి ఉపరితలంపై సాఫ్ట్ ల్యాండింగ్ కాలేకపోయింది. అయితే చంద్రయాన్-3 మాత్రం చంద్రుడి దక్షిణ ధ్రువంపై విజయవంతంగా ల్యాండ్ అయింది. అయితే చంద్రయాన్-2 పూర్తిగా విజయవంతం కాకపోయినా చంద్రుడి ధ్రువ ప్రాంతాలకు సంబంధించి అత్యంత నాణ్యమైన డేటాను అందిస్తూనే ఉంది. ఈ సమాచారం ఆధారంగా ఇస్రో కీలక విషయాలను వెల్లడించింది. తొలి పోలార్ మ్యాప్‌ను తాజాగా విడుదల చేసింది. చంద్రుడిపై నీరు, మట్టి జాడలకు సంబంధించిన విషయాలను వీటి ద్వారా శాస్త్రవేత్తలు విశ్లేషిస్తున్నారు.

పోలీసు స్టేషన్‌పై అనుచిత వ్యాఖ్యలు

- స్టేషన్‌లో మాజీ మంత్రి అప్పలరాజు విచారణ
- పత్రాలపై సంతకాలు తీసుకుని వదిలేసిన కాశీబుగ్గ పోలీసులు.. అనుచరుల హల్చల్


పోలీసుస్టేషన్‌లో సీదిరి అప్పలరాజు

పలాస, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, శ్రీకాకుళం జిల్లా పలాస నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్త సీదిరి అప్పలరాజును కాశీబుగ్గ పోలీసులు శనివారం విచారించారు. పోలీసు స్టేషన్‌కు పసుపు రంగులు వేస్తామని, 'ప్రైవేటు పోలీసు స్టేషన్' అనే పేరు పెడతామని వ్యాఖ్యానించిన నేపథ్యంలో గత ఏడాది కేసు నమోదు చేశారు. తాజాగా ఈ కేసులో విచారణకు రావాలని పేర్కొంటూ శనివారం ఆయనకు నోటీసులు జారీ చేశారు. దీంతో మధ్యాహ్నం 2.30 గంటలకు అప్పలరాజు తన లాయర్ సహా అనుచరులతో కలిసి పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. 3గంటల నుంచి ఆయన్ను విచారణ అధికారి ఎస్ఐ నరసింహమూర్తి, ఏఎస్పీ శ్రీనివాసరావులు రాత్రి 9.45 గంటల వరకు పలు కోణాల్లో సుదీర్ఘంగా విచారించారు. అనంతరం కొన్ని పత్రాలపై సంతకాలు తీసుకుని పంపించేశారు. కాగా, ఈ విషయం తెలుసుకున్న వైసీపీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పోలీస్ స్టేషన్‌కు చేరుకుని హల్చల్ చేశారు. దీంతో కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్ సబ్‌డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్ఐలు, కానిస్టేబుల్స్, ఏఆర్ సిబ్బంది స్టేషన్‌కు చేరుకుని ఎలాంటి ఉద్రిక్తతలకు అవకాశం ఇవ్వకుండా పర్యవేక్షించారు.

వివాదాల అప్పలరాజు!

కూటమి ప్రభుత్వంపై తరచుగా వివాదాస్పద వ్యాఖ్యలు చేసే అప్పలరాజు.. గతేడాది అక్టోబరు 27న పలాసలోని తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. "బాలికపై దాడి చేసిన వ్యక్తులపై పోక్సో కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. అదేవిధంగా పోలీస్ స్టేషన్‌లో మా పార్టీ కార్యకర్తలపై దాడి చేసిన వ్యక్తులపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలి. అలా కేసులు పెట్టకపోతే ఒక పోలీస్‌స్టేషన్ ఇక్కడ ఉందన్న విషయం కూడా మేం భావించం. పోలీస్‌స్టేషన్‌కు పసుపు రంగు వేసి తాళాలు వేస్తాం. 'ప్రైవేటు పోలీస్‌స్టేషన్' అని పేరు పెట్టి దానిని ఎస్పీతో ప్రారంభించేలా చేస్తాం." అని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలపై పలాస మండలం కిష్టుపురం గ్రామానికి చెందిన బి. విజయకృష్ణరాజు కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రజలను రెచ్చగొడుతూ, ప్రభుత్వాన్ని కించపరుస్తూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ప్రైవేటు పోలీస్ స్టేషన్ పెడతామంటూ తప్పుడు భావజాలాన్ని ప్రజల్లోకి పంపిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజల మధ్య, రెండు పార్టీలు, కులాలు, గ్రూపుల మధ్య విద్వేషాలు కలిగిస్తున్నారని, ప్రజల ప్రశాంతతకు భంగం కలిగిస్తున్నారని ఫిర్యాదులో తెలిపారు. దీనిపై కాశీబుగ్గ పోలీసులు అప్పట్లోనే కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో శనివారం అప్పలరాజుకు నోటీసులు జారీ చేసి విచారణకు హాజరుకావాలని కోరారు.

పోలవరం ప్రధాన డ్యామ్

పనులన్నీ భేష్

- ఇదే జోరు కొనసాగిస్తే 2027 నాటికి ప్రాజెక్టు పూర్తి
- నిధులకు ఢోకా లేదు: పీపీఏ సీఈవో అతుల్‌జైన్
- నిర్మాణ పనుల పరిశీలన.. నాణ్యతపై సంతృప్తి


పోలవరం ప్రాజెక్టును పరిశీలిస్తున్న పీపీఏ సీఈవో అతుల్ జైన్, అధికారులు

అమరావతి/పోలవరం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు ప్రధాన డ్యామ్ పనులన్నీ నాణ్యతా ప్రమాణాలతో లక్ష్యం మేరకు జరుగుతున్నాయని పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) సీఈవో అతుల్‌జైన్ సంతృప్తి వ్యక్తం చేశారు. శనివారం పోలవరం ప్రాజెక్టు ప్రాంతంలో ఈఎన్సీ నరసింహమూర్తి బృందం, పీపీఏ ఇంజనీరింగ్ సిబ్బందిని వెంటబెట్టుకుని ఆయన పర్యటించారు. ప్రాజెక్టులోని ఎర్త్‌కమ్ రాక్‌ఫిల్ డ్యామ్‌లో గ్యాప్-1, గ్యాప్-2 ప్రాంతాల్లో 800 చానల్ వద్ద డివాల్ కటింగ్ పనులు, డయాఫ్రమ్‌వాల్ నిర్మాణ తీరును పరిశీలించారు. అధికారులను అడిగి పనుల పురోగతిని తెలుసుకున్నారు. ప్రాజెక్టు ప్రాంతంలో ఏర్పాటు చేసిన నాణ్యతా ప్రమాణాల టెస్టింగ్ ల్యాబ్‌ను సందర్శించారు. ల్యాబ్‌లో పోలవరం నిర్మాణాలకు సంబంధించి చేపడుతున్న క్వాలిటీ పరీక్షా విధానాన్ని అతుల్‌జైన్ బృందం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసింది. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు సహాయ పునరావాస కార్యక్రమాల అమలు, పరిహారం చెల్లింపులపై ఈఎన్సీ నరసింహమూర్తిని అడిగి అతుల్ జైన్ తెలుసుకున్నారు. ఇటీవల పోలవరం నిర్వాసితులకు రూ.1000 కోట్ల మేర నిధులను ఖాతాలలో జమ చేసే కార్యక్రమాన్ని చేపట్టామని ఈఎన్సీ వివరించారు. కేంద్ర ప్రభుత్వ నిధి పోర్టల్‌లో ఎదురవుతున్న సాంకేతిక సమస్యల కారణంగా పరిహారం బల్క్‌గా కాకుండా వ్యక్తిగతంగా ఒక్కొక్కటిగా పంపాల్సి వస్తోందని, దీనివల్ల సమయం ఎక్కువ తీసుకుంటోందని తెలిపారు. కేంద్రం పోలవరం కోసం విడుదల చేసిన నిధులు రాష్ట్ర ప్రభుత్వం వద్ద రూ.750 కోట్ల దాకా ఉన్నాయని, వాటిని వినియోగించాక భవిష్యత్తులో అవసరమైన నిధుల గురించి పోలవరం ప్రాజెక్టు అధికారులు వివరించారు. పోలవరం నిర్మాణానికి సంబంధించి నిధులకు ఎలాంటి ఢోకా లేదని, కోరిన వెంటనే మంజూరు చేస్తామని అతుల్ జైన్ స్పష్టం చేశారు. ఇదే జోరు కొనసాగిస్తే 2027 నాటికి ప్రాజెక్టు పూర్తి అవుతుందని అన్నారు. ఈ నెలలో సీఈవో అతుల్ జైన్ ఉద్యోగ విరమణ చేయనున్న నేపథ్యంలో ఈఎన్సీ కె.నరసింహమూర్తి, జల వనరులశాఖ అధికారులు ఆయనను శాలువాలతో సత్కరించి వేంకటేశ్వర స్వామి ప్రతిమ అందజేశారు. అథారిటీ సభ్య కార్యదర్శి ఎం.రఘురామ్, ఎస్ఈ రామచంద్రరావు, పవర్ హౌస్ సీఈ సి.వెంకటసుబ్బయ్య, డిప్యూటీ డైరెక్టర్లు కె.శంకర్, డీఎస్ ప్రసాద్, ఎ.ప్రవీణ్, క్వాలిటీ కంట్రోల్ సీఈ కె.శేషుబాబు, ఈఈలు డి.శ్రీనివాస్, కె.బాలకృష్ణ, ఎస్.ప్రేమ్‌చంద్, సీహెచ్ నరసింహరాజు, మెగా ఆపరేటింగ్ ఆఫీసర్ అంగర సతీశ్‌బాబు, జనరల్ మేనేజర్ ఎ.గంగాధర్, డిప్యూటీ మేనేజర్ పమ్మి మురళి తదితరులు పాల్గొన్నారు. పోలవరం ప్రాజెక్టు పరిశీలన అనంతరం అతుల్ జైన్ బృందం హైదరాబాద్‌కు, అక్కడ నుంచి ఢిల్లీకి బయల్దేరింది.

సీసీఐకి శఠగోపం

- కేంద్రాలు ప్రారంభం కాకుండానే దూది బేళ్లు సిద్ధం
- కాటన్ కార్పొరేషన్ నమూనాలో ప్యాకింగ్
- ఒక్కటైన జిన్నర్లు, బయ్యర్లు సీఎండీ, విజిలెన్స్‌కు ఫిర్యాదులు

(గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి)

గుంటూరు జిల్లా పత్తి వ్యాపారులు సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా)కి శఠగోపం పెడుతున్నారు. సీజన్‌లో అధికారికంగా ఇంకా కొనుగోలు ప్రక్రియ ఆరంభం కాకుండానే సీసీఐకి బేళ్లు సిద్ధం చేస్తుండటం వెలుగులోకి వచ్చింది. గత కొన్ని సంవత్సరాల నుంచి ఇదే తంతు కొన్ని చోట్ల కొనసాగుతున్నట్టు తెలిసింది. ప్రస్తుతం రాష్ట్రంలోనూ, పక్కనే తెలంగాణలోనూ నెమ్ము ఎక్కువగా ఉందన్న కారణంతో సీసీఐ పత్తి కొనుగోలు చేయటం లేదు. ఆ నేపథ్యంలో రైతుల నుంచి అదే పత్తిని వ్యాపారులు కారు చౌకగా కొనుగోలు చేసి జిన్నింగ్ ప్రక్రియ నిర్వహిస్తున్నారు. ఈ తంతు అంతా గుంటూరులో ఇప్పటికే సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు గుర్తించిన మిల్లుల్లోనే ఎక్కువగా జరుగుతోంది. నాసిరకం పత్తితో తయారు చేసిన దూది బేళ్లను సీసీఐ నమూనాలో ప్యాక్ చేసి గొడన్లకు తరలిస్తున్నారు. సీజన్ ఆరంభమయ్యాక అవే దూది బేళ్లను సీసీఐ ఖాతాలోకి నెట్టేస్తారు. ఇందులో బయ్యర్ల పాత్ర కూడా ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గుట్టుచప్పుడు కాకుండా జరుగుతున్న ఈ వ్యవహారం బహిర్గతం కావటంతో కలకలం రేగుతోంది. గుంటూరు సమీపంలోని కొన్ని జిన్నింగ్ మిల్లుల్లో కృష్ణా జిల్లాకు సంబంధించిన పత్తి కొనుగోలు కేంద్రాలు ఎంపిక చేశారు. అలా ఎంపికైన ఒక కేంద్రంలో సీసీఐ నమూనాలో దూది బేళ్లు సిద్ధం చేస్తున్నారు.

నిద్ర పోతున్న నిఘా

కొన్ని సీసీఐ కేంద్రాల్లో అక్రమాలు జరుగుతున్నట్టు ఎప్పటి నుంచో ఆరోపణలు ఉన్నాయి. అయినా సీసీఐ ఏర్పాటు చేసిన నిఘా విభాగం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోంది. నాసిరకం పత్తిని తీసుకువచ్చి జిన్నింగ్ చేసి సీసీఐ నమూనాలో ప్యాక్ చేస్తున్నా సంబంధిత అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. అక్రమాలపై సీసీఐ విజిలెన్స్‌కి కూడా ఫిర్యాదులు వెళ్లినా పెద్దగా స్పందన లేదు. గుంటూరులో దూది బేళ్లను సిద్ధం చేస్తున్న వ్యవహారంపై సీసీఐ సీఎండీకి ఫిర్యాదులు వెళ్లాయి. ఈ వ్యవహారంలో సీసీఐ అధికారుల హస్తం కూడా ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది.


పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసేందుకు గుంటూరులో గుర్తించిన జిన్నింగ్ మిల్లులో సీసీఐ నమూనాలో సిద్ధం చేసిన దూది బేళ్లు


కెనరా బ్యాంకు ఎండీ కె.సత్యనారాయణరాజుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆఫీసర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె.రవికుమార్ తదితరులు

దేశ ప్రగతిలో కెనరా బ్యాంకుది ముఖ్య భూమిక

- ఎండీ కె.సత్యనారాయణ రాజు
- విశాఖలో బ్యాంకు ఆఫీసర్స్ అసోసియేషన్ 20వ త్రైవార్షిక జాతీయ మహాసభలు ప్రారంభం

సాగర్‌నగర్ (విశాఖపట్నం), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రగతిలో కెనరా బ్యాంకు ముఖ్య భూమిక పోషిస్తున్నదని బ్యాంకు మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ కె.సత్యనారాయణరాజు అన్నారు. శనివారం ఆయన విశాఖపట్నంలోని ఓ హోటల్‌లో కెనరా బ్యాంకు ఆఫీసర్స్ అసోసియేషన్ 20వ త్రైవార్షిక జాతీయ మహాసభలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యనారాయణరాజు మాట్లాడుతూ.. ప్రభుత్వ రంగంలోని అతిపెద్ద బ్యాంకుల్లో 'కెనరా' ఒకటన్నారు. బ్యాంకు అభివృద్ధిలో ఆఫీసర్స్ అసోసియేషన్ పాత్ర ఎనలేనిదని కొనియాడారు. తెలుగు యువకుడైన రవికుమార్ నాయకత్వంలో దేశవ్యాప్తంగా ఉన్న బ్యాంకు అధికారులంతా ఏకతాటిపై నడిచి అందిస్తున్న సేవలు దేశ ప్రగతికి ఎంతో దోహదపడుతున్నాయని చెప్పారు. అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె.రవికుమార్ మాట్లాడుతూ ఐకమత్యమే తమ బలమని, అదే తమను దేశంలో రెండో అతి పెద్ద ట్రేడ్ యూనియన్‌గా నిలిపిందన్నారు. బ్యాంకు అధికారుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా, దేశ ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. అనంతరం సత్యనారాయణరాజు జీవితంలో ఎదిగిన క్రమాన్ని వివరిస్తూ రూపొందించిన పుస్తకాన్ని ఆయన మాతృమూర్తి రామసీత ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హర్దీప్‌సింగ్ అహ్లూవాలియా, విజయవాడ సర్కిల్ జనరల్ మేనేజర్ విజయలక్ష్మి, కమిటీ ఛైర్మన్ రమాప్రసాద్, దేశవ్యాప్తంగా ఉన్న అసోసియేషన్ ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

నేడు శంకర్ నేత్రాలయకు సీఎం చంద్రబాబు

గుంటూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా పెదకాకానికి సమీపంలోని శంకర్ నేత్రాలయకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదివారం సాయంత్రం రానున్నారు. ఆస్పత్రిలో నూతనంగా నిర్మించిన దుర్గం నాగ మనోహర్ బ్లాక్‌ను ఆయన ప్రారంభించనున్నారు. దీనికి సంబంధించి షెడ్యూల్ ఖరారు కావడంతో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పీ వకుల్ జిందాల్ శనివారం రాత్రి హెలిప్యాడ్ ప్రాంతాన్ని, సభా వేదిక ప్రాంగణాన్ని, హాస్పటల్లోని అన్ని ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు.



అదానీ కృష్ణపట్నం పోర్టులో రికార్డు స్థాయిలో ఎరువుల దిగుమతి

ముత్తుకూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా ముత్తుకూరు మండలంలోని అదానీ కృష్ణపట్నం పోర్టు 2,23,419 మెట్రిక్ టన్నుల సరుకుతో ఏకకాలంలో లంగరు వేసిన ఐదు నౌకల నుంచి శనివారం ఎరువులను సమర్థంగా దిగుమతి చేసి రవాణా చేయడం ద్వారా రికార్డు సాధించింది. ఈ విజయం ఆదానీ కృష్ణపట్నం పోర్టు (ఏకేపీఎల్) అధునాతన మౌలిక సదుపాయాలు, సిబ్బంది సమర్థతకు నిదర్శనంగా నిలిచింది. ఈ సందర్భంగా పోర్టు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జగదీష్ పటేల్ మాట్లాడుతూ ఒకే ఆపరేషన్‌లో ఐదు నౌకలలో రెండు లక్షల టన్నులకు పైగా ఎరువుల దిగుమతిని విజయవంతంగా నిర్వహించడం గర్వంగా ఉందన్నారు. దేశ తూర్పు తీరంలో ఎరువుల దిగుమతులు, రవాణా కీలక కేంద్రంగా ఏకేపీఎల్ స్థానాన్ని బలోపేతం చేస్తోందన్నారు.

అనంతలో కొనసాగుతున్న రెవెన్యూ క్రీడా పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా కేంద్రంలోని ఆర్డీటీ స్టేడియంలో 7వ రాష్ట్ర స్థాయి రెవెన్యూ ఉద్యోగుల క్రీడ, సాంస్కృతిక పోటీలు రెండో రోజైన శనివారం కొనసాగాయి. ఏపీ రెవెన్యూ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు, ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచో ఫెర్రర్ పోటీలను పరిశీలించారు. క్యారమ్స్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, త్రోబాల్, టెన్నికాయిట్, టేబుల్ టెన్నిస్, చెస్, అథ్లెటిక్ పురుషులు, మహిళల విభాగాలలో పోటీలు తుది దశకు చేరాయి. క్రికెట్‌లో విశాఖపట్నంపై గెలిచి అనంతపురం జట్టు ఫైనల్‌కు చేరింది. ఈ పోటీలు ఆదివారంతో ముగుస్తాయి.

సత్యసాయి శత జయంతికి ప్రధాని, సీఎం

- పటిష్ఠ భద్రత కల్పించాలి: అధికారులతో కలెక్టర్ శ్యాం ప్రసాద్

పుట్టపర్తి టౌన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలో జరిగే సత్యసాయి శత జయంతి ఉత్సవాలకు ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరవుతారని కలెక్టర్ శ్యాంప్రసాద్ తెలిపారు. ఎస్పీ సతీష్ కుమార్‌తో కలసి భద్రతా ఏర్పాట్లపై శనివారం సమీక్ష నిర్వహించారు. అంతకు మునుపు ఎస్పీ, సత్యసాయి సెంట్రల్ ట్రస్టు సభ్యులు ఆర్‌జే రత్నాకర్, జేసీ మౌర్య భరద్వాజ్, అడిషనల్ ఎస్పీ సూరానా అంకితా మహావీర్‌తో కలసి పుట్టపర్తిలో ప్రధాని పర్యటించే ప్రదేశాలను పరిశీలించారు.



> విచారణ లేని నిర్బంధాలు ఒక ప్రత్యామ్నాయ శిక్షా విధానం. దీని నష్టం విస్తృతమైనది. నిందితుల న్యాయబద్ధ జీవనాధారాన్ని ఇది దెబ్బతీస్తుంది; వారి సామాజిక విశ్వసనీయతను నాశనం చేస్తుంది; నిరాశ్రయులను చేస్తుంది; తిరిగి నేరం చేసి, జైలుకు వెళ్లే పరిస్థితులను సృష్టిస్తుంది. ఈ పద్ధతి నేరాల నుంచి సమాజాన్ని రక్షించేది కాదు.

న్యాయ సహాయం రాజ్యాంగ బాధ్యత

సెల్‌ఫోన్ దొంగతనం చేశాడని అతణ్ణి అరెస్ట్ చేశారు. దాంతో కుటుంబంతో సంబంధం పూర్తిగా తెగిపోయింది. పోలీసులు ఏర్పాటు చేసిన న్యాయవాది కోర్టు నుంచి బెయిల్ తీసుకున్నాడు. అయినా నిందితుడు ఆరు నెలలుగా జైల్లోనే ఉన్నాడు. ఇక్కడ అతడి పేరు అవసరం లేదు, అతనొక సర్వనామం.

2023లో, బెయిల్ ఉన్నా 24,000 మంది ఖైదీలుగా ఉన్నారని సుప్రీంకోర్టు వెల్లడించింది. సగం రాష్ట్రాలు సమాచారం ఇవ్వలేదు కాబట్టి ఇది కనీస అంచనా. కారణాలు అనేకం. మేజిస్ట్రేట్ కోర్టులు బెయిల్ సమాచారాన్ని జైళ్లకు నేరుగా పంపడం లేదు. బెయిల్ షరతుల కంటే అడ్వకేట్ షరతులు భారమైతే నిందితునికి కష్టమే. సగటు నిందితుడికి పోలీసుల పట్ల ఉండే భయమే ఆయన పట్లా ఉంటుంది. ఈ పరిస్థితిలో ఇంకొక న్యాయవాది కానీ, న్యాయమూర్తి కానీ జోక్యం చేసుకోరు. మీకు, న్యాయవాదికి మధ్య బంధం 'పవిత్రమైనది'. అది జవాబుదారీతనానికి అతీతం.

గత కొన్నేళ్లుగా, ఏడాదికి 17 నుంచి 18 లక్షల మంది జైళ్లలో నిర్బంధితులవుతున్నారు. అధికారిక గణాంకాలు 'విచారణలో ఉన్న ఖైదీలు 73 శాతం' అంటాయి. కానీ వాస్తవ సంఖ్య 91 శాతం. వీరంతా న్యాయబద్ధంగా, చట్టరీత్యా నిర్బంధంలో ఉన్నారని ప్రాసిక్యూటర్స్ కూడా చెప్పలేరు. జరుగుతున్నదేమిటో పోలీసులకు, కోర్టులకు బాగా తెలుసు. 'నేరం రుజువు కానంత వరకు ప్రతి నిందితుడూ అమాయకుడే' అనే సూత్రం శతాబ్దాల పోరాట ఫలితం. రాజ్యాంగంలోని 22వ అధికరణ 'కస్టడీలో ఉన్న ఏ వ్యక్తికీ న్యాయవాదిని సంప్రదించే హక్కు, రక్షించుకునే హక్కును నిరాకరించరాదు'



అంటుంది. పోలీసులకు, న్యాయవాదులకు, న్యాయమూర్తులకు వర్తించే ఆదేశం ఇది. రాజ్యాంగ నిర్మాతలు వలస రాజ్యంలో చవిచూసిన అనుభవం ఈ అధికరణకు పునాది. వ్యక్తి స్వేచ్ఛ సహజమైన విషయంగా, దాన్ని ఉల్లంఘించడం అధికార స్వభావంగా ఈ అధికరణ తెలుపుతున్నది. చట్టబద్ధమైన, న్యాయబద్ధమైన కారణం లేకుండా, వ్యక్తి స్వేచ్ఛను అడ్డుకోవడం రాజ్యాంగ విరుద్ధం. ముఖ్యంగా, న్యాయ సహాయం ద్వారా రక్షణ పొందే హక్కును ఎవరూ అడ్డుకోడానికి వీలులేదు. న్యాయ సమ్మతమైన కారణం లేకుండా వ్యక్తి స్వేచ్ఛను నిరాకరించే ప్రయత్నాన్ని ఎవరు చేసినా అడ్డుకునే బాధ్యత న్యాయవ్యవస్థ మీద ఉంది. కానీ ఈ నిబద్ధత– కార్యనిర్వాహక వర్గం పట్ల, న్యాయ వ్యవస్థ వైఖరి మీదా ఆధారపడుతుంది. ఫలితం స్పష్టం: విచారణ లేని నిర్బంధాలు లక్షల్లో!

నిందితుడికి, ప్రభుత్వానికి మధ్య ఉన్న అసమ సంబంధంలో ఎవరు ఓడిపోతారో తెలుసు. మరి రాజ్యాంగం హామీ ఇచ్చిన న్యాయానికి పట్టే గతేమిటి? ఈ ప్రశ్న ఫలితంగా చాలా దేశాల్లో న్యాయ సహాయం హక్కు నిందితుడికి వచ్చింది. అధికరణ 39A భారత రాజ్యాంగంలో చేరింది. 9 నవంబర్ 1995 నుంచి అమలుకు వచ్చిన న్యాయ సహాయ చట్టానికి నేటికి సరిగ్గా ముప్పై ఏళ్లు. అయినా 2023లో 11 శాతం మంది ఖైదీలకు మాత్రమే న్యాయ సహాయం అందింది.

బలహీనులు న్యాయం పొందడానికి న్యాయ సహాయం, లీగల్ డిఫెన్స్ ఒక ముఖ్య ఆయుధం కావాలి. రాజ్యాంగ న్యాయమంటే దయా భిక్ష కాదు, కాబట్టి న్యాయ సహాయం కూడా ధర్మం కావడానికి వీల్లేదు. న్యాయం అర్థించే వారిలో 90 శాతం మంది దళితులు, ఆదివాసీలు, నిరక్షరాస్యులు, నిరుద్యోగులు ఉంటే, ప్రతి న్యాయవ్యవస్థా ఈ హక్కును ఆచరణలోనూ ఆమోదించాలి. కానీ అది ధర్మంగా కూడా కాలేదు. 2023లో వ్యవస్థ చేసిన మొత్తం ఖర్చులో సింహ భాగం పోలీసుల మీద పెట్టి, న్యాయ సహాయం అందించడానికి ఒక శాతం కంటే తక్కువ తెలంగాణ ఖర్చు చేసింది. 'నిందితులకు ఆచరణలో హక్కులు ఉండవు' అనే పాలనా నీతి ఇది. రాజ్యాంగ రక్షణకు వ్యవస్థ లోపల నుంచి పట్టించిన తుప్పు ఇది. ఈ స్థితికి కారణాలు అనేకం.

దీర్ఘకాలం జైళ్లలో ఉన్న వారి సంఖ్య క్రమేపీ పెరుగుతూ ఉంది. మెజారిటీ మేజిస్ట్రేట్ కోర్టులు కారణాలు నమోదు చేయకుండా బెయిళ్లు నిరాకరిస్తున్నాయి. కొత్త నేరస్మృతిలో శిక్షలు పెంచారు, బెయిల్ హక్కు ఉన్న నేరాలను బెయిల్ హక్కు లేని నేరాలుగా మార్చారు. ఇది రాజ్యాంగ రక్షణల వ్యతిరేక వైఖరి.

నిందితులందరికీ న్యాయ సహాయం అందించాలనే లక్ష్యంతో జాతీయ న్యాయ సేవా సంస్థ 2023లో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ న్యాయవాదులను కాంట్రాక్టు ప్రాతిపదికన నియమించింది. వ్యక్తి స్వేచ్ఛను రక్షించాలంటే, ప్రాసిక్యూషన్ అనుసరించే రివాజు పద్ధతులను వీరు ఎదుర్కోవాలి. నేరాల వల్ల బాధితులైన వ్యక్తుల పేరు మీద, వ్యవస్థ బాధితులను సృష్టించే వైఖరిని వ్యతిరేకించాలి. సహేతుకమైన కారణాలు లేని ఖైదును నిరసించాలి. జైలు నిర్బంధాన్ని చివరి చర్యగా కాకుండా, యథాలాపంగా ప్రయోగించడం రాజ్యాంగ విరుద్ధం అని వాదించాలి. ప్రతీకార ప్రజాభిప్రాయానికి వెరసి జైళ్లను నింపుతున్న న్యాయస్థానాలను జవాబుదారీ చేయాలి.

విచిత్రంగా మేజిస్ట్రేట్ కోర్టులకు బెయిల్ వ్యవహారం ప్రధాన కర్తవ్యం కాదు. నెలకు 18 కేసులలో విచారణ పూర్తి చేయాలని వాటికి హైకోర్టుల నుంచి నిర్దేశం ఉన్నది. ఫలితంగా బెయిల్ కేసులను పరిష్కరించడం వాటికి అప్రధానమైపోయింది. ప్రతి బెయిల్ ఆర్డర్‌ను 24 నాలుగు గంటలలో జైళ్లకు ఈ–మెయిల్ ద్వారా పంపాలన్న సుప్రీంకోర్టు ఆదేశానికి నాలుగేళ్లయినా దిక్కులేదు. ఈ కోర్టులకు, ఖైదీలకు మధ్య కమ్యూనికేషన్ ఉద్దేశపూర్వకంగానే వెనుకబడిపోయింది. ఇది లక్షల మంది జీవన్మరణ సమస్య.

దీర్ఘకాలం జైల్లో ఉన్నవారి కేసులను 'పరిష్కరించడానికి' జైలు అదాలత్‌లు ప్రారంభించారు. ఆ ఖైదీలు అక్కడ నుంచి బయటపడేందుకు 'నేరం చేశామని' ఒప్పుకోలు ఇచ్చేలా ఇది పరోక్షంగా ఒత్తిడి చేస్తుంది. ఈ అంగీకారాన్ని స్వచ్ఛందమని అనలేం. ఈ ఒప్పుకోలు అన్యాయంగా శిక్షకు దారి తీస్తుంది. శిక్ష పడినవారిగా పోలీసులకు అనుమానం వచ్చిన ప్రతిసారీ వీరు అరెస్టుకు గురౌతారు. ఇలాంటి ఒప్పుకోలు నుంచి రక్షించుకునే హక్కును రాజ్యాంగంలోని 20(3) అధికరణ ఇచ్చింది. ఈ విషయంలో ఖైదీలను రక్షించే బాధ్యత, న్యాయ సహాయ సంస్థకు ఉంది. కిక్కిరిసిన జైళ్ల సమస్యకు దీనిని ఒక పరిష్కారంగా చూడడమే ఒక విషాదం.

విచారణ లేకుండా శిక్షించడం భౌతిక నిర్బంధం మాత్రమే కాదు, ఒక ప్రత్యామ్నాయ శిక్షా విధానం. దీని నష్టం విస్తృతమైనది. నిందితుల జీవనాధారాన్ని దెబ్బతీస్తుంది; వారి సామాజిక విశ్వసనీయతను నాశనం చేస్తుంది; నిరాశ్రయులను చేస్తుంది; తిరిగి నేరం చేసి, జైలుకెళ్లే పరిస్థితులను సృష్టిస్తుంది. విచారణా క్రమాన్నే శిక్షగా మలిస్తే వ్యవస్థ పేదలను శిక్షించే పనిముట్టుగా తయారవుతుంది. అది వారి స్వేచ్ఛను మినహాయింపుగా, శిక్షను సాధారణ విషయంగా మార్చేస్తుంది. నేర న్యాయ వ్యవస్థే అప్పుడు బోనులో నిలబడుతుంది. అది కాకూడదు అంటే న్యాయ సహాయ హక్కును భిక్షగా కాకుండా, ఒక రాజ్యాంగ బాధ్యతగా వ్యవస్థ పరిగణించాలి.

• ప్రొఫెసర్ మురళి కర్ణం
నల్సార్ విశ్వవిద్యాలయం
(న్యాయ సహాయ చట్టానికి నేటికి ముప్పయ్యేళ్లు)

అమెరికాలో జవహర్‌లాల్!

జోహ్రాన్ మమ్దానీ అనే ఒక ముస్లిం అడ్వకేట్ న్యూయార్క్ మేయర్‌గా ఎన్నికయ్యాడు. ఆయన విజయంలో అనేక ప్రత్యేకతలున్నాయి. జోహ్రాన్ భారత సంతతికి చెందినవాడు. తల్లి మీరా నాయర్ హిందువు, అంతర్జాతీయ ఖ్యాతిగాంచిన దర్శక నిర్మాత. తండ్రి మహమూద్ మమ్దానీ కూడా భారతీయ ముస్లిం. కొలంబియా విశ్వవిద్యాలయంలో రాజనీతి శాస్త్ర ప్రొఫెసర్. బహుగ్రంథాల రచయిత. ఇదే న్యూయార్క్ నగరంలో వరల్డ్ ట్రేడ్ సెంటర్‌కు చెందిన రెండు టవర్లను 2001 సెప్టెంబరు 11న (9/11) అల్‌ఖైదా ఉగ్రవాదులు కూల్చివేసిన విషయం మనందరికీ తెలుసు. ఆ తరువాత ఇస్లాం సంస్కృతి సంప్రదాయాల్లోనే ఉగ్రవాదం వుందంటూ అమెరికా ప్రపంచవ్యాప్తంగా ప్రచారం మొదలెట్టింది. దీనినే ఇస్లామోఫోబియా అంటున్నాం. ఈ ప్రచారంలోని బూటకాన్ని బయటపెడుతూ మహమూద్ మమ్దానీ 'మంచి ముస్లిం, చెడ్డ ముస్లిం' అనే గ్రంథాన్ని రాసి ప్రచురించాడు. 1979లో సోవియట్ రష్యా ఆఫ్ఘనిస్థాన్‌ను ఆక్రమించినపుడు, ఆఫ్ఘన్ గెరిల్లాలకు ఆయుధాలు, డబ్బు సరఫరాచేసి, పాకిస్థాన్ సహకారంతో వారికి అమెరికా ఉగ్రవాద శిక్షణ ఇచ్చిందనీ, రోనాల్డ్ రీగన్ అధ్యక్షునిగా వుండగా ఆఫ్ఘన్ గెరిల్లాలను వైట్ హౌస్‌కు ఆహ్వానించి వాళ్లను స్వాతంత్ర్య సమరయోధులుగా పొగిడారనీ మమ్దానీ తగిన ఆధారాలతో ఈ పుస్తకంలో వివరించాడు.

మహమూద్ మమ్దానీ, మీరా నాయర్ ఉగాండాలో పనిచేస్తున్న కాలంలో వాళ్లకు జోహ్రాన్ మమ్దానీ జన్మించాడు. జోహ్రాన్ ఏడేళ్ల వయస్సులో వున్నప్పుడు మమ్దానీ కుటుంబం అమెరికాకు మారింది. జోహ్రాన్ ఈ ఏడాదే డిజిటల్ క్రియేటర్ రమా దువాజీని జోహ్రాన్ దుబాయ్‌లో నిఖా చేసుకున్నాడు. అలా వారిది ఒక రకంగా వసుధైక కుటుంబం. న్యూయార్క్‌లో జోహ్రాన్ అడ్వకేట్‌గా స్థిరపడి మానవ హక్కుల కార్యకర్తగా పనిచేస్తున్నాడు. అమెరికా ఎన్నికలు జోహ్రాన్‌కు కొత్తకాదు. న్యూయార్క్ శాసనసభకు అస్టోరియ (క్వీన్స్) నియోజకవర్గం నుంచి 2020లో పోటీ చేసి ఐదు వరుస విజయాలున్న ఘనాపాఠిని ఓడించాడు. 2022, 2024 ఎన్నికల్లో అదే నియోజకవర్గం నుండి ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. ప్రస్తుతం అతను శాసనసభ్యుడు.

ప్రపంచ రాజధానిగా భావించే న్యూయార్క్ నగరాన్ని సహజంగానే ప్రపంచ ధనవంతులు ఏలుతుంటారు. వాళ్లలో అత్యధికులు యూదులు. వాళ్లే రాజకీయ రంగాన్నీ శాసిస్తుంటారు. మీడియా కూడ వాళ్ల చెప్పుచేతల్లోనే వుంటుంది. వీళ్లను ఒలిగార్కీ అంటారు. ఒలిగార్కీ అండదండలు లేకుండా ఎవరూ అక్కడ ఏ రంగంలోనూ నిలదొక్కుకోలేదు. మేయర్ బరిలో దిగినప్పుడు జోహ్రాన్‌ను ఎవరూ పట్టించుకోలేదు. ఒక చేత్తో ప్లకార్డ్, మరో చేతిలో మైక్ పట్టుకుని ప్రసంగిస్తూ వీధుల్లో నడుస్తుంటే ఒక్కరూ తలతిప్పి చూసేవారు కాదు. పోటీలో పదిమంది వుంటే మీడియా అతనికి పదో ర్యాంకు ఇచ్చింది. జోహ్రాన్ వయస్సు ఇప్పుడు 34 సంవత్సరాలు. జీ జెనరేషన్ సంప్రదాయం తెలిసినవాడు. న్యూయార్క్‌లో ధనవంతుల్ని అతను అస్సలు పట్టించుకోలేదు. మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి, పేదల్ని లక్ష్యంగా పెట్టుకుని తన ప్రచారాన్ని సాగించాడు. 'గోదాంలో పెట్టెలు మోసి నీలి మచ్చలు పడ్డ వేళ్లు, డెలివరీ సైకిల్ హ్యాండిల్స్ వల్ల గట్టిగా మారిన అరచేతులు, కిచెన్‌లో కాలిన గాయాలు ఉన్న మునివేళ్లు. ఇలాంటి చేతులకు అధికారాన్ని పట్టుకునే అవకాశం ఎవరూ ఇక్కడ ఇవ్వరు'. 'ప్రతి అడ్డంకినీ దాటి, ఒక మహా రాజకీయ వంశాన్ని



కూల్చివేసి, మన భవిష్యత్తును మన చేతులతో పట్టుకుందాం' వంటి మాటలు అణగారినవారికి గొప్ప ఉత్తేజాన్నిచ్చాయి.

ఎదురీదడం జోహ్రాన్ నైజం. అతను ముస్లిం అనీ, అవకాశం ఇస్తే 9/11 టెర్రరిస్టు సంఘటనలు పునరావృతం అవుతాయని ప్రచారం మొదలెట్టారు ప్రత్యర్థులు. 'శరణార్థి, చొరబాటుదారుడు' అన్నవాళ్లూ వున్నారు. దానికి అతను భుజాలు తడుముకోలేదు. 'అవును నేను ముస్లింను. ముస్లిం ఆచార వ్యవహారాలను పాటిస్తాను' అంటూ తాను ఇష్టంగా బిర్యాని తింటున్న విడియోను సోషల్ మీడియాలో పెట్టిన గడుసరి.

ప్రపంచంలో యూదులు అత్యధికంగా నివసిస్తున్న నగరం న్యూయార్క్. అలాంటి నగరంలో ఏ ఎన్నికల్లో పోటీ చేయాలనుకున్నా ముందు యూదు పెద్దల ఇంటికి వెళ్లి ఆశీర్వాదం తీసుకోవడం సంప్రదాయం. తాము గెలిస్తే ముందు ఇజ్రాయెల్ వెళతామని ఎన్నికల ప్రచారంలో అభ్యర్థులు వాగ్దానం చేస్తుంటారు. జొహ్రాన్ మహామొండి. తాను మేయర్‌గా గెలిస్తే, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహును న్యూయార్క్‌లో కాలుపెట్టనీయనని ప్రకటించాడు. 'ఒకవేళ అతను వస్తే, అరెస్టు చేస్తాను' అని కరాఖండీగా చెప్పాడు. యుద్ధనేరాలకు పాల్పడినందుకు నెతన్యాహు మీద ఏడాది క్రితం ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్టు (ఐసీసీ) ఒక అరెస్టు వారెంటు జారీచేసిన విషయం తెలిసిందే.

న్యూయార్క్ మహానగరంలో జోహ్రాన్ ఒక సామాజికార్థిక సరిహద్దు గీత గీశాడు. ఉన్నోళ్లు తన ప్రత్యర్థులు, లేనోళ్లే తన మద్దతుదారులు. పేదల ఇంటింటికి వెళ్లి వాళ్ల కష్టాలు తెలుసుకున్నాడు. వాటి పరిష్కారాల కోసం పథకాలు ప్రకటించాడు. హెల్త్ కేర్, ఇంటి రెంటు, సొంతిల్లు, ఉచిత బస్సు ప్రయాణం వంటి అంశాల మీద జోహ్రాన్ ప్రకటించిన సంక్షేమ పథకాలు జనాకర్షణగా మారాయి. ఒక అడ్వకేట్‌గా మానవ హక్కుల పరిరక్షణ కోసం అతను చేస్తున్న కృషికి కూడా పెద్ద సంఖ్యలో అభిమానులు ఏర్పడ్డారు. సోషల్ మీడియాలో అతని భార్య సాగించిన ప్రచారం కూడా బాగా పనిచేసింది. క్రమంగా అతని మద్దతుదారులు పెరిగారు. మమ్దానీ రేసులో దూసుకుపోతున్నాడనే సంకేతాలు రాగానే ఒలిగార్కీ తన దగ్గరున్న పావులన్నీ కదిపింది. టెస్లా అధినేత ఎలాన్ మస్క్ మమ్దానీని హేళన చేశాడు. అతణ్ణి మేయర్‌గా ఎన్నుకుంటే న్యూయార్క్ నగరానికి ఫెడరల్ నిధుల్లో కోత విధిస్తానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించాడు. డెమొక్రాటిక్ పార్టీకే చెందిన అమెరికా మాజీ అధ్యక్షుడు బారక్ ఒబామా సైతం మమ్దానీ కోసం ప్రచారం చేయడానికి నిరాకరించాడు.

సాహిత్యంతో పరిచయం ఉన్నవాళ్లకు మమ్దానీ ఉపన్యాస శైలి జాక్ లండన్ నవల 'ఉక్కుపాదం' (ఐరన్ హీల్)లోని కథానాయకుడు ఎర్నెస్ట్ ఎవ్వర్ హర్డ్‌ను గుర్తుకు తెచ్చింది.

> న్యూయార్క్ మహానగరంలో జోహ్రాన్ ఒక సామాజికార్థిక సరిహద్దు గీత గీశాడు. ఉన్నోళ్లు తన ప్రత్యర్థులు, లేనోళ్లే తన మద్దతుదారులు. పేదల ఇంటింటికి వెళ్లి వాళ్ల కష్టాలు తెలుసుకున్నాడు. వాటి పరిష్కారాల కోసం పథకాలు ప్రకటించాడు.

సామాజిక ఉద్యమాలతో పరిచయం వున్నవాళ్లకు ముస్లిం మస్జీద్ నిర్మాత, ఆఫ్రో అమెరికన్ ఉద్యకారుడు మాల్కమ్–ఎక్స్‌ను గుర్తుకు తెచ్చింది. ప్రత్యర్థులు మమ్దానీని కమ్యూనిస్టు, మార్క్సిస్టు, రాడికల్ అన్నారు. ఈ మాటలతో న్యూయార్కీయులు భయపడతారని అనుకున్నారు. కానీ అందుకు విరుద్ధంగా జరిగింది. ఇస్లామోఫోబియా రాజ్యం చేస్తున్న చోట ఒక ముస్లింను ఎన్నుకున్నారు. వలసదారుల భరతం పడతానంటూ దేశాధ్యక్షుడు రంకెలు వేస్తున్న చోట ఒక వలసదారుడిని గెలిపించారు. ఇదేమీ విప్లవం కాదు; అక్కడేమీ సోషలిస్టు రాజ్యం ఏర్పడడంలేదు. కాకపోతే, ప్రధానంగా ఇది అమెరికాలో అణగారిన సమూహాలకు ఆత్మగౌరవ విజయం!

ఆర్థిక విధానాల్లో రిపబ్లికన్స్, డెమొక్రాట్స్ మధ్య పెద్ద తేడా లేదు. డెమొక్రాట్స్‌లో జోహ్రాన్ నిస్సందేహంగా వామపక్షం. మనకు కూడా కాంగ్రెస్‌లో ఒకప్పుడు కుడిపక్షం, వామపక్షం ఉండేవి. గోపాలకృష్ణ గోఖలే, సర్దార్ వల్లభ్‌భాయి పటేల్ కుడిపక్షం; జవహర్‌లాల్ నెహ్రూ, సుభాష్ చంద్రబోస్ వామపక్షంగా వుండేవారు. జోహ్రాన్ మమ్దానీ కమ్యూనిస్టు కాదు; నక్సలైటూ కాదు. కేవలం సోషల్ డెమొక్రాట్. అతనిప్పుడు అమెరికాలో జవహర్‌లాల్ నెహ్రూ. గెలిచినప్పుడు కూడ అతను నెహ్రూని తలుచుకోవడం యాదృచ్ఛికం కాదు.

'న్యూయార్క్– వలసదారులు నిర్మించిన నగరం. వలసదారులు శక్తిమంతంగా తీర్చిదిద్దిన నగరం. ఈ రాత్రి నుంచి అయితే వలసదారులు నడుపుతున్న నగరం. ఇది వలసదారుల నగరంగానే కొనసాగుతుంది. అయ్యా డొనాల్డ్ ట్రంప్ గారూ! నా మాటలు గట్టిగా ఆలకించండి. ఇక్కడ మీరు ఎవరిని తాకాలన్నా మమ్మల్ని అందరినీ దాటుకుని వెళ్లాలి' అంటూ జోహ్రాన్ తన విజయోత్సవ సభలో అన్న మాటలు అమెరికా రాజకీయాల్లో రాబోయే మార్పులకు సంకేతం కావచ్చు.

> 'న్యూయార్క్ వలసదారులు నిర్మించిన నగరం. వలసదారులు శక్తివంతంగా తీర్చిదిద్దిన నగరం. ఈ రాత్రి నుండి అయితే వలసదారులు నడుపుతున్న నగరం. ఇది వలసదారుల నగరంగానే కొనసాగుతుంది. అయ్యా డొనాల్డ్ ట్రంప్ గారూ, నా మాటలు గట్టిగా ఆలకించండి. ఇక్కడ మీరు ఎవరిని తాకాలన్నా మమ్మల్ని అందరినీ దాటుకుని వెళ్ళాలి' అంటూ జోహ్రాన్ తన విజయోత్సవ సభలో అన్న మాటలు అమెరికా రాజకీయాల్లో రాబోయే మార్పులకు సంకేతం కావచ్చు.

■ డానీ
సమాజ విశ్లేషకులు

ఒకే ఒక్కడు!



దేశంలో ఎప్పుడు, ఎక్కడ ఎన్నికలు జరిగినా ఠక్కున గుర్తుకొచ్చే పేరు టీఎన్ శేషన్. ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా ఉన్నది ఆరేళ్ళయినా, దశాబ్దాలపాటు చెరగని ముద్రవేశారాయన. అహంకారి, నియంత, జగమొండి అని ఎన్ని విమర్శలు వచ్చినా, నాయకులు అభిశంసన హెచ్చరికలు చేసినా, ఎన్నికల వ్యవస్థను ప్రక్షాళించేవరకూ ఈయన విశ్రమించలేదు. కేరళలో పుట్టిన తిరునెల్లయ్ నారాయణ అయ్యర్ శేషన్ చంద్రశేఖర్ ప్రభుత్వం హయాంలో ఎన్నికల సంఘం ప్రధానాధికారి అయ్యారు. వచ్చీ రావడంతోనే కార్యాలయంలో దేవుళ్ల, నాయకుల ఫోటోలు ఉండనివ్వకుండా, రాజ్యాంగ విహితంగా పనిచేసి, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడమే మన విధి అని స్పష్టం చేశారు. అప్పటికి ఉత్తరాది రాష్ట్రాల్లో చేతిలో తుపాకీ ఉన్నవాడిదే అధికారం. డబ్బు, మద్యం, విచ్చలవిడి హింస, కిడ్నాప్‌లతో ఎన్నికల్లో నెగ్గుకువచ్చే భయానకమైన పరిస్థితులను మార్చి, ఓటరు ధైర్యంగా పోలింగ్ కేంద్రానికి వెళ్ళే వాతావరణాన్ని ఆయన కల్పించాడు. ప్రవర్తనానియమావళి అంటే పట్టని పార్టీలూ, అభ్యర్థులూ దానిని తూచ తప్పకుండా అనుసరించేట్టు చేశాడు. మారుమూల ప్రాంతాల్లో అభ్యర్థులు సైతం శేషన్ ఏ క్షణాన వస్తాడోనన్న భయంతో వొణికిపోయేవారు. ఏ చిన్న తప్పుజరిగినా ఎన్నిక రద్దవుతుందన్న ఆందోళనలో పార్టీలు ఉండేవి. తాను కోరిన అధికారిని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం కేటాయించనందుకు ఎన్నికలు జరిపేది లేదని హెచ్చరించి దారికి తెచ్చుకున్న ఘనుడు శేషన్. మధ్యప్రదేశ్ గవర్నర్ తన కుమారుడి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నందుకు ఆ నియోజకవర్గం ఎన్నికను నిలిపివేశారు శేషన్. యూపీలో ప్రచార సమయం ముగిసినా కూడా ప్రసంగిస్తున్నందుకు ఒక మంత్రిని వేదికమీద నుంచి అమాంతం దించేసిన సాహసి. కొన్ని గంటల్లో పోలింగ్ ప్రారంభం కావాల్సిన పంజాబ్‌లో ఏకంగా ఎన్నికలే రద్దుచేశారాయన. మద్యం, డబ్బు, కుల, మత ప్రచారాలకు ఆయన సమర్థవంతంగా అడ్డుకట్టవేశారు. రామన్ మెగసెసే పురస్కారం అందుకున్న ఈ చండశాసనుడు 2019 నవంబరు 10న కన్నుమూశారు.

○ టి.సేవకుమార్



> 'ఇంతకాలమూ జరిపిన ఉద్యమంలో తప్పులు జరిగాయి. ఇప్పటి పరిస్థితుల్లో సాయుధ పోరాట మార్గం సరైనది కాదు. పార్టీతో మాకు విభేదాలున్నాయి'– అని లొంగిపోయిన వాళ్ళు అనడం అప్పుడూ వుంది, ఇప్పుడూ వుంది. 'ఆ తప్పులు దిద్దుకుని, వేరే పోరాట మార్గం ఎంచుకోవచ్చునుగా, ప్రభుత్వానికి లొంగిపోవడం ఎందుకు?'

'విప్లవ' నాయకుల లొంగుబాట్లు: అప్పుడూ, ఇప్పుడూ!

ఇటీవల మావోయిస్టు పార్టీలోని కొందరు 'అగ్ర'నాయకులు ప్రభుత్వానికి లొంగిపోయినప్పటి దృశ్యాలూ, వార్తలూ కొన్ని చూశాను. వాటిని చూశాక, మార్క్సిజంతో ఏకీభావం వున్న వ్యక్తిగా, నాకు తోచింది చెప్పాలనిపించింది.

మావోయిస్టు పార్టీ నాయకులు, 2000లోనూ, 2004లోనూ, బూర్జువా ప్రభుత్వాలతో చర్చలు జరపాలనుకున్నప్పుడు, నేను పత్రికల్లో 5 వ్యాసాలు రాశాను. 'చర్చలు జరగవలిసింది ప్రభుత్వంతో కాదు, తోటి విప్లవ గ్రూపులతో' అన్నది ఆ వ్యాసాల సారాంశం. అలాగే, అబద్ధపు ఎన్‌కౌంటర్లు జరిగినప్పుడు గతంలోనూ, ఇటీవల కాలంలోనూ కూడా నేను ప్రభుత్వాలను ఖండిస్తూనూ; మావోయిస్టుల అవగాహనలోనూ, ఆచరణలోనూ కనపడే లోపాలను విమర్శిస్తూనూ కూడా 5, 6 వ్యాసాలు రాశాను. పెద్ద ఎత్తున లొంగుబాట్లు జరుగుతున్న ఈ సందర్భంలో, చర్చించవలిసిన విషయాలు ఎన్నో వున్నా, విప్లవ నాయకుల లొంగుబాట్లలో కనపడే తేడాల గురించి మాత్రమే చెప్పదల్చుకున్నాను.

(1) గతంలో, అగ్ర నాయకులు లొంగిపోయేటప్పుడు కొంచెం సిగ్గు మొహాలతో కనిపించేవారు. ఇప్పుడు ఏ మాత్రమూ సిగ్గూ, బిడియమూ లేకుండా, ముఖ్యమంత్రులనూ, పోలీసు ఉన్నతాధికారులనూ ఆనుకుని, ఫొటోలూ, చిరునవ్వులూ, కరస్పర్శలూ, లాల్ సలామూలూనూ! అంతేనా? ఏ రాజ్యాంగాన్నయితే, 'దోపిడీ వర్గ రాజ్యాంగం' అన్నారో, ఆ పుస్తకాన్నే, 'దోపిడీ వర్గ ప్రతినిధులైన' ముఖ్యమంత్రుల చేతుల్నించీ, వినయంగా స్వీకరించడం! (2) గతంలో, లొంగిపోయేటప్పుడు, అనారోగ్య సమస్యలతో లొంగిపోతున్నట్టు చెప్పేవాళ్ళు, పత్రికల వారి ముందు. 'అనారోగ్యమే సమస్య అయితే, పార్టీకీ, ప్రజలకీ చెప్పి, వేరే విధంగా సమస్యను పరిష్కరించుకోవచ్చుగదా? ప్రభుత్వం దగ్గరికి వచ్చి లొంగిపోవడం ఎందుకు?'– అనే ప్రశ్న వస్తుందనే ఆలోచనే లేదు అప్పుడూ, ఇప్పుడూ కూడా! ఇప్పుడైతే, గడుసుగా, ఎటువంటి జంకూ గొంకూ లేకుండా, 'ఇది లొంగుబాటు కాదు. జనజీవన స్రవంతిలోకి వచ్చాము. మేము మావోయిస్టు సిద్ధాంతాన్ని వదిలిపెట్టలేదు. కాకపోతే ఇప్పుడు ప్రజాస్వామ్య పద్ధతుల్లో ప్రజలకోసం పోరాడుతాం' అని దబాయిస్తున్నారు. 'జనాల మధ్యకొచ్చి పనిచేస్తాము–అంటున్నారు కదా? ఇప్పటిదాకా పనిచేసింది ఆదివాసీల మధ్యనే కదా? మరి, ఆదివాసీలు జనాలు కాదా?' అని ఏ పత్రికా విలేకరీ అడగటం లేదు. (3) గతంలో, లొంగిపోయిన వారికి, వారి తలలకి లక్షల్లో వెలలు కట్టి, ఆ డబ్బుల్ని, లొంగిపోయిన కొన్నాళ్ళకుగానీ ఇచ్చేవి కావు ప్రభుత్వాలు. ఇప్పుడు, చెక్కులు అయితే డబ్బులుగా మార్చుకోవడానికి ఆలస్యం అవుతుందని, ఏకంగా డిమాండ్ డ్రాఫ్టులనే ఇచ్చేస్తున్నారు. హవ్వ! డబ్బుకోసం లొంగుబాట్లా? అంటే... ఇప్పటిదాకా, బూర్జువా పార్టీ నాయకులే డబ్బుకి అమ్ముడుపోతారని జనాలు అనుకునేవారు. ఇప్పుడు, అమ్మకానికి 'విప్లవ' నాయకులు కూడా కొందరు సిద్ధమే నేమో–అని జనాలు సందేహించాల్సివస్తోంది! (4) గతంలో, అడివిలోనే ఉండిపోయే పార్టీవారికి తమ ఆయుధాలు అప్పగించి, ఉత్తచేతులతో లొంగిపోయేవాళ్ళు. ఇప్పుడు ఆయుధాల్ని శుభ్రం చేసి, గెరిల్లా యూనిఫారాలు తొడుక్కుని మరీ, చిరునవ్వులు చిందిస్తూ, తలలు వంచి ఆయుధాలను ముఖ్యమంత్రులకు అందిస్తున్నారు.

(5) 'ఇంతకాలమూ జరిపిన ఉద్యమంలో తప్పులు జరిగాయి. ఇప్పటి పరిస్థితుల్లో సాయుధ పోరాట మార్గం సరైనది కాదు. పార్టీతో మాకు విభేదాలున్నాయి'– అని లొంగిపోయిన వాళ్ళు అనడం అప్పుడూ వుంది, ఇప్పుడూ వుంది. 'ఆ తప్పులు దిద్దుకుని, వేరే పోరాట మార్గం ఎంచుకోవచ్చునుగా, ప్రభుత్వానికి లొంగిపోవడం ఎందుకు?' అనే ప్రశ్నలు పత్రికా విలేకరులు వెయ్యరనే ధీమా! (6) విప్లవ నాయకుల్ని అభిమానిస్తూ, మైదాన ప్రాంతాలలో వుంటూ, వారికి సహకరించే పనులు చేతనైనంత చేస్తూ, ప్రభుత్వ వేధింపులకు గురిఅయ్యేవారు ఎవరన్నా ఇలా అడిగారనుకోండి: 'అదేమిటి కామ్రేడ్? వీర విప్లవ నినాదాలు చేసి, ఇప్పుడు ఇలా లొంగిపోవడం ఎందుకు?' అని అడిగారనుకోండి! ఇలా అడిగినప్పుడు, గతంలో లొంగిపోయిన నాయకులు, దబాయింపులు లేకుండా మిన్నకుండేవారు. ఇప్పటి లొంగిపోయిన నాయకులైతే ఆగ్రహిస్తూ, 'హైదరాబాదులో కూచుని, ఇక్కడి సమస్యలు తెలుసుకోకుండా ఇష్టం వచ్చినట్టు మాట్లాడడమేమిటి?' అంటున్నారు. విప్లవాభిమానులు ఎవ్వరూ కూడా, వీరిని ఉద్యమాల్లోకి వెళ్ళమని బలవంతపెట్టలేదే? అక్కడ సమస్యలు వుండితీరతాయని వీరికి తెలియదా? 'విప్లవమంటే విందు భోజనం కాదని' 1927 లోనే మావో అన్నాడని తరచూ ఉటంకించిన పార్టీలో ఎంతోకాలంగా పనిచేసిన వారే కదా వీరు? మరి ప్రశ్నించే విప్లవాభిమానుల మీద ఆగ్రహం ఎందుకు? లొంగిపోయిన నాయకులు ఒక్కొక్కరూ, ముప్పయ్యేసీ, నలభయ్యేసీ ఏళ్ళపాటు, అనేక కష్ట నష్టాలు ఓర్చి నిలబడినందుకు, విప్లవాభిమానులకు వీరంటే ఇప్పటిదాకా గౌరవమే! కానీ, అన్నేళ్ళ త్యాగాల్నీ, దోపిడీవర్గ పాలకుల పాదాక్రాంతం చేసినందుకే దిగ్భ్రాంతి! (7) ఇప్పుడు లొంగిపోయిన నాయకులు, 'కగార్' పేరుతో సాగుతున్న నిర్బంధాన్ని తట్టుకోవడం కష్టం. కార్యకర్తల్ని రక్షించుకోవడం కోసమే ప్రభుత్వం పిలుపు మేరకు మేము సాయుధ



పోరాటాన్ని విరమిస్తున్నాం. మావోయిజాన్ని వదిలేది లేదు' అని ప్రగల్భాలు పలుకుతున్నారు. ఈ ప్రగల్భాల మీద, ఎన్ని ప్రశ్నలైనా వెయ్యవచ్చును. గత ప్రభుత్వం 'గ్రీన్ హంట్' పేరుతో నిర్బంధాన్ని అమలు చెయ్యలేదా? 1969 నించీ ఎన్ని వేలమంది ఉద్యమకారుల్ని అబద్ధపు ఎదురు కాల్పులలో ప్రాణాలు తియ్యలేదూ, ఈ ప్రభుత్వాలు? అయినా, నిర్బంధాల నించీ తప్పించుకోవడానికి లొంగుబాటు తప్ప ఇంకో మార్గం వుండదా? దేశభక్తి మత్తులో తేలియాడే పాటే అయినప్పటికీ, 'షకీల్ బదాయునీ' అనే కవి రాసిన, చాలా ప్రసిద్ధి చెందిన ఒక పాటలో, ఒక చరణం ఇలా వుంటుంది: 'మా తలలను నరకగలరేమో గానీ, మా తలలను వంచ లేరు!' అని. ('సర్ కటా సక్ తే హై, లేకిన్ సర్ ఝుకా నహీ సక్ తే!'). అంతేనా? ఈ కాలపు నియంతలకన్నా, పెద్ద నియంత ఇటలీ ముస్సోలినీ, లిబియా స్వాతంత్ర్య యోధుల మీద అమలు పరిచిన నిర్బంధాన్ని వ్యతిరేకించిన లిబియా తిరుగుబాటు నాయకుడు 'ఉమర్ ముఖ్తార్' ఏమి చేశాడు లొంగిపొమ్మన్నప్పుడు? 'లొంగిపోయే సమస్యే లేద'న్నాడు. ఆ మాటమీదే నిలబడి 73 ఏళ్ళ వయసులో, ఉరికంబం ఎక్కాడు? అతను ఎన్నడూ, “ఊగరా, ఊగరా! ఉరికొయ్య అందుకుని ఊగరా!” అని, పాడిన మావోయిస్టు కాడు. అతడు, వ్యక్తిగా సాధారణ మత గురువు. ఇటలీ సామ్రాజ్యవాద పాలననించీ నామమాత్రపు రాజకీయ స్వాతంత్ర్యం కోసం పోరాటం నడిపిన ఉద్యమకారుడు. అయినా, ఇప్పుడు వీరిని ఉరికంబాలు ఎక్కమనీ ఎవ్వరూ అడగడం లేదు. కానీ, లొంగుబాటు తప్ప, వేరే దిద్దుబాట మార్గం వుండదా? పైగా, చాలా ఏళ్ళుగా, పోరాట మార్గం విషయమై ఆలోచిస్తున్నట్టు వీరే చెప్పుకుంటున్నారు!

చివరిగా, మావోయిస్టు పార్టీ వారిని ఉద్దేశించి, ఎప్పుడో, పాతికేళ్ళ నాడు (2000లో), నేను రాసిన మాటల్నే ఈనాడు తిరిగి చెప్పదలిచాను.

“మహా విప్లవకారులుగా ఎంతో కాలం చలామణీ అయిన మీ వెనకటి నాయకులు, పోలీసులకు తమని తాము అప్పజెప్పుకుని, డబ్బు దండుకుని, బిజినెస్‌లు చేసుకుంటూనో, వడ్డీ వ్యాపారాలు చేసుకుంటూనో, 'మార్క్సిజం' అనే మాట కూడా పిల్లల చెవిన పడనివ్వకుండా, పుట్టినరోజు ఫంక్షన్లతో వారిని ఆనంద పెడుతూ కాలం గడిపేస్తున్నారు. ఇంత పతనానికి మూలాలు ఎక్కడ వున్నాయో మిమ్మల్ని మీరు పరిశీలించుకోండి. మీ కార్యకర్తల్లోనే అపారంగా జరిగిన త్యాగాలూ, సాహసాలూ, మరణాలూ వృథా ఎందుకు అయిపోతున్నాయో, ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఎందుకు పడివుంటున్నదో గ్రహించుకోండి! రష్యా చైనాలు ఎందుకు కుప్పకూలాయో, ప్రతీ విప్లవ గ్రూపూ ఎందుకు చీలికలూ పీలికలూ అవుతోందో, కారణాలు కనిపెట్టండి! అడుగడుగునా ఫోజులూ, డంబాచారాలూ, ఆత్మ స్తుతులూ, ప్రగల్భాలూ, వ్యక్తి పూజలూ, ఇవేవీ ఒక్క అడుగు కూడా ముందుకు తీసుకుపోలేవని గ్రహించండి! చేసిన తప్పులకు సిగ్గుపడడం, దిద్దుకోవడం, సిద్ధాంత జ్ఞానం, ఇతర విప్లవ గ్రూపులతో ఐక్యతా– ఇవి మాత్రమే విప్లవ మార్గాన్ని బలహీనతల నించి రక్షిస్తాయి.

విప్లవ గ్రూపుల్లో ఎక్కడ ఎన్ని తప్పులు జరిగినా, ఎవరితో ఎవరెంత విభేదించినా, ఎంత అస్పష్టంగానైనా అందరికీ ఒకే లక్ష్యమూ, ఒకే గమ్యమూ వున్నాయి. ఆ లక్ష్యానికి అంకితమైన జనాభా వుంది. జరగవలసిందంతా ఆ జనాభా మధ్య ఐక్యత! దాని కోసం ఎన్ని చర్చలైనా చెయ్యండి! ఎన్నిసార్లు విఫలమైనా మళ్ళీ మళ్ళీ ప్రయత్నించండి! ఆశలన్నీ విప్లవకారుల ఐక్యత మీదే పెట్టుకోండి! అది ఒక్కటే సరైన మార్గం! ఏకైక మార్గం! ముందడుగులు వెయ్యలేకపోతే, అది నేరం కాదు. వెనకడుగులు వెయ్యడం మాత్రం నేరమే!”

• రంగనాయకమ్మ



వేదిక ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ అన్సారియా

నేడు పెదకాకానికి సీఎం చంద్రబాబు

- శంకరకంటి ఆస్పత్రిలో ఐ కేర్ బ్లాక్ ప్రారంభోత్సవం
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ తమీమ్‌అన్సారియా

పెదకాకాని, గుంటూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): గుంటూరు సమీపంలోని పెదకాకానిలోని శంకర కంటి ఆస్పత్రికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదివారం రానున్నారు. ఆస్పత్రి ఆవరణలో నూతనంగా నిర్మించిన దుర్గం నాగమనోహర్ బ్లాక్ సూపర్ స్పెషాలిటీ ఐ కేర్ విభాగాన్ని ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లను శనివారం కలెక్టర్ తమీమ్ అన్సారియా, జేసీ శ్రీవాత్సవ పరిశీలించారు. హెలిప్యాడ్ ప్రాంతాన్ని, సభా వేదిక ప్రాంగణాన్ని, ఆస్పత్రి ప్రాంగణాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు కృష్ణకాంత్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



సీఎం ప్రారంభించనున్న ఐ హాస్పటల్

ఎస్పీ వకుల్‌జిందాల్ సమీక్ష

సీఎం పర్యటన నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లపై శనివారం ఎస్పీ వకుల్‌జిందాల్ సమీక్షించారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రముఖులకు అసౌకర్యం కలగకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైన చోట బారికేడింగ్, స్టాపర్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. హెలిప్యాడ్, సభా ప్రాంగణం, వీవీఐపీ, వీఐపీల ప్రవేశ ద్వారాలు, వాహనాల రాకపోకల మార్గాలు, పార్కింగ్ ప్రదేశాల వద్ద జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీ సీఐ అళహరి శ్రీనివాస్, సీఐలు వెంకటేశ్వర్లు, నారాయణస్వామి పాల్గొన్నారు.



భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్



బాలోత్సవంలో చిన్నారుల హావభావాలు







అద్వితీయం.. అబ్బురం

లోపలి పేజీలో..

కళాత్మక హావభావాల వదనం.. వేదిక చలించిన మువ్వల సవ్వడి చరణం.. కళ్లను కట్టేసే సాంస్కృతిక వేషధారణం..'వీణ'ల విందుగా సంగీత శ్రవణం.. మేధలో దాగిన సృజనాత్మకత లేఖనం.. కవితా సంకలనం.. అబ్బుర పరిచిన నైపుణ్య వికాసం.. అద్వితీయం బాలోత్సాహం. రెండవ రోజు శనివారం వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నలాజికల్ యూనివర్సిటీ ప్రాంగణంలో బాలల పండుగ ఘనంగా జరిగింది. చిన్నారుల కేరింతలతో సందడిగా మారింది. విద్యార్థులు పలు విభాగాల్లో పోటీపడి తమ నైపుణ్య ప్రదర్శనలతో వీక్షకులను ఆకట్టుకున్నారు. - పెదకాకాని



ఇవేం కట్టడాలు.. అనుమతులు ఎలా ఇచ్చారు?

నిర్మాణాలను పరిశీలించి విస్తుపోయిన మంత్రి మనోహర్

తెనాలి అర్బన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఇవేం కట్టడాలు.. వీటికి అనుమతులు ఉన్నాయి.. ఉంటే ఎవరు ఇచ్చారు.. ఎలా ఇస్తారు.. అంటూ ఏకంగా మంత్రి నాదెండ్ల మనోహర్ విస్తుపోయిన ఘటన తెనాలిలో శుక్ర .వారం చోటుచేసుకుం .ది. మంత్రి పట్టణ పర్యటనలో భాగంగా నిర్మాణంలో ఉన్న భవనాలను పరిశీలించారు. ఈక్రమంలో పలుచోట్ల అనుమతులకు మించి భవనాలు నిర్మించడాన్ని గుర్తించారు. ఇవేం కట్టడాలు వీటికి అనుమతులు ఉన్నాయా అంటూ అధికారులను మంత్రి ప్రశ్నించారు. ఇరుకు సందుల్లో కూడా భారీ భవనాలు కడుతున్నారని మంత్రి దృష్టికి పలువురు తీసుకెళ్లారు. త్వరలోనే వాటిపై పరిశీలన జరిపి చర్యలు తీసుకుంటామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న భవనాలపై శనివారం మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు చేపట్టారు. అనుమతులు లేని నిర్మాణాల సెంట్రింగ్, పరంజా తొలగించారు.



భవన నిర్మాణాలను పరిశీలిస్తున్న మంత్రి మనోహర్

వాటర్‌షెడ్ మహోత్సవ్‌కు.. సర్వం సిద్ధం

- జాతీయ సదస్సుకు వేదికగా గుంటూరు
- సర్వాంగ సుందరంగా వెంగళాయపాలెం చెరువు

- హాజరుకానున్న కేంద్ర మంత్రులు చౌహాన్, డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్
- 130 మంది ప్రతినిధులు సహా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రాక

గుంటూరు, గుంటూరు(తూర్పు), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో గుంటూరులో వాటర్‌షెడ్ మహోత్సవ్ పేరిట జాతీయ సదస్సు జరగనున్నది. సోమ, మంగళవారాల్లో నిర్వహించే ఈ సదస్సు కార్యక్రమాలకు గుంటూరు, వెంగళాయపాలెంలో ఏర్పాట్లను దాదాపుగా అధికారులు పూర్తిచేశారు. ఈ సదస్సుతో డెవలప్‌మెంట్ కాంపోనెంట్ ఆఫ్ ప్రధానమంత్రి కృషి సించాయి యోజన(డబ్ల్యూడీసీ - పీఎంకేఎస్‌వై) 2.0కి శ్రీకారం చుట్టనున్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చొరవ తీసుకుని జాతీయ స్థాయి సదస్సుని గుంటూరులో జరిగేలా చేశారు. ఈ సదస్సులో కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌తో పాటు రూరల్ డెవలప్‌మెంట్ నుంచి సెక్రెటరీలు, కమిషనర్లు, 130 మంది ప్రతినిధులు, వివిధ రాష్ట్రాల నుంచి ఐఏఎస్ అధికారులు రానున్నారు. దీంతో గత కొద్ది రోజులుగా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంపై జిల్లా అధికారులందరూ ప్రత్యేకంగా దృష్టి సారించారు. వాటర్ షెడ్ పథకంలో గుంటూరు రూరల్‌లోని వెంగళాయపాలెంలో చెరువు పునరుద్ధరణ పనులతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు.



చెరువు పరిశీలిస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, కలెక్టర్ అన్సారియా, ఎమ్మెల్యే బూర్ల

సభను విజయవంతం చేయాలి..

వాటర్ షెడ్ మహోత్సవ్ సభను సమర్థవంతగా నిర్వహించి విజయవంతం చేయాలని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. వెంగళాయపాలెంలోని చెరువు పనులను, లయోలా పాఠశాలలో జరిగే సభా ఏర్పాట్లును కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ అదనపు కమిషనర్ సీపీ రెడ్డి, గ్రామీణ అభివృద్ధి శాఖ వాటర్ షెడ్ విభాగం సంచాలకుడు వైవీకే షణ్ముఖకుమార్, రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ, కలెక్టర్ తమీమ్‌అన్సారియా, ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులుతో కలిసి శనివారం పరిశీలించారు. అనంతరం కార్యక్రమ ఏర్పాట్లపై కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ గుంటూరులో ఎప్పుడూ జరగని జాతీయ స్థాయి కార్యక్రమాన్ని తీసుకు రాగలిగాం... నిలబెట్టుకునే సామర్థ్యం మన చేతుల్లో ఉందని అధికారులకు తెలిపారు. వెంగళాయపాలెం చెరువును పైలెట్ ప్రాజెక్టు కింద తీసుకుని 15 రోజులుగా అబివృద్ధి పని చేస్తున్నామన్నారు. చెరువు అభివృద్ధి పనుల పరిశీలనకు 11న కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ రానున్నట్లు తెలిపారు. ఈ పైలెట్ ప్రాజెక్టను విజయవంతం చేసి, ప్రధాని మోదీ ద్వారా జిల్లాకు మరిన్ని నిధులను తెస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గుంటూరు నగర పాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, జేసీ అశుతోష్ శ్రీవాస్తవ, డీఆర్వో ఎన్ఎస్‌కే ఖాజావలి, ఏఎస్పీ రమణమూర్తి, జడ్పీ సీఈవో వీ.జ్యోతిబసు, ఆర్డీవో శ్రీనివాసరావు, డ్వామా పీడీ శంకర్, తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఎంపీడీవో బండి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమాలు ఇలా..

- వాటర్ షెడ్ జాతీయ సదస్సులో తొలి రోజు సోమవారం గుంటూరులోని ఐటీసీ వెల్‌కం హోటల్లో ప్రారంభ కార్యక్రమం జరుగుతుంది.
- రెండో రోజు మంగళవారం వెంగళాయపాలెం లయోలా పాఠశాలలో ఉదయం సభ జరుగుతుంది. వాటర్ షెడ్ మహోత్సవ్ కార్యక్రమాన్ని కేంద్రమంత్రి చౌహాన్ ప్రారంబిస్తారు. తొలుత వెంగళాయపాలెం చెరువును సందర్శిస్తారు. మధ్యాహ్నం ఐటీసీ వెల్‌కం హోట ల్‌లో ముగింపు కార్యక్రమం జరుగుతుంది.



జిమ్ పరికరాలను పరిశీలిస్తున్న పెమ్మసాని చంద్రశేఖర్, రామాంజనేయులు



సా..గుతున్న పనులు

- అధ్వానంగా గొట్టిపాడు రోడ్డు
- వాహన చోదకులకు తప్పని తిప్పలు
- బిల్లులు చెల్లింపులు లేక పనులు ఆపేసిన కాంట్రాక్టర్

ప్రత్తిపాడు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు.. గొట్టిపాడు రోడ్డు పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. ఏళ్లు గడుస్తున్నా పనులు పూర్తి కావడంలేదు. అరకొరరోడ్డుపై ఏమాత్రం ఆదమరిచినా ప్రమాదాలు చోటు చేసుకుంటాయని వాహన చోదకులు భయంభయంగా రాకపోకలు సాగిస్తున్నారు. సుచరిత హోంమంత్రిగా ఉన్న సమయంలో ఈ రోడ్డుకు ఆర్భాటంగా శంకుస్థాపన చేశారు. అయితే పనులు అప్పుడు ప్రారంభం కాలేదు. గొట్టిపాడు ప్రజలు ఆగ్రహించడంతో చివరకు ఎన్నికలకు సంవత్సరం ముందు పనులు ప్రారంభించారు. సరే పనులు ప్రారంభించారు.. రోడ్డు అందుబాటులోకి వస్తుందని గొట్టిపాడు వాసులు ఆశించారు. గొట్టిపాడులో లోలెవల్ బ్రిడ్జి స్థానంలో వంతెనతో ప్రత్తిపాడులోని గొట్టిపాడు రోడ్డులో సీసీ రోడ్డు నిర్మాణానికి సంబంధించి రెండు వైపులా కాల్వలు నిర్మించారు. అయితే అప్పటి ప్రభుత్వం నుంచి పనులకు బిల్లులు మంజూరు కాలేదు. దీంతో కాంట్రాక్టరు అర్ధాంతరంగా పనులు ఆపేసి వెళ్లిపోయారు. ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం రావడంతో ఎమ్మెల్యే రామాంజనేయులును గొట్టిపాడు టీడీపీ నాయకులు రోడ్డు విషయంలో పలుమార్లు విన్నవించుకున్నారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడి బిల్లులు ఇప్పించే బాధ్యత మాది.. పనులు చేపట్టాలని ఎమ్మెల్యే కోరడంతో ఈ ఏడాది ప్రారంభంలో పనులు చేపట్టారు. అయితే కొన్ని రోజులు పని చేయడం.. మధ్యలో ఆపేయడంతో రోడ్డు అస్తవ్యస్తంగా మారింది. ప్రత్తిపాడులో ఒకవైపు సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. రెండో వైపు ఇంత వరకు మొదలు పెట్టలేదు. ఈ మార్గంలో వాహనం ఎదురైతే పక్కకు తప్పుకోవడానికి కూడా వీలు లేదు. ద్విచక్ర వాహనాలు జారి చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

'సర్'కు ముందస్తు ఏర్పాట్లు

13న ఈఆర్‌వో, ఏఈఆర్‌వో, బీఎల్‌వోలకు శిక్షణ

గుంటూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్పెషల్ ఇన్‌క్లూజివ్ రివిజన్(ఎస్ఐఆర్)కు రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ అధికారి ముందస్తు ఏర్పాట్లను ప్రారంభించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఈ ఏడాది నుంచి స్పెషల్ సమ్మరి రివిజన్(ఎస్ఎస్ఆర్) స్థానంలో సర్‌ని దశలవారీగా అమలు చేయడానికి ఇటీవలే శ్రీకారం చుట్టింది. మూడో విడతలో భాగంగా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో సర్ కార్యక్రమాన్ని అమలు చేయనున్నది. ఈ నేపథ్యంలో అందుకు అవసరమైన శిక్షణని ఈఆర్‌వో, ఏఈఆర్‌వో, బీఎల్‌వో, బీఎల్‌వో సూపర్‌వైజర్లకు ఇచ్చేందుకు నిర్ణయించింది. అందులో భాగంగా ఈ నెల 13న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల అధికారులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చీఫ్ ఎలక్టోరల్ అధికారి వివేక్‌యాదవ్ శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నారు. ఆ రోజున సంబంధిత అధికారులంతా తప్పక వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరు కావాలని సీఈవో కార్యాలయం నుంచి జిల్లా యంత్రాంగానికి ఆదేశాలు అందాయి. సర్-2026లో భాగంగా 2025 ఓటర్ల జాబితాలో ఉన్న ఓటర్లను 2002లో ఉన్న ఓటర్ల జాబితాతో మ్యాపింగ్ చేస్తారు. దీనికి సంబంధించిన టెక్నికల్ టీం ఈ ట్రైనింగ్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నది.

వైసీపీ కనుసన్నల్లోనే.. రేషన్ దందా

- వ్యాపారంలో బర్నబాసు హత్య నిందితులు
- అర్ధరాత్రిళ్లు పొన్నూరు సరిహద్దుల దాటవేత

పొన్నూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మారి ఒకటిన్నర సంవత్సరం అవుతుంది.. అయినా పొన్నూరులో రేషన్ దందా ఇంకా వైసీపీ నేతల కనుసన్నల్లోనే సాగుతోంది. గత ప్రభుత్వం హయాంలో పొన్నూరు పేరు చెప్తే రేషన్ మాఫియా గుర్తుకు వచ్చేది. రేషన్ మాఫియా విభేదాలతో బర్నబాసు అనే వ్యాపారి హత్య అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. రేషన్ దందా నిలిపివేయాలని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ హెచ్చరికలు.. స్థానికంగా పటిష్ట నిఘాతో మాఫియా పొరుగు జిల్లాలకు మకాం మార్చింది. అయితే కళ్ల ముందు కోట్లు కనిపిస్తుండటంతో మాఫియా పొన్నూరులో రేషన్ దందాను రహస్యంగా నడుపుతున్నట్లు తెలుస్తోంది. బర్నబాసు హత్య కేసు నిందితులు రేషన్ దందా సాగిస్తున్నట్లు సమాచారం. పోలీసుల నిఘాతో వారు వెనుక ఉండి వ్యాపారం సాగిస్తున్నట్లు సమాచారం. పొన్నూరు పరిధిలో చురుగ్గా ఉన్న యువకులను చేరదీసి వారితో బియ్యం వ్యాపారం చేయిస్తున్నట్లు తెలిసింది. వీరు పొన్నూరు నుంచి అడ్డదారుల్లో అర్ధరాత్రుళ్లు బియ్యాన్ని నియోజకవర్గ సరిహద్దులు దాటించి నిర్వాహకులకు అప్పగిస్తున్నారు. ఇలా తరలించినందుకు కేజీకి రూ.2 నుంచి 4 వరకు చెల్లిస్తున్నట్లు తెలుస్తోంది. ఆ బియ్యాన్ని నిర్వాహకులు చుండూరు, బాపట్ల, ముట్లూరు, తదితర ప్రాంతాలకు తరలించి అక్కడ మిల్లర్లకు అధిక మొత్తంలో విక్రయించి మాఫియా లాభపడుతుంది.



ఇటీవల పొన్నూరులో పట్టుబడిన రేషన్ బియ్యం (పాత చిత్రం)

పోలీసులపైనే నిఘా..

పోలీసులపై నిఘా పెట్టి రేషన్ మాఫియా తమ కార్యకలాపాలకు అడ్డుకోకుండా చూసుకుంటుందని సమాచారం. ఒకటి నుంచి 10వ తేదీ వరకు రేషన్ బియ్యం సేకరించి ఆ తర్వాత నియోజకవర్గ సరిహద్దులు దాటిస్తున్నారు. కొందరు యువకులను ఎంపిక చేసుకుని వారికి రోజుకు 1000 నుంచి 2000 వరకు నగదు చెల్లిస్తూ పోలీసుల కదలికలపై నిఘా పెట్టినట్లు తెలుస్తోంది. స్టేషన్ల నుంచి బయటకు అడుగుపెట్టే పోలీసులను రహస్యంగా అనుసరిస్తూ సమాచారాన్ని మాఫియాకు అందజేయడమే వీరి పని. ఇలా అందే సమాచారంతో మాఫియా నిర్వాహకులు అప్రమత్తమవుతూ బియ్యాన్ని తరలిస్తున్నారు. పోలీసులు నిఘా తీవ్రమైతే స్థానిక యువకులు వారికి పట్టుబడి నిర్వాహకుల వివరాలు బయటకు రాకుండా చూసుకుంటున్నారని తెలుస్తోంది. బియ్యం తరలింపు కోసం పొన్నూరు పట్టణానికి చెందిన వైసీపీకి చెందిన ఓ కీలక వ్యక్తి కారును కొనుగోలు చేసినట్లు సమాచారం. తాళ్లపాలేనికి చెందిన ఓ వ్యాపారిపై 60కిపైగా బియ్యం అక్రమ రవాణా కేసులు ఉన్నా పోలీసులు కన్నెత్తి చూసే సాహసం చేయడం లేదు. ఉప్పరపాలేనికి చెందిన మరో వ్యక్తి నెలకు 5 నుంచి 10 లారీల బియ్యాన్ని తరలించి దండిగాలాభ పడుతున్నాడని సమాచారం.

ముగిసిన ఎస్‌జీఎఫ్ మల్లకంబ్ పోటీలు

● జాతీయ స్థాయి పోటీలకు 20 మంది ఎంపిక



విద్యార్థులతో స్కూల్ గేమ్ ఫెడరేషన్ సభ్యులు తదితరులు

గుంటూరు(విద్య),నవంబరు 8(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 69వ మల్లకంబ్(పోల్‌కు తాడుకట్టి విన్యాసాలు చేసే క్రీడ) పోటీలు శనివారం ముగిశాయి. పెదకాకాని మండలం వెనిగండ్ల జడ్పీ స్కూల్‌లో 7, 8 తేదీల్లో అండర్ 14, 17, 19 విభాగాల్లో బాల బాలికలకు పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పరిశీలకులుగా హాజరైన పాఠశాల విద్యాశాఖ ప్రత్యేక అధికారి శేఖర్‌రాజు మాట్లాడుతూ పోటీలకు పది జిల్లాల నుంచి 180 మంది క్రీడాకారులు హాజరయ్యారని తెలిపారు. నలుగురు సభ్యులతో సెలక్షన్ కమిటీని ఏర్పాటు చేసి వివిధ విభాగాల్లో టోర్నమెంట్ నిర్వహించి 20 మంది క్రీడాకారులను జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేశామని వివరించారు. పోటీలను డీఈఓ సీవీ రేణుక పర్యవేక్షించారు. విద్యార్థులకు ప్రత్యేక వసతులు కల్పించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు తిరుపతిరావు. ఎస్‌జీఎఫ్ కార్యదర్శి గోపి, శిరీష, సీనియర్ ఉపాధ్యాయులు కొండయ్య, లక్ష్మీపతి, మాధవి పాల్గొన్నారు.

19 నుంచి వీరారాధన ఉత్సవాలు

కారంపూడి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కారంపూడి పట్టణంలో ఈ నెల 19 నుంచి ఐదు రోజులపాటు వీరారాధన ఉత్సవాలు నిర్వహించనున్నట్లు వీరాచారం పీఠాధిపతి తరుణ్ చెన్నకేశవ అయ్యవారు తెలిపారు. శనివారం కారంపూడిలో ఆయన మాట్లాడుతూ 19న రాచగావు, 20న రాయబారం, 21న మందపోరు, 22న కోడిపోరు, 23న కల్లిపాడు పేరుతో ఉత్సవాలు జరుగుతాయన్నారు. ఆయన వెంట పీఠం నిర్వాహకుడు బొగ్గరం విజయ్‌కుమార్ ఉన్నారు.

కంచి కామకోటి పీఠాధిపతికి ఘనస్వాగతం



కుంకుమ దిద్దుకుంటున్న స్వామి

కొల్లూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కంచి కామకోటి పీఠాధిపతికి శంకర విజయేంద్ర సరస్వతి స్వామికి భక్తులు ఘన స్వాగతం పలికారు. శనివారం బాపట్ల నుంచి తెనాలిలోని ఓ కార్యక్రమానికి కొల్లూరు మీదుగా వెళుతున్న స్వామికి.. పార్వతి అమ్మవారి దేవస్థాన బ్రాహ్మణ కమిటీ ఆధ్వర్యంలో పూర్ణ కుంభంతో స్వాగత ఏర్పాట్లు చేశారు. స్వామిని ఆలయంలోకి ఆహ్వానించగా సమయభావం వల్ల రాలేనని ఆయన చెప్పడంతో.. కమిటీ సభ్యులు అమ్మవారి కుంకుమ ఇచ్చారు. నుదిటికి ఆ కుంకుమను దిద్దుకుని భక్తులను, కమిటీ సభ్యులను శంకర విజయేంద్ర సరస్వతి ఆశీర్వదించారు.

తెనాలి రైల్వేస్టేషన్ రోడ్డులో గుర్తుతెలియని మృతదేహం



జెండా చెట్టు వద్ద మృతదేహం

తెనాలి క్రైం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : తెనాలి రైల్వేస్టేషన్ రోడ్డులోని జెండా చెట్టు సమీపంలో శనివారం మధ్యాహ్నం గుర్తుతెలియని మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు త్రీ టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. సుమారు 30-35 సంవత్సరాల వయసు కలిగిన వ్యక్తి సమాచారం లభించకపోవడంతో.. మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ ఆసుపత్రి మార్చురికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

సాంకేతికతతో పాటు నైతిక విలువలు అత్యవసరం

● సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జాస్తి చలమేశ్వర్



మాట్లాడుతున్న రిటైర్డ్ జస్టిస్ జాస్తి చలమేశ్వర్

గుంటూరు(విద్య), నవంబరు 8(ఆంధ్రజ్యోతి): న్యాయ, పరిపాలన వ్యవస్థలు ప్రజల అంచనాలకు తగిన విధంగా పని చేయాలంటే సాంకేతికతతో పాటు నైతికత, మానవత్వం కూడా అంతే అవసరమని సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జాస్తి చలమేశ్వర్ పేర్కొన్నారు. వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్సిటీలోని కృత్రిమ మేధస్సు సాంకేతిక యుగంలో న్యాయ సహాయం, న్యాయం అందుబాటులోకి తేవడం.. అనే అంశంపై శనివారం నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో ఆయన పాల్గొని, మాట్లాడారు. ఏఐ, టెక్నాలజీ న్యాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకు వస్తున్నప్పటికీ, అవి ఎప్పటికీ న్యాయవాదులు, న్యాయమూర్తుల స్థానాన్ని భర్తీ చేయలేవని స్పష్టం చేశారు. ఏఐ వ్యవస్థలు పరిశోధన, డ్రాఫ్టింగ్, పరిపాలనలో సహకరించినా.. న్యాయ సారం మాత్రం మానవ ఆలోచన, విశ్లేషణ, దయ, నైతిక తీర్పులోనే ఉంటుందని వివరించారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ యు. దుర్గా ప్రసాద్‌రావు మాట్లాడుతూ టెక్నాలజీ శక్తివంతమైన సాధనం అయితే.. దాని విలువ మానవసేవలోనే ఉందన్నారు. భారత న్యాయ వ్యవస్థ వేగంగా డిజిటలైజేషన్ దిశగా అడుగులు వేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన్ వర్సిటీ వీసీ ఆచార్య నాగభూషణ్, విజ్ఞాన్ విద్యాసంస్థలు చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయంతో సమానంగా అక్వా కల్చర్

● ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి



నదిలో చేప పిల్లలను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

విజయపురిసౌత్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలో రాష్ట్రంలో వ్యవసాయంతో సమానంగా ఫిష్ అండ్ అక్వాకల్చర్‌ను ప్రోత్సహిస్తున్నట్లు మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శనివారం మాచర్ల మండలం అనుపు కృష్ణా జలాశయంలో 6.24 లక్షల చేప పిల్లలను ఆయన విడుదల చేసి, మాట్లాడారు. మత్స్యకారుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. వైసీపీ హయాంలో మత్స్యకార సంక్షేమాన్ని గాలికి వదిలేసి దాదాపు 11 రకాల సంక్షేమ పథకాలను రద్దు చేసిన ఘనుడు జగన్‌మోహన్‌రెడ్డి అని మండిపడ్డారు. గత ప్రభుత్వంలో వేట నిషేధం సమయంలో అందిస్తున్న రూ.10 వేల సాయాన్ని రూ. 20 వేలకు పెంచిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. అక్వా రంగాన్ని ప్రోత్సహించేందుకు విద్యుత్ యూనిట్ ధర రూ. 2.50 నుంచి రూ. 1.50కు తగ్గించారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి సంజీవరావు, గురజాల ఆర్డీవో మురళి కృష్ణ, మాచర్ల తహసీల్దార్ కిరణ్‌కుమార్, టీడీపీ యువ నేత జూలకంటి అక్కిరెడ్డి, పంగులూరి పుల్లయ్య, చిరంజీవిరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు నేరేటి వీరాస్వామి యాదవ్, మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

పటిష్టంగా యువ ఆపద మిత్ర పథకం అమలు

● ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్‌జైన్



తాడేపల్లి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): విపత్తులు సంభవించినప్పుడు బాధితులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం యువ ఆపద మిత్ర పథకం ప్రారంభించిందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్‌జైన్ తెలిపారు. ఈ పథకంలో భాగంగా ఒడిశా రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఐదు రాష్ట్రాలకు చెందిన వలంటీర్లకు ఈ పథకం ద్వారా శిక్షకులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించగా, ఏపీలోని అన్ని జిల్లాల నుంచి 52 మంది వలంటీర్లు 21 రోజులపాటు శిక్షణ పొంది వచ్చారన్నారు. వారిని అభినందిస్తూ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి ప్రఖర్ జైన్ మాట్లాడుతూ శిక్షణ పొందిన ఆపద మిత్ర సేవకులు రాష్ట్రంలోని ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, నెహ్రూ యువకేంద్రం, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ వంటి యువజన సంఘాలకు చెందిన 12,360 మందికి, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, పోలీసు, అగ్నిమాపక ట్రైనింగ్ సిబ్బందితో కలిసి శిక్షణ ఇవ్వనున్నారని చెప్పారు. విపత్తులు సంభవించినప్పుడు భద్రతా దళాలకు అండగా ఉండడం, ప్రజలను రక్షించడం, సురక్షితంగా పునరావాస కేంద్రాలకు తరలించడం, ప్రథమ చికిత్సలు అందించడం.. ప్రమాద నష్టం తగ్గింపులో స్వచ్ఛంద సేవా సంస్కృతిని పెంపొందించడం ఈ శిక్షణ ముఖ్య ఉద్దేశమన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్నవారికి ఆపద సమయాల్లో ఉపయోగపడే అత్యవసర కిట్, ధృవపత్రం, గుర్తింపు కార్డులు, విపత్తుల పట్ల అవగాహన పోస్టర్లు ప్రఖర్ జైన్ అందజేశారు. ఈ సమావేశంలో సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకట దీపక్, ఏట హనుమంతరావు, ఎస్ఈఓసీ ఇన్‌చార్జి పీటర్, వలంటీర్లు పాల్గొన్నారు.

దిండి సముద్ర మార్గంలో 28 ఆవులు మృతి



తీర ప్రాంతంలో చనిపోయిన ఆవు

నిజాంపట్నం(రేపల్లె), నవంబరు 8(ఆంధ్రజ్యోతి): తీర ప్రాంతంలో సముద్రం ఒడ్డున 28 ఆవులు మృతి చెందాయని.. దానికి కారణం తెలియడం లేదంటూ యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శనివారం నిజాంపట్నం మండలం దిండి సముద్రం ఒడ్డున పల్లపట్ల, దిండికి చెందిన రైతుల ఆవులు మృతిచెందాయి. దిండి సమీపంలో హేచరీల నుంచి వచ్చే వ్యర్థాలు కలుషితమైన నీటిని తాగి ఆవులు చనిపోయాయని కొందరు, మడ ఆకులు తిని చనిపోయాయని మరికొందరు భిన్న వాదనలు వినిపిస్తున్నారు. సమీపంలోని పశు వైద్యులు ఆవులను పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం ఒక ఆవును తీసుకువచ్చారు. గుంటూరు జిల్లా గోశాల నుంచి కొంతమంది సభ్యులు వచ్చి ఆవుల మృతిపట్ల విచారణ చేశారు. అయితే రైతులు ఫిర్యాదు ఇవ్వలేదని కేసు నమోదు చేయలేదని పోలీసులు చెబుతున్నారు.

మోటారు సైకిల్‌ని ఢీకొట్టిన లారీ..ఒకరు మృతి



మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

నరసరావుపేట రూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కర్నూలు - గుంటూరు ప్రధాన రహదారిపై నరసరావుపేట మండలం ఉప్పలపాడు గ్రామం వద్ద మోటారు సైకిల్‌ను లారీ ఢీకొట్టింది. శనివారం రాత్రి చోటుచేసుకున్న ఈ ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. మరోకరి పరిస్థితి విషమంగా ఉంది. సమాచారం అందుకున్న రూరల్ ఎస్ఐ ఫాతిమా ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మాచవరం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని గంగిరెడ్డిపాలెంలో చోటుచేసుకుంది. ఎస్ఐ తిరుపతిరావు వివరాల మేరకు.. శుక్రవారం రాత్రి గంగిరెడ్డిపాలెం సమీపంలో ఆటో, ఎద్దుల అరక ఢీకొన్న ఘటనలో జానపాడు గ్రామానికి చెందిన గుడిపూడి కోటేశ్వరరావు(52)కు తీవ్ర గాయాలయ్యాయి. గుంటూరులోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ శనివారం అతను మృతి చెందినట్టు ఎస్ఐ తెలిపారు. మృతుడి కుమారుడు లక్ష్మీ కోటేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

అమరేశ్వరుని సన్నిధిలో..

హైకోర్టు జడ్జి సుబ్బారెడ్డి దంపతులు



న్యాయమూర్తి దంపతులకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఈఓ రేఖ

అమరావతి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి దేవస్థానాన్ని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి దంపతులు శనివారం సాయంత్రం దర్శించుకున్నారు. న్యాయమూర్తి దంపతులకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి వారి పేరున స్వామివార్లకు పూజలు నిర్వహించి, ఆశీర్వచనం, తీర్థప్రసాదాలు, శేషవస్త్రం అందజేశారు. దేవస్థాన సహాయ కమిషనర్ రేఖ న్యాయమూర్తి దంపతులకు స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు.

ఐటీ అధికారి పేరుతో బెదిరింపులు

● 8 పోలీస్‌స్టేషన్లలో కేసులు ● చిలకలూరిపేటలో అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న అర్బన్ సీఐ పి.రమేష్

చిలకలూరిపేట, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఆదాయపు పన్ను శాఖ అధికారిని అంటూ వ్యాపారులను బెదిరించి డబ్బు కాజేస్తున్న గుంటూరు ఆర్టీసీ కాలనీకి ఓ వ్యక్తిని చిలకలూరిపేట అర్బన్ పోలీసులు శనివారం ఇక్కడ అరెస్టు చేశారు. అర్బన్ సీఐ పి.రమేష్ వివరాల మేరకు.. చదలవాడ తిరుమలరెడ్డి అనే వ్యక్తి ఆన్‌లైన్‌లో పలు ప్రాంతాలకు చెందిన వ్యాపారుల వివరాలు సేకరించాడు. ఆదాయ పన్ను దాడులు చేస్తామని, లెక్కల్లో ఏమాత్రం తేడా ఉన్నా పెనాల్టీలు వేస్తామని, ఆస్తులను స్వాధీనం చేసుకుంటామని వారికి ఫోన్ చేసి బెదిరిస్తున్నాడు. డబ్బులు ఇస్తే ఇబ్బందులు లేకుండా చూస్తామని హామీ ఇస్తున్నాడు. ఇతడి ఆగడాలకు సంబంధించి అర్బన్ పోలీసులకు ఫిర్యాదు అందడంతో నిఘా పెట్టారు. అతడిని అరెస్టు చేసి, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. అతడిపై 8 పోలీస్ స్టేషన్లలో కేసులు ఉన్నాయన్నాయని పోలీసులు తెలిపారు. మండలంలోని పసుమర్రు గ్రామంలో ఓ పొగాకు కంపెనీ యజమానిని కూడా నిందితుడు బెదిరించి రూ. 15 వేలు వసూలు చేశాడని పోలీసులు తెలిపారు.

సృజనాత్మక శక్తితో ముందుకు సాగాలి

● రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ డాక్టర్ కె.మధుమూర్తి
● ఘనంగా బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల స్నాతకోత్సవం



విద్యార్థిని షేక్.ముబీనాకు పట్టా అందజేస్తున్న డాక్టర్ కె.మధుమూర్తి, శ్రీనివాసరావు

బాపట్ల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక రంగంలో రాణించాలంటే సృజనాత్మక శక్తితో ముందుకు సాగాలని.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ డాక్టర్ కె.మధుమూర్తి పేర్కొన్నారు. బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల 12వ స్నాతకోత్సవం శనివారం అత్యంత ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.రమాదేవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి డాక్టర్ మధుమూర్తి ముఖ్య అతిథిగా విచ్చేసి.. బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు, పాలక మండలి సభ్యులతో కలిసి జెన్ టెక్నాలజీ రీసెర్చ్ బ్లాక్‌ను ప్రారంభించారు. తదుపరి డిగ్రీ పొందిన 650మంది విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో కొత్తవి నేర్చుకోవాలనే తపన, నిరంతర శ్రమ ఉన్నప్పుడే ఆయా రంగాల్లో అనుకున్న ప్రగతిని తప్పక సాధిస్తారన్నారు. బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల పురోభివృద్ధికి బాధ్యతాయుతమైన పాత్ర పోషిస్తూ విద్యా రంగంలో రాణిస్తూ మంచి పేరు సాధించాలని ఆకాంక్షించారు. స్వర్గీయ ముప్పలనేని శేషగిరిరావు ఆలోచనాత్మక శక్తిని, దూరదృష్టిని కొనియాడారు. బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు మాట్లాడుతూ అంతర్జాతీయ ప్రమాణాల సాధన దిశగా కృషి చేస్తూ.. ఉన్నతమైన ప్రమాణాలతో సాంకేతిక విద్యనందిస్తున్నామన్నారు. ముప్పలనేని శేషగిరిరావు మహోన్నతమైన సేవలను గుర్తు చేసుకున్నారు. ముఖ్య అతిథి డాక్టర్ కె.మధుమూర్తిని ఎడ్యుకేషన్ సొసైటీ పాలక మండలి ఘనంగా సన్మానించింది. ఈ కార్యక్రమంలో బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి మానం నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు కారుమంచి వెంకట్రావు, పారేపల్లి చంద్రశేఖర్, జాయింట్ సెక్రటరీ దొడ్డపనేని వెంకయ్యచౌదరి, కోశాధికారి కోట వీరబ్రహ్మయ్య, కో-ఆర్డినేటర్ డాక్టర్ షేక్.నజీర్, ఆంగ్ల విభాగ అధ్యక్షులు డాక్టర్ పీవీ నాగమల్లేశ్వరరావు, డాక్టర్ వెంకటలక్ష్మి, డాక్టర్ ఎం.వీరయ్య, డాక్టర్ షేక్.షబీన్‌సూల్తనా, తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ కృష్ణ మెమోరియల్ గోల్డ్ మెడల్‌ను సీఎస్ఈ విద్యార్థి సి.హెచ్.పుణ్యవతికి, సిల్వర్ మెడల్‌ను త్రిపుల్‌ఈ విద్యార్థిని కె.లలిత సత్య శ్రీమల్లికకు, బ్రాంజి మెడల్ మెకానికల్ విద్యార్థి ఎన్.రామ్‌కుమార్‌కు ప్రదానం చేశారు. డిగ్రీలు సాధించిన విద్యార్థులు కేరింతలు కొడుతూ ఆనందం వ్యక్తం చేశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	121, 129, 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	228.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	238.00

ఆయువు తీరినా.. మమకారం మరువక..



ఆవు కళేబారానికి మేళతాళాలతో అంతిమయాత్ర

కొల్లూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఇరవై ఏళ్ల ఎంతో ప్రేమగా చూసుకున్న ఆవు అనారోగ్యంతో మృతి చెందడంతో.. కళేబరానికి అంతిసంస్కారాలు నిర్వహించి తన మమకారాన్ని చాటుకున్నాడు ఈ యజమాని. మండలంలోని పోతార్లంక గ్రామానికి చెందిన ఈడ్పుగంటి కుటుంబరావు పోషణలోని ఆవు 20 ఏళ్లలో.. పది సార్లు లేగ, పెయ్య దూడలు అందించింది. ఇటీవల ఆవు అనారోగ్యానికి గురికాగా.. పశు వైద్యులు వైద్య సేవలు అందించినప్పటికీ ఫలితం లేకుండాపోయింది. శనివారం ఆవు కళేబరానికి పసుపు, కుంకుమ, పూలతో పూజలు నిర్వహించి.. ఎడ్ల బండిపై ఉంచి మేళతాళాలతో గ్రామంలో అంతిమ యాత్ర చేశారు. తమ సొంత స్థలంలో కళేబరాన్ని ఖననం చేశారు.

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

డాగ్ షెడ్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

● కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరుకార్పొరేషన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల కోసం పొన్నూరు రోడ్‌లో ఏర్పాటు చేస్తున్న కేంద్ర నిర్మాణ పనులను వేగవంతం చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం కమిషనర్ పొన్నూరు రోడ్‌లో నిర్మాణంలో ఉన్న డాగ్ షెడ్ పనులను పరిశీలించి, పనుల పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకొని మాట్లాడుతూ, కేంద్ర నిర్మాణ పనులను వేగంగా చేపట్టాలన్నారు. అనంతరం అరండల్‌పేట, అశోక్‌నగర్, విద్యానగర్, శారదా కాలనీ, శ్రీనగర్, రాజీవ్‌గాంధీనగర్, యాదవుల బజార్, తదితర ప్రాంతాల్లో అభివృద్ధి పనులను పరిశీలించి, తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. పర్యటనలో ఎస్ఈ (ఇన్‌చార్జి) సుందర్రామిరెడ్డి, డీఈఈలు రమేశ్, సతీష్ కుమార్, కల్యాణరావు, ఇంజనీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.



భవన నిర్మాణాలను పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

రోడ్లపై ఆవులను బందెల దొడ్డికి తరలిస్తాం

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ప్రధాన రహదారులపై ట్రాఫిక్‌కు తీవ్ర ఆటంకంగా ఉంటున్న ఆవులు, ఎద్దులు, దూడలను ఈ నెల 10వ తేదీ నుంచి వెంగళాయపాలెంలోని జీఎంసీ బందెలదొడ్డికి తరలిస్తున్నామని, ఆయా పశువులను వాటి యజమానులు రోడ్ల మీదకు రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలో ప్రధాన రహదారులపై పశువులు విచ్చలవిడిగా ఉండడం వల్ల వాహనదార్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కొన్ని సమయాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. పశువులను రోడ్ల మీదకు వదిలితే తగు చర్యలు తీసుకుంటామని ఇప్పటికే పలుమార్లు యజమానులను హెచ్చరించినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బందెలదొడ్డికి తరలించిన పశువులను విడుదల చేయబోమని, అలాగే యజమానులు భారీ అపరాధ రుసుం చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. రోడ్ల మీద పశువుల వల్ల ప్రజలెవరికైనా సమస్య ఎదురయితే జీఎంసీ కాల్ సెంటర్ 08632345103కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

ఆర్‌వీఆర్‌లో నేషనల్ అగ్రిటెక్ హ్యాకథాన్

గుంటూరు (విద్య), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలకు సాంకేతిక పరిష్కారాలను అందించాలనే లక్ష్యంతో ఆర్‌వీఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో డిసెంబరు 22, 23వ తేదీలలో "నేషనల్ అగ్రిటెక్ హ్యాకథాన్ నిర్వహిస్తున్నట్లు కళాశాల అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ రాయపాటి గోపాలకృష్ణ వెల్లడించారు. ఈ మేరకు చౌడవరంలోని కళాశాలలో శనివారం పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ హ్యాకథాన్‌కు ఆతిథ్యమివ్వడం తమ కళాశాలకు గర్వకారణమని వెల్లడించారు. దేశ వ్యాప్తంగా ప్రతిభావంతులైన యువ ఆవిష్కర్తలు తమ సాంకేతిక నైపుణ్యాలను ప్రదర్శించడం ద్వారా వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులను తీసుకురాబోతున్నారని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, వివిధ విభాగాల హెచ్‌వోడీలు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రాయపాటి గోపాలకృష్ణ తదితరులు

మానసిక వికాసానికి లలిత కళలు దోహదం

● బాలానంద కేంద్రం చైర్మన్ డాక్టర్ మన్నవ రాధాకృష్ణమూర్తి

గుంటూరు (విద్య), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): బాల బాలికలలో మానసిక వికాసానికి లలిత కళలు దోహదం చేస్తాయని బాలానంద కేంద్రం అధ్యక్షుడు డాక్టర్ మన్నవ రాధాకృష్ణమూర్తి అన్నారు. శనివారం బ్రాడీపేటలోని కేంద్రంలో రెండ్రోజుల పాటు జరిగే బాల ప్రభ ఉత్సవాల ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ, తాము చేస్తున్న కృషికి తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. అనంతరం రుద్ర కళాక్షేత్రం నిర్వాహకులు మాచిరాజు రాజేష్ మాట్లాడుతూ, తెలుగు పద్యం, సంస్కృత శ్లోకం, శాస్త్రీయ, జానపద నృత్యం, చిత్రలేఖనం, వాద్యసంగీతం, శాస్త్రీయ సంగీతం గాత్రం లలిత గీతాలు, వాద్య గీతాలు, రంగులు వేద్దాం రండి వంటి అంశాలలో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో బాలానంద కేంద్రం ప్రధాన కార్యదర్శి నడింపల్లి వెంకట గురుదత్, కార్యవర్గ సభ్యులు బి.శ్రీనివాస్, కట్టమూరి నాగ రాజారావు, మాచిరాజు జ్యోతి, ఎకడమిక్ డైరెక్టర్ వై.ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు, బాలానంద కేంద్రం కార్యవర్గం

నాలుగో తరగతి ఉద్యోగుల అడహక్ కమిటీ ఎన్నిక

గుంటూరు (తూర్పు), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏపీ ఎన్జీజీవో కల్యాణ మండపంలో ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా నూతన అడహక్ కమిటీ ఎన్నిక కార్యక్రమం జరిగింది. ఆల్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘ రాష్ట్రాధ్యక్షుడు ఎన్.చంద్రశేఖర్ ఆదేశాలు మేరకు అడ్‌హక్ బాడీ కోఆప్షన్ అధికారి కె.సుబ్బనారాయణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ జిల్లా అధ్యక్షుడిగా కె.శ్రీనివాసరావు, అసోసియేట్ అధ్యక్షుడిగా బి.వినోద్ చౌదరి, ఉపాధ్యక్షుడిగా బి.రమేష్, పి కోటేశ్వరరావు, కార్యదర్శిగా ఎం.వెంకటేశ్వర్లు, సంయుక్త కార్యదర్శులుగా జి.నరేష్, షేక్ సైదాబి, కోశాధికారిగా వి.విజయ్ ప్రసాద్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎమ్.రామ్‌నాయక్‌ను నియమిస్తున్నట్టు ఏపీ ఎన్జీజీవో జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు శ్యామ్ సుందర్, నాగూర్ షరీఫ్, కల్యాణ్, వీఎస్ సాయిరాం, జి. గోవింద్ తదితరులు పాల్గొని నూతన కమిటిని అభినందించారు.



నూతనంగా ఎంపికైన అడ్‌హక్ కమిటీ సభ్యులను అభినందిస్తున్న ఘంటసాల శ్రీనివాసరావు

రేపటి నుంచి ఉచిత యోగ శిక్షణ తరగతులు

గుంటూరు(విద్య), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక బ్రాడీపేట 2/4లోని ఎస్‌వీఎస్ ఆకాడమి ఆవరణలో ఈనెల 10వ తేదీ నుంచి వారాహి యోగా శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత యోగ తరగతులు నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రతినిధి ఆచార్య రామ్ శరత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజు ఉదయం 5.30 నుంచి 6.30 వరకు శిక్షణ ఉంటుందని వెల్లడించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరుకావచ్చునని తెలిపారు. ఇతర వివరాల కోసం సంస్థ కార్యాలయంలో(9885895356) సంప్రదించాలని సూచించారు.

కూటమి ప్రభుత్వంలో క్రీడలకు పెద్దపీట

● తూర్పు ఎమ్మెల్యే నసీర్

● ఇండియన్ బ్యాంక్ జోనల్ క్రికెట్ పోటీలు ప్రారంభం

గుంటూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఇంటికో క్రీడాకారుణ్ణి తయారు చేసే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పని చేస్తోందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. నగరంలోని జేకేసీ కళాశాలలో ఇండియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నీని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో క్రీడలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రానికి చెందిన శ్రీ చరణి ప్రపంచ మహిళా క్రికెట్ టోర్నీలో విజేతగా నిలిచి ఆంధ్రప్రదేశ్ ప్రతిష్టను ఇనుమడింప చేసిందన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో శ్రీ చరణిని అభినందించి ప్రభుత్వం తరపున రూ.2.5 కోట్లు అందజేయడంతోపాటు, గ్రూప్-1 ఉద్యోగం కల్పించామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మైదానాల అభివృద్ధి, క్రీడాకారులకు ప్రోత్సాహం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించామని స్పష్టం చేశారు. తూర్పు నియోజకవర్గంలోనూ క్రీడా మైదానాల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. అనంతరం ఇండియన్ బ్యాంకు యాజమాన్యాన్ని ఎమ్మెల్యే నసీర్ అభినందించారు. కార్యక్రమంలో అమరావతి జోనల్ మేనేజర్ గౌరీ శంకర్, కే.కృష్ణమోహన్, మన్నెం శివనాగమల్లేశ్వరరావు, బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు.



క్రికెట్ పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్

ఘనంగా కనకదాసు జయంతి వేడుకలు

గుంటూరు(విద్య), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాజాగారితోటలోని బీసీ స్టడీ సర్కిల్‌లో శనివారం బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కనకదాసు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా కురుమ సంఘం నాయకులు లంబు రామాంజనేయులు, బుడ్డా వీరయ్య, ధనసిరి శివశంకరరావు, బుడ్డా నాగమల్లేశ్వరరావు, బుక్కా శ్రీనివాసరావు, మర్రి సత్యనారాయణ, బుక్కా ఉమామహేశ్వరరావు తదితరులు హాజరయ్యారు. తొలుత కనకదాసు చిత్రపటానికి బీసీ సంక్షేమశాఖాధికారి మయూరి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కురుమ సామాజిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని, కనీసం కురుమ కుల సర్టిఫికెట్ పొందడానికి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సంఘం నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. కురుమ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గౌడ, వడ్డెర, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్‌ల డైరెక్టర్లు, బీసీ సెల్ అధ్యక్షుడు వి.శ్రీనివాస్ పాల్గొన్నారు.



కనకదాసు జయంతి వేడుకల్లో పాల్గొన్న కురుమ సామాజిక వర్గ నాయకులు



మాట్లాడుతున్న షేక్ లాల్‌వజీర్, పాల్గొన్న నాయకులు

చంద్రబాబు కృషితో.. ఆర్థికాభివృద్ధి దిశగా మైనార్టీలు

● టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి లాల్ వజీర్

గుంటూరు(తూర్పు), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి కృషితో రాష్ట్రంలో మైనార్టీలు ఆర్థికాభివృద్ధి దిశగా పయనిస్తున్నారని టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ లాల్ వజీర్ అన్నారు. స్థానిక అరండల్‌పేట, టీడీపీ జిల్లా కార్యాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 16 వేల డీఎస్సీ పోస్టుల్లో 6 వేల ఉద్యోగాలు మైనార్టీలు, నూర్ బాషాలు సాధించుకున్నారని గుర్తు చేసుకున్నారు. డీఎస్సీ ప్రకటనతోనే మైనార్టీలకు ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలు వచ్చాయని అన్నారు. రాష్ట్రానికి వస్తున్న పరిశ్రమల్లో మైనార్టీలకు అవకాశం కల్పించేలా చంద్రబాబు నాయుడు ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు తెలిపారు. మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్, వక్ఫ్‌బోర్డు, నూర్ భాష కార్పొరేషన్ల ద్వారా వడ్డీ లేని రుణ సదుపాయం అందిస్తున్నట్టు చెప్పారు. రాష్ట్ర మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి హుస్సేన్ మాట్లాడుతూ వైసీపీ మైనార్టీలను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే మైనార్టీలకు సంక్షేమం, అభివృద్ధి అందించేందుకు చంద్రబాబు నాయుడు కృషి చేశారని అన్నారు. రాష్ట్రంలోని ప్రతి మైనార్టీ చంద్రబాబు నాయుడుకు అండగా నిలబడాలని కోరారు. ఈ సమావేశంలో మైనార్టీ నాయకులు బాజీ మాస్టర్, అబ్దుల్ ఖాదర్, ఇలాహి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న శ్రీ లక్ష్మీనరసింహదాసు కీర్తనలు

గుంటూరు(తూర్పు), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక బృందావన్ గార్డెన్స్, శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం, అన్నమయ్య కళావేదికపై శనివారం గాయత్రీ మహిళా సంగీత సన్మండలి ఆధ్వర్యంలో శ్రీ తూము లక్ష్మీనరసింహదాసు కీర్తనల సోదాహరణ పూర్వక ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా తూము లక్ష్మీనరసింహదాసు కీర్తనలను విద్వాన్ ఆకొండి శ్రీనివాస రాజారావు సోదాహరణ పూర్వక వివరణతో శ్రావ్యంగా గానం చేసి సంగీతాభిమానులను అలరించారు. తొలుత కార్యక్రమాన్ని సంస్థ ఉపాధ్యక్షురాలు మాధవపెద్ది మీనాక్షి తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. సంస్థ ఉపాధ్యక్షులు డాక్టర్ రాజరాజేశ్వరి, లలిత దేవి, మీనాక్షి తదితరులు కళాకారులను, అతిథులను ఘనంగా సత్కరించారు.

సాంఘిక సంక్షేమ హాస్టల్లో వైద్య శిబిరం

గుంటూరు (విద్య), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్‌లో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ మల్లికార్జునరావు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు ఆరోగ్య సూత్రాలు వివరించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. విద్యార్థుల బరువు లెక్కించి అందుకు అనుగుణంగా పౌష్టికాహారం తీసుకోవాలని వైద్యులు సూచించారు.

డైరెక్ట్ వీఆర్‌వోలకు ప్రమోషన్‌లలో న్యాయం చేయాలి

● కేంద్ర మంత్రి పెమ్మసానికి వీఆర్‌వోల వినతిపత్రం

గుంటూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): 2012, 2014లో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా ఉద్యోగాలు సాధించిన వీఆర్‌వోలకు ప్రమోషన్‌లలో న్యాయం చేయాలని ఏపీ డైరెక్ట్ వీఆర్‌వోల సంఘం నేతలు కేంద్ర మంత్రి పెమ్మసానికి విజ్ఞప్తి చేశారు. వందలాది మంది డైరెక్ట్ వీఆర్‌వోలు డైరెక్ట్ వీఆర్‌వోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.ప్రసన్నకుమార్, అఖిల భారత ఓబీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు అంగిరేకుల వరప్రసాద్ యాదవ్ ఆధ్వర్యంలో కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసానికి శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో జీవో 154 ప్రకారం వీఆర్వో గ్రేడ్ 1 నుంచి సీనియర్ అసిస్టెంట్‌లుగా ప్రమోషన్ పొంది 2 సంవత్స రాల గడువులోగా డిపార్ట్‌మెంట్ టెస్ట్‌లు పాస్ కాని వారు గుంటూరు జిల్లాలోనే మొత్తం 50 మందికి పైగా అనర్హులు కొనసాగు తున్నారని, వారిని తక్షణమే రివర్షన్ చేసి సీనియారిటీ జాబితాలో తదుపరి అర్హులైన వీఆర్‌వోలకు ప్రమోషన్‌లు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ విఆర్వోల సంఘం రాష్ట్ర కోశాధికారి రేగులగడ్డ వెంకట్, జిల్లా నాయకులు పి.శ్రీనివాస్, బి.నాగరాజు, సీహెచ్ అనిల్, నర్సిరెడ్డి, ప్రమీల, రమాదేవి, షకీల తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

గుంటూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆర్‌వీఆర్ అండ్ జేసీ కళాశాల సమీపంలో ఈ నెల 3న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన షేక్ మూసా సాహెబ్ (67) శనివారం మృతి చెందారు. అడవి తక్కెళ్ళపాడు టిడ్కో క్వార్టర్స్ కు చెందిన మూసా సాహెబ్‌కు కొద్ది సంవత్సరాల క్రితం ఎడమ కాలుకు ఇన్ఫెక్షన్ సోకడంతో కాటూరి ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నారు. కాటూరి ఆసుపత్రికి ద్విచక్ర వాహనంపై వెళ్లి తిరిగి వస్తుండగా ఆర్‌వీఆర్ కళాశాల మెయిన్ రోడ్డు ఆర్చి వద్ద వెనుక నుంచి అతివే గంగా వచ్చిన మరో ద్విచక్ర వాహనం బలంగా ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన ఆయనను వెంటనే కాటూరి ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. కుమారుడు సుభాని ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధ తాళలేక యువకుడి ఆత్మహత్య

అప్పులు బాధ తాళలేక గడ్డిమందు తాగి ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని అడవి తక్కెళ్ళపాడు సుందరయ్య కాలనీకి చెందిన సూదుల మంజునాథ్ (20) గతంలో అమరావతి రోడ్డులోని ఓ షాపులో పనిచేశాడు. ప్రస్తుతం ఇంటి వద్ద ఖాళీగా ఉంటున్నాడు. అయితే అతను షాపులో పనిచేస్తున్నప్పుడు రూ.2 లక్షల 60 వేల అప్పులు చేసి ఓ స్పోర్ట్స్ బైక్ కొనుగోలు చేశాడు. ఆ అప్పు తీర్చాలంటూ అప్పుల వాళ్లు ఒత్తిడి చేస్తుండడంతో ఈనెల 1న గడ్డి మందు తాగి ఆత్మహత్యా యత్నం చేశాడు. కుటుంబసభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించి మెరుగైన చికిత్స నిమిత్తం అక్కడ నుంచి ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం మంజూనాథ్ మృతి చెందాడు. మృతుడి అన్న నారాయణ బాబు ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ట్రాన్స్‌పోర్టు వ్యాపారి అదృశ్యం



వెంకట రమణారెడ్డి (ఫైల్)

గుంటూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక లాలాపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని సంగడిగుంటకు చెందిన లారీ ట్రాన్స్‌పోర్టు వ్యాపారి మారెడ్డి రమణారెడ్డి (65) అనే వ్యక్తి అదృశ్యమయ్యాడు. శనివారం తెల్లవారుజామున 4.45 గంటల సమయంలో వాకింగ్ నిమిత్తం ఇంటి నుంచి బయటకు వెళ్ళి రాత్రి వరకు తిరిగి రాలేదు. బంధువులు, తెలిసి వారిని వాకబు చేసినా ఆచూకీ లభించలేదు. ఆయన ఆచూకీ తెలిసిన వారు లాలాపేట పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

మతిస్థిమితం సరిగా లేని ఒడిస్సా వ్యక్తి..



బలుత నాయక్ (ఫైల్)

మతిస్థిమితం సరిగా లేని ఒడిస్సా రాష్ట్రానికి చెందిన బలుత నాయక్ (42) అనే వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఒడిస్సా రాష్ట్రంలోని కళాహండి జిల్లా తుఅమూల్ రాంపూర్ బ్లాక్‌లోని మహాలపట్నం పంచాయతీలోని బడశుకులి గ్రామానికి చెందిన బలుత నాయక్ అక్కడ ఉపాధి లేక బతుకుదెరువు కోసం కేరళ రాష్ట్రానికి వెళ్ళాడు. అయితే అక్కడ అనారోగ్యానికి గురై ఆరోగ్యం క్షీణించడంతో వైద్యం చేయించుకుని గత బుధవారం స్వగ్రామానికి బయలు దేరాడు. తొలుత విజయవాడ చేరుకున్నాక మానసిక స్థితి సరిగా లేని కారణంగా అక్కడ నుంచి మరో రైలు ఎక్కి వెళ్ళిపోయాడు. అతని ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో బాధితుడి కుటుంబ సభ్యులు అక్కడి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. దీంతో అదృశ్యమైన బలుత నాయక్ ఆచూకీ తెలిసిన వారు 8457948137లో తెలియజేయాలని వారు కోరారు.

వాట్సాప్ గవర్నెన్స్‌తో ప్రజల చేతిలో ప్రభుత్వం

● పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి



ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజల వద్దకే ప్రభుత్వం.. ప్రజల చేతిలో ప్రభుత్వం అనే ఆశయంతో రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన వాట్సాప్ గవర్నెన్స్ నియోజకవర్గ ప్రజలందరూ వినియోగించుకోవాలని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి కోరారు. ప్రజలందరూ వాట్సాప్ నంబర్ 95523 00009తో తమ మొబైల్ ద్వారా పలు సేవలు పొందవచ్చని అన్నారు. వాట్సాప్ గవర్నెన్స్ సేవలపై సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అవగాహన కల్పించాలని ఆమె సూచించారు. కూటమి ప్రభుత్వం వేగవంతంగా పౌర సేవలను అందిస్తోందని, మన మిత్ర ద్వారా ప్రజల చేతిలో ప్రభుత్వం అనే భావనను సాకారం చేసేందుకు దృష్టి సారించామని తెలిపారు.

అంబటిది మేకపోతు గాంభీర్యం

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి



కనపర్తి శ్రీనివాసరావు

గుంటూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మాజీ వైసీపీ మంత్రి అంబటి రాంబాబు మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు ఎద్దేవాచేశారు. పిల్లికి కూడా బిచ్చం పెట్టే అలవాటులేని ఆయన కుక్కను పెంచుతున్నాడంటే నమ్మశక్యంగా లేదని అన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మంత్రి నారా లోకేశ్ రెడ్‌బుక్‌కు నా కుక్క కూడా భయపడదని పదే పదే మాట్లాడడంలోనే అంబటి ఆంతర్యం అర్థమవుతోందని అన్నారు. లోకేశ్ రెడ్ బుక్ దెబ్బకు వైసీపీ ప్రభుత్వంలోని అరాచక, అవినీతి మంత్రులంతా నిద్రలేని రాత్రులు గడుపుతున్నారని పేర్కొన్నారు. అసెంబ్లీ సాక్షిగా చంద్రబాబు సతీమణిని అవమానపరిచి ఇప్పుడు తామేమీ మాట్లాడలేదని అనడం అంబటి దిగజారుడుతనానికి నిదర్శనమని అన్నారు. జగన్ రెడ్డి అవినీతి, అరాచకాలకు ప్రజలు భయపడి 11 సీట్లిచ్చినా వైసీపీ అగ్రనేతల వ్యవహారశైలిలో ఏం మార్పు రాలేదని శ్రీనివాసరావు దుయ్యబట్టారు.

రెడ్‌బుక్‌ను చూసి వణికిపోతున్న అంబటి

● ఏపీ లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు

గుంటూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి అంబటి రెడ్ బుక్ గురించే రోజూ మాట్లాడటం చూస్తుంటే, ఆయన దాన్ని చూసి ఎంతగా భయపడుతున్నారో అర్థమవుతోందని ఏపీ లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. వైసీపీ నాయకులు ఐదేళ్ల అరాచకాలు, అవినీతి, మహిళల పట్ల వికృతంగా ప్రవర్తించారు కాబట్టే వారు ఇప్పుడు జైలుకు వెళ్లక తప్పదని అన్నారు. అధికారం శాశ్వతం అనుకున్నది ఆనాడు జగన్ మోహన్ రెడ్డేనని, వైసీపీ అహంకారాన్ని రాష్ట్ర ప్రజలు దించారన్న సంగతిని అంబటి మరచిపోకూడదని మాణిక్యరావు పేర్కొన్నారు.

ప్రజల హృదయాల్లో నిలిచిపోయిన ఎన్‌జీ రంగా

గుంటూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎటువంటి ప్రతిఫలం, పదవులు ఆశించకుండా నిరంతరం ప్రజా సంక్షేమం, అభివృద్ధి, ముఖ్యంగా రైతాంగం కోసం శ్రమించిన ఆచార్య ఎన్‌జీ రంగా ప్రజల హృదయాల్లో రైతు రంగాగా నిలిచిపోయారని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి పేర్కొన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఎన్‌జీ రంగా జయంతి కార్యక్రమం శనివారం జరిగింది. ఈ సందర్భంగా రంగా చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. వ్యవసాయం, రైతులు, రైతాంగ కార్మికులు, చేనేత కార్మికుల సంక్షేమం కోసం ఆయన జీవితాంతం కృషి చేశారన్నారు. కార్యక్రమంలో రైతు నాయకుడు బి.శ్రీనివాసరావు, ఘనాశ్యామాచార్యులు, చంద్రయ్య, పీఎస్ మూర్తి తదితరులున్నారు.


ఏరియా వైద్యశాలలోని నవజాత శిశువుల స్థిరీకరణ యూనిట్

చేరువలో చిన్నారులకు చికిత్స

- ఏరియా వైద్యశాలలో అత్యాధునిక వైద్య సేవలు
- నవజాత శిశులపై వైద్య సిబ్బంది ప్రత్యేకశ్రద్ధ
- మధ్యతరగతి, పేద తల్లిదండ్రులకు వరం..

సత్తెనపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో చిన్నారులకు చక్కటి వైద్యాన్ని వైద్యులు, సిబ్బంది అందిస్తున్నారు. పుట్టిన పిల్లల దగ్గర నుంచి ప్రతి ఒక్కరికీ ఇక్కడే నాణ్యమైన వైద్య సేవలందిస్తూ.. ప్రజల మన్ననలు పొందుతున్నారు. పిల్లలు అనారోగ్యానికి గురైతే.. తల్లిదండ్రుల ఆందోళన అంతాఇంతా కాదు. దీనిని ప్రైవేట్ హాస్పిటల్స్ ఆసరా చేసుకొని వేలాది రూపాయలు వారి నుంచి వసూలు చేస్తాయి. పేద, మధ్య తరగతి ప్రజలు ఇలా ఆర్థికంగా చితికిపోకుండా.. చిన్నా రులకు మెరుగైన వైద్య సేవలను ఏరియా వైద్య శాలలోనే ప్రభుత్వం అందిస్తోంది. చిన్నా రుల వైద్య నిపుణులు, వైద్య సిబ్బంది నిత్యం అందు బాటులో ఉంటున్నారు. వైద్యశాలలోని నవజాత శిశువుల యూనిట్‌లో అవసరమైన పరికరాలను సమకూర్చారు. అప్పుడే పుట్టిన పిల్లలకు పచ్చకా మెర్లు, బరువు తక్కువ, ఉమ్మ నీరు ఇలా.. తీవ్ర అనారోగ్య సమస్యలకు నవజాత శిశువుల స్థిరీ కరణ యూనిట్‌లో చికిత్స అందిస్తున్నారు. జ్వరం వచ్చినా, ప్లేట్‌లెట్స్ తగ్గినా ఇక్కడే అధు నాతన వైద్యం అందజేస్తున్నారు. 24 గంటలు వైద్యులు, సిబ్బంది పర్యవేక్షణ ఉంటోంది. ఈ ఏడాది ఇప్పటి వరకు 953 మంది చిన్నారులకు వివిధ రకాల వైద్య సేవలను అందించారు.

ఆస్పత్రిలో ఆధునిక పరికరాలు



చిన్నారుల వైద్య సేవలకు హాస్పిటల్‌లో ఆధునిక పరికరాలున్నాయి. ఇద్దరు వైద్యులతో ఇక్కడ సేవలు అందిస్తున్నాం. అప్పుడే పుట్టిన చిన్నారులకు ఇక్కడ మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి. వీటిని సద్వినియోగం చేసు కోవాలి. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఆస్పత్రికి అవసరమైన పరికరాలను ప్రభుత్వం ద్వారా సమకూర్చుతున్నారు.

-డాక్టర్ లక్ష్మణరావు, సూపరింటెండెంట్, సత్తెనపల్లి ఏరియా వైద్యశాల

అద్వితీయం.. అబ్బురం

- కోలాహలంగా వీవీఐటీయూ బాలోత్సవ్
- ఆకట్టుకున్న చిన్నారుల ప్రదర్శనలు



పెదకాకాని, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): బాలల పండుగ అద్వితీయంగా సాగుతోంది. చిన్నారుల సాంస్కృతిక కళా ప్రదర్శనలు అబ్బురపరుస్తూ.. విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆనందోత్సాహాల నడుమ వీవీఐటీయూ బాలోత్సవ్ 2025 వేడుకలు కొనసాగుతున్నాయి. రెండవ రోజు శనివారం వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నలాజికల్ యూనివర్సిటీ ప్రాంగణం విద్యార్థుల కేరింతలతో సందడిగా మారింది. సెలవుదినం కావడంతో.. సందర్శకుల తాకిడి బాలోత్సవ్ ప్రాంగణంలో పెరిగింది. 280 పాఠశాలల నుంచి 4 వేల మంది విద్యార్థులు సబ్ జూనియర్స్ విభాగంలో వివిధ పోటీల్లో పాల్గొన్నారు. జానపద నృత్యాలు, నా టికలు, సంగీతం తదితర అంశాల్లో వారి ప్రద ర్శనలు వీక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. 350 జానపద నృత్యాలు వేదికల వద్ద ప్రే క్షకుల కరతాళ ధ్వని.. మిన్నం టంది. 54 నాటిక లు చిన్నారులకు సమాజం పట్ల ఉన్న దృక్పథా న్ని, సామాజిక అవగాహనను వెలికితీసే విధంగా సాగాయి. కథ, కవిత, లేఖా రచనలు వారిలోని సృజనాత్మకతను బయటకు తీశాయి. న్యాయ నిర్ణేతలు విద్యార్థులు ప్రత్యేక బోధనలు చేశారు. పోటీల అనంతరం గజల్ శ్రీనివాస్ నిర్వహించిన సంగీత కచేరి చిన్నారులను అలరించింది.



బాలోత్సవంలో బహుమతి ప్రదానం చేస్తున్న గజల్ శ్రీనివాస్ తదితరులు



మిర్చియార్డు కింగ్ 341

- క్వింటాల్‌కు రూ. 17 వేల ధర
- కర్ణాటక రకం 2043 అయితే రూ. 20 వేలు
- పెరగని 'తేజ'స్సు



గుంటూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మార్కెట్‌లో మిర్చి ధరలు ఘాటెక్కాయి. కారం తయారీకి వినియోగించే 341 వెరైటీ మిర్చికి గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ(మిర్చి యార్డు)లో డిమాండ్ గణనీయంగా పెరిగింది. సీజన్‌లో ఈ రకం మిర్చి క్వింటాల్ ధర రూ.13 వేల మధ్యనే ఉండగా నేడు రూ. 17 వేలకు పెరిగింది. దేశీయంగా ఉన్న డిమాండ్ దృష్ట్యా ఈ వెరైటీకి రాబోయే రోజుల్లో మరింత ధర పెరగొచ్చని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. దీంతో రైతులు, స్టాకిస్టులు ఆచితూచి తమ వద్ద ఉన్న మిర్చి నిల్వలను యార్డుకు తీసుకొచ్చి విక్రయిస్తూ లాభాలు గడిస్తున్నారు. మరోవైపు కర్ణాటకలో మాత్రమే పండే 2043 రకానికి కూడా విపరీతమైన డిమాండ్ పెరిగింది. దీనిని కూడా కారం తయారీకే వినియోగిస్తారు. ఈ రకం మిర్చిని ఆ రాష్ట్రానికి చెందిన రైతులు మిర్చి యార్డుకు తీసుకొస్తుండగా ఎగుమతిదా రులు పోటీపడి క్వింటాల్ రూ.19 వేల నుంచి రూ.20 వేలకు కొనుగోలు చేస్తోన్నారు.

పెరగని తేజస్సు..

గుంటూరు మిర్చి యార్డు ఘాటు వెరైటీలకు పెట్టింది పేరు. అందులో ముఖ్యమైన రకం తేజ. ఇది ఎక్కువగా చైనా, బంగ్లాదేశ్‌లకు ఎగుమతి అవుతుంటుంది. అయితే ప్రస్తుతం ఎగుమతులు అంత ఆశాజనకంగా లేకపోవడంతో తేజ వెరైటీ మిర్చి అంతంత మాత్రంగానే విక్రయం జరు గుతోంది. ఈ కారణంగా ధర క్వింటాల్ రూ. 14 వేల నుంచి రూ.15 వేల మధ్యనే కొనసాగుతోంది. ఎక్స్‌పోర్టు ఆర్డర్స్ వస్తే తప్పా తేజ వెరైటీ ధర పెరగదని ఎగుమతిదారులు తెలిపారు. పైగా ఈ రకం స్టాకులే కోల్డ్ స్టోరేజ్‌లలో ఎక్కు వ శాతం ఉన్నట్లు చెబుతున్నారు. ప్రస్తుతం మాత్రం 341, 2043(కర్ణాటక), బ్యాడిగి వెరైటీల మిర్చి అమ్మకాలు జోరుగా కొనసాగుతున్నాయి.

341కు పెరిగిన డిమాండ్


ఇటీవల ముఖ్యంగా ఊరగాయ పచ్చళ్ల కోసం బాగా ఎరుపు రంగులో ఉండే 341 వెరైటీ మిర్చితో తయారు చేసిన కారాన్ని ఉత్పత్తిదా రులు వినియోగిస్తున్నారు. ఈ రకం కారంలో పెద్దగా ఘాటు ఉండదు. పచ్చళ్లు చాలా ఎర్రగా కనిపిస్తుంటాయి. అలానే ఈ వెరైటీ మిర్చి నుంచి ఎర్ర రంగు తీసి కొన్ని ఔషధాల్లో కూడా వినియోగిస్తుంటారు. దీంతో ప్రస్తుతం మిర్చి యార్డులో అన్‌సీజన్ అయినప్పటికీ 341 రకం మిర్చికి మంచి డిమాండ్ ఏర్పడింది. నిత్యం విక్రయం జరుగుతున్న 50 వేల మిర్చి టిక్కీలలో 20 నుంచి 22 శాతం వరకు ఈ వెరైటీ బస్తాలే ఉంటున్నాయి. ఇటీవల భయపెట్టిన మొంథా తుపాను వల్ల పంట దెబ్బతిందని, మార్కెట్‌కు రావడం ఆలస్యమవుతుందన్న ఊహాగానాలతో ఎగుమతి దారులు మిర్చి యార్డులో వివిధ రకాలు కొనుగోలు చేసి స్టాకు పెట్టుకొంటున్నారు.

తెనాలి, బాపట్ల మీదగా శబరిమల స్పెషల్స్

గుంటూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): శబరిమలకు వెళ్లే యాత్రికుల సౌకర్యార్థం తెనాలి, బాపట్ల మీదగా ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 07109 కాకినాడటౌన్ - కొట్టాయం స్పెషల్ ఈ నెల 17, డిసెంబరు 1, 8, 15, 22, 29, జనవరి 5, 12, 19 తేదీల్లో తెనాలి, బాపట్ల, చీరాల మీదగా ప్రయాణిస్తుంది. 07110 కొట్టాయం - కాకినాడటౌన్ స్పెషల్ ఈ నెల 18, డిసెంబరు 2, 9, 16, 23, 30, జనవరి 6, 13, 20 తేదీల్లో పైన పేర్కొన్న స్టేషన్ల మీదగా తిరుగు ప్రయాణమవుతుంది. రెండు రైళ్లు కలిపి మొత్తం 18 సర్వీసులు ఉంటాయి. వీటికి అడ్వాన్స్ బుకింగ్ ఆదివారం ఉదయం 8 గంటల నుంచి ప్రారంభిస్తున్నట్లు సీపీఆర్‌వో తెలిపారు.

ప్రకాశం బ్యారేజీ దిగువకు 53,400 క్యూసెక్కులు

తాడేపల్లి టౌన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణా నది వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన పులిచింతల ప్రాజెక్టుతోపాటు మున్నేరు, వెలగలేరు, కీసర తదితర ప్రధాన వాగుల నుంచి 60,946 క్యూసెక్కుల వరద నీరు శనివారం ఇన్‌ఫ్లోగా నమోదు అవుతుండగా 53,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఇరిగేషన్ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటి మట్టం కొనసాగుతుండగా తూర్పు డెల్టా కాలువకు 2311, పశ్చిమ డెల్టాకు 5009, గుంటూరు ఛానల్‌కు 226 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్టు జేఈ తెలిపారు.


ప్రకాశం బ్యారేజీ దిగువకు విడుదల అవుతున్న కృష్ణానది వరదనీరు

మూతపడిన సాగర్ ప్రాజెక్ట్ క్రస్ట్‌గేట్లు



విజయపురిసౌత్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎగువున ఉన్న శ్రీశైలం ప్రాజెక్ట్ నుంచి వరద నీరు తగ్గుముఖం పట్టడంతో శనివారం నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ అధికారులు ప్రాజెక్ట్ క్రస్ట్‌గేట్లను మూసివేశారు. కాగా సాగర్ జలాశయం నీటిమట్టం 589.60 అడుగులు ఉంది. ఇది 310.84 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10వేల క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 5297 క్యూసెక్కులు, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 34,226 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 51,323 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 51,323 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

విద్యుత్ ప్రాజెక్టులో 0.7885 ఎంయూల విద్యుదుత్పత్తి

రెంటచింతల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో శుక్రవారం అర్ధరాత్రి 12 గంటల వరకు రెండు యూనిట్ల ద్వారా 0.7885 ఎంయూల విద్యుదుత్పత్తి జరిగినట్లు ఎస్ఈ కె.వెంకటరమణ, ఈఈలు సుబ్రహ్మణ్యం, నాగరాజు తెలిపారు. ప్రాజెక్టుకున్న 20 రేడియల్ క్రస్ట్ గేట్లకు గాను 2 గేట్లను మీటర్.. మరో 2 గేట్లను 1.5 మీటర్ల మేర ఎత్తి 22,640, టేల్ రేస్‌ఛానల్ ద్వారా 8469 క్యూసెక్కులు మొత్తంగా 31109 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నారు. ఎగువన సాగర్, ఎత్తిపోతల, హాలియా వాగుల నుంచి 34,226 క్యూసెక్కుల నీరు వస్తుందన్నారు. రిజర్వాయర్‌లో 75.50 మీటర్ల మేర నీరుండగా ఈ నీరు 7.080 టీఎంసీలకు సమానం.

విశ్రాంతి లేకుండా తిప్పిస్తున్నారు..

- పీఎఫ్ ముగింపు సొమ్ము కోసం ఎదురు చూపులు
- విశ్రాంత ఉపాధ్యాయులకు తప్పని తిప్పలు
- పది నెలలు గడుస్తున్నా లెక్క తేల్చని వైనం
- జడ్పీ సిబ్బంది అలసత్వం....లోపించిన అధికారుల పర్యవేక్షణ
- జనవరి 2022 పీఎఫ్ చందా మొత్తాలు ఎగవేసినట్లేనా?

గుంటూరు(విద్య), నవంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్‌లో పీఎఫ్ విభాగం సిబ్బంది అలసత్వం.. అధికారుల పర్యవేక్షణ లోపం ఉపాధ్యాయులు, విశ్రాంత ఉపాధ్యాయులను తీవ్ర మానసిక వేదనకు గురిచేస్తున్నాయి. పీఎఫ్ సెక్షన్‌లో సిబ్బంది అలవిమాలిన నిర్లక్ష్యం విశ్రాంతి తీసుకోవాల్సిన వారిని.. కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరిగేలా చేస్తోంది. సంవత్సరం నుంచి పీఎఫ్ ముగింపు సొమ్ము కోసం కళ్లుకాయలు కాసేలా ఎదురు చూడాల్సి వస్తోంది.

సిబ్బంది తీవ్ర నిర్లక్ష్యం..

ఉమ్మడి జిల్లాలో మండల, జిల్లా పరిషత్ పాఠశాలల్లో పనిచేస్తున్న 10 వేల మందికిపైగా ఉపాధ్యాయులు, విశ్రాంత ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది పీఎఫ్ ఖాతాలను జడ్పీలోని పీఎఫ్ విభాగం సిబ్బంది నిర్వహిస్తారు. ప్రతి నెలా ఉద్యోగుల జీతాల్లో మినహాయించిన పీఎఫ్ చందాలను ట్రెజరీ శాఖ నుంచి వచ్చిన వివరాలతో సరి చూసుకొని వాటిని వారి వ్యక్తిగత పీఎఫ్ ఖాతాలకు జమ చేస్తారు. అదేవిధంగా రుణాల మంజూరు, మరణించిన, పదవీ విరమణ పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయుల ఖాతాలను వడ్డీతో ముగించి ఆ సొమ్మును ప్రతి నెలా సీఎఫ్ఎంఎస్ గేట్‌వే ద్వారా వ్యక్తిగత ఖాతాల్లోకి జమ చేస్తారు. ఈ మొత్తాలు 3 నుంచి 4 నెలల్లోపు విడుదల అవుతాయి. అయితే సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా నెలల తరబడి బిల్లులకు మోక్షం కలగడం లేదు.

- జడ్పీలో మండల పరిషత్ టీచర్లకు ఒక సెక్షన్, జిల్లా పరిషత్ టీచర్లకు, బోధనేతర సిబ్బం దికి మరొక సెక్షన్ ఉంటుంది. ప్రతి సెక్షన్‌లో ఒక ఏఓ, 10 మంది చొప్పున సిబ్బంది ఉంటారు.
- ప్రాథమిక పాఠశాల టీచర్ల సెక్షన్‌లో రిటైరయిన రెండు నెలలకే ముగింపులు పరిష్కరిస్తుంటే, జడ్పీ టీచర్ల పీఎఫ్ చూసే సెక్షన్‌లో విశ్రాంత టీచర్ల ముగింపు సొమ్మునకు సంబంధించిన ప్రతిపాదనలు ప్రాసెస్ చేసి లోకల్ ఫండ్ (ఎల్ఎఫ్) ఆడిట్‌కు పంపేందుకు.. కనీసం 5 నెలలు పడుతుందని ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ ఉన్న సిబ్బంది చేయి తడిపితేనే ఫైల్‌కు మోక్షం కలుగుతోందన్న విమర్శలున్నాయి. ఆ తరువాత కూడా ఫైల్ కదలడానికి నెల రోజులు పడుతుందని చెబుతున్నారు. మళ్లీ ఆ తర్వాత బిల్లులు చేయడానికి మరొక నెల పడుతుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు.
- పదవీ విరమణ తర్వాత వచ్చే పీఎఫ్ నగదుతో ఇల్లు, పిల్లల వివాహాలు, వైద్య ఖర్చులకు ఉద్యోగులు ఉపయోగించుకుంటారు. పీఎఫ్ సొమ్ము సకాలంలో విడుదల కాకపోవడంతో ఉద్యోగులు, విశ్రాంత ఉపాధ్యాయులు తీవ్ర మనోవేదనకు గురిఅవుతున్నారు.
- ఉమ్మడి జిల్లాలోని నరసరావుపేట, ఈపూరు, రొంపిచర్ల, నకరికల్లు మండలాల్లోని జడ్పీ టీచర్ల పీఎఫ్ ముగింపులు పది నెలలుగా పరిష్కరించే వారు కనిపించడం లేదు.
- జడ్పీలో బిల్లులు చేసే సిబ్బందికి ఇటీవల బది లీ చేపట్టారు దీంతో ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుల ముగింపు ఖాతాలు, లోన్లు ని లిచిపోయినట్లు ఉపాధ్యాయులు చెబుతున్నారు.
- పీఎఫ్ విభాగంలో పనిచేసే సిబ్బందికి నైపుణ్యం, ఓర్పు నేర్పు, సమర్థత ఉండటం లేదు. కేవలం గుంటూరులో నివాసం కోసం మాత్రమే వచ్చిన సిబ్బందిని ఈ సెక్షన్‌కు బదిలీ చేస్తున్నారని విమర్శలున్నాయి. వారిపై అధికారులకు అజమాయిషీ లేకపోవడం ఉపాధ్యాయులకు శాపంగా మారిందనే ఆరోపణలు వస్తున్నాయి.
- పీఎఫ్ సమస్యలపై 20 రోజులుగా విడతల వారీగా జడ్పీ సీఈఓ, డిప్యూటీ సీఈవోకు విన్నవించిన ఫలితం లేదని ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.
- జనవరి 2022లో మినహాయించిన పీఎఫ్ చందాలు వివరాలు అక్టోబరు 2024లో జడ్పీకి పంపినా ఇంతవరకు ఉద్యోగుల పీఎఫ్ ఖాతాలో నగదు జమ కాలేదు. జనవరి 2022 నుంచి ఇప్పటి వరకు మరణించిన, పదవీ విరమణ చేసిన 500 మందికిపైగా ఉన్న ఉద్యోగులకు (కనీసం ఒక్కొక్క జనవరి 2022 నుంచి చందా రూ. 10 వేలు) జమ చేయకుండానే ముగింపు చేసి సొమ్ములు చెల్లించడం దారుణమని ఉపాధ్యాయులు, విశ్రాంత ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
- రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోని విశ్రాంత ఉద్యోగులకు జనవరి 2022 చందాతో కలిపి లెక్కగట్టి పీఎఫ్ ఖాతాలను ముగించారని, గుంటూరు జిల్లాలో జనవరి నెల పీఎఫ్ మినహాయింపుల వివరాలు రాలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



సూర్యలంక తీరానికి అనుమతి

- 18 రోజుల తర్వాత పుణ్యస్నానాలు ఆచరించిన భక్తజనం
- పటిష్ట భద్రతా ఏర్పాట్లలో పోలీసులు



సూర్యలంక బీచ్‌లో స్నానాలు చేస్తున్న పర్యాటకులు, భక్తులు

బాపట్ల, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): బాపట్ల సూర్యలంక సుముద్ర తీరం ద్వారాలు శనివారం తెరుచుకున్నాయి. కార్తిక మాసంలో భక్తుల సముద్ర స్నానానికి ఆటంకం తొలగింది. మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాల కారణంగా సముద్రంలో ఏర్పడిన గుంతల దృష్ట్యా పర్యాటకులను తీరానికి రాకుండా అధికారులు నిషేధించారు. 18 రోజుల తర్వాత ఎట్టకేలకు గట్టి బందోబస్తు, భద్రతల మధ్య తీరానికి అనుమతిచ్చారు. కార్తిక మాసంలో భక్తులు పుణ్యస్నానాలు ఇన్ని రోజులుగా ఇక్కడ ఆచరించలేకపోయారు. అదేవిధంగా ఈ ఏడాది కార్తిక పౌర్ణమి స్నానాలు కూడా లేకుండాపోయాయి. పోలీసు భద్రత, గజఈతగాళ్ల గస్తీ, హెచ్చరికల మధ్య జాగ్రత్తగా సముద్ర స్నానాలు ఆచరించే ఏర్పాట్లు చేశారు. పరిధి దాటి తీరంలోకి వెళ్తే.. చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. పోలీసులు సూర్యలంక తీరం వద్ద పర్యాటకులకు, సిబ్బందికి పలుసూచనలు చేశారు. ఆదివారం భక్తుల తాకిడికి అధికంగా ఉండే అవకాశం కనిపిస్తోంది. ఈ నెల 21వ తేదీతో కార్తిక మాసం ముగుస్తుంది. ఈ 12 రోజులు సూర్యలంకకు పర్యాటకుల తాకిడి అధికంగా ఉండే అవకాశం కనిపిస్తుంది. గతంలో ప్రతిపౌర్ణమికి రెండు లక్షలు మంది భక్తులు తీరానికి వచ్చేవారు. ఈ నెల 5న ఆంక్షల మధ్య పౌర్ణమి స్నానాలు లేకుండాపోయాయి. భక్తుల రద్దీ దృష్ట్యా ఇప్పటికే తీరంలో తాత్కాలిక మరుగుదొడ్లు, దుస్తులు మార్చుకునే గదులు, జల్లు స్నానం ఏర్పాట్లు వంటివి చేసి మండలపరిషత్, గ్రామ పంచాయతీ అధికారుల తోపాటు రూరల్ పోలీసులు, మెరైన్ పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేపట్టారు.


తీరంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక మరుగుదొడ్లు


గజఈతగాళ్లకు సూచనలు చేస్తున్న పోలీసు అధికారులు

నయా బ్రేస్‌లెట్ ట్రెండ్స్



ఆధునిక ఫ్యాషన్ దుస్తులకు అనుగుణంగా రకరకాల బ్రేస్‌లెట్స్ ట్రెండింగ్‌లోకి వచ్చేశాయి. చేతికి సింగిల్ బ్యాంగిల్ వేసుకోవడం కంటే చక్కని బ్రేస్‌లెట్ పెట్టుకోవడానికే యువతులు ఎక్కువగా ఇష్టపడుతున్నారు. సంప్రదాయ దుస్తుల మీద కూడా బ్రేస్‌లెట్స్‌నే ఎంపిక చేసుకుంటున్నారు. మధ్యవయసు మహిళలు సైతం ఈ నయా ట్రెండ్‌ను అనుసరించడం విశేషం.

నల్ల పూసలతో



కొత్తగా పెళ్లయిన యువతులు మెడలో వేసుకునే నల్లపూసల గొలుసును చేతికి బ్రేస్‌లెట్‌లా కూడా పెట్టుకుంటున్నారు. మహిళల ఇష్టాన్ని దృష్టిలో ఉంచుకుని డిజైనర్లు మల్టీపర్పస్ డిజైన్లను రూపొందిస్తున్నారు. బంగారం లేదా వెండితో తయారుచేసిన నల్ల పూసల బ్రేస్‌లెట్స్‌కు అదృష్ట రత్నం, తమ పేరు లేదా భర్త పేరులోని మొదటి అక్షరం, చిన్న చిన్న బుట్టలు, మువ్వలు, లవ్ సింబల్, నచ్చిన బొమ్మలను జతచేయించుకుని మురిసిపోతున్నారు అమ్మాయిలు. నల్లపూసలు కూర్చి రెండు, మూడు వరుసలతో తీర్చిదిద్దిన స్టయిలిష్ బ్రేస్‌లెట్స్ ప్రస్తుతం ట్రెండింగ్‌లో ఉన్నాయి.

సంప్రదాయికంగా



అన్ని ఆభరణాల్లాగే బ్రేస్‌లెట్‌కూ ప్రత్యేక ప్రాధాన్యమిస్తున్నారు నేటి మహిళలు. మెడలో ధరించిన హారం లేదా నెక్లెస్, చెవులకు పెట్టుకున్న జుంకాలు, వేళ్ల ఉంగరాలతో మ్యాచ్ అయ్యే డిజైన్లను ఎంపిక చేసుకుంటున్నారు. బంగారం, వెండి, ప్లాటినం, వజ్రాలు, కెంపులు, పచ్చలు, ముత్యాలు, బీడ్స్, క్రిస్టల్స్‌తో రూపొందించిన బ్రేస్‌లెట్స్‌ను యువతులు ఇష్టంగా కొనుగోలు చేస్తున్నారు. చిన్న ముత్యాలతో రూపొందించిన మల్టీ లేయర్ బ్రేస్‌లెట్స్‌కు ప్రస్తుతం డిమాండ్ అధికంగా ఉంది.

ఆధునికంగా



జీన్స్, టీ షర్ట్‌లు, స్కర్టుల మీద సూటయ్యేలా ఊలు దారాలతో తయారుచేసిన డిజైన్లకు కూడా అధికంగా ఆదరణ లభిస్తోంది. నాలుగైదు వరుసల్లో చేతికి నిండుదనాన్నిచ్చే సరికొత్త బ్రేస్‌లెట్స్... అన్ని వర్గాలవారినీ ఆకర్షిస్తున్నాయి. డ్రస్ స్టయిల్‌కు తగ్గట్టు.. దారాల అల్లికల మధ్య గవ్వలు, రంగురంగుల పూసలు, ఒకప్పటి నాణేలు, మెరిసే రాళ్లు కూర్చిన బ్రేస్‌లెట్స్‌ను ధరించడం ఫ్యాషన్‌గా మారింది. చిన్న పార్టీలు, వేడుకల్లో పూల డిజైన్లతో కూడిన కఫ్ బ్రేస్‌లెట్స్ ధరించి యువతులు, మధ్య వయసు మహిళలు సందడి చేస్తున్నారు.

ఆరోగ్యానికి కూడా



చేతి మణికట్టుకు పెట్టుకునే బ్రేస్‌లెట్ అందాన్నే కాదు ఆరోగ్యాన్ని కూడా అందిస్తుందని నిపుణులు చెబుతున్నారు. రాగి తీగలతో తయారుచేసిన బ్రేస్‌లెట్ పెట్టుకోవడం వల్ల కీళ్ల నొప్పులు తగ్గుతాయి. శరీరంలో రక్త ప్రసరణ తీరు మెరుగుపడుతుంది. వెండి బ్రేస్‌లెట్ పెట్టుకుంటే మానసిక ఆందోళన తగ్గుతుంది. ఏకాగ్రత పెరుగుతుంది. బంగారు బ్రేస్‌లెట్ పెట్టుకుంటే శరీర ఉష్ణోగ్రత నియంత్రణలో ఉంటుంది. ఒత్తిడి తగ్గుతుంది. చేతికి ఎలాంటి బ్రేస్‌లెట్ పెట్టుకున్నా ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ఆక్యుప్రెషర్ పాయింట్లు ఉత్తేజితమై గుండె ఆరోగ్యాన్ని కాపాడతాయి.

మొక్కలు ఎండిపోతున్నాయా?

మనం కుండీల్లో రకరకాల మొక్కలు పెంచుతూ ఉంటాం. వాటికి రెండుపూటలా నీళ్లు పోస్తూ సమయానుసారం ఎరువులు అందిస్తూ ఎండ తగిలేలా చూసుకుంటూ ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటూ ఉంటాం. అయినా కూడా మొక్కలు ఎండిపోతూ ఉంటాయి. అలాకాకుండా మొక్కలను ఎలా సంరక్షించుకోవాలో తెలుసుకుందాం...

- చాలామంది.. మొక్కలు బాగా ఎదగాలనే భావనతో కుండీల నిండుగా నీళ్లు పోస్తూ ఉంటారు. దీంతో మట్టి పూర్తిగా నీటితో నిండి గాలి ప్రసరణను అడ్డుకుంటుంది. వేర్లకు తగినంత ఆక్సిజన్ అందకపోవడంతో క్రమంగా మొక్కలు ఎండిపోతుంటాయి. కుండీల్లో మట్టి పొడిగా ఉన్నప్పుడు మాత్రమే కొద్దికొద్దిగా నీటిని చిలకరించడం మంచిది. కుండీల అడుగుభాగంలో తప్పనిసరిగా రంధ్రాలు చేయాలి. అప్పుడే కుండీల్లో నీరు నిల్వ ఉండకుండా బయటికి వెళుతుంది. మొక్కలు పచ్చగా ఎదుగుతాయి.
- కొన్ని రకాల మొక్కలు పెరగడానికి ఎండ కావాలి. మరికొన్ని మాత్రం నీడలోనే ఎదుగుతాయి. ముందుగా మొక్కల తత్వాన్ని తెలుసుకుని కుండీలను ఎక్కడ ఉంచాలో నిర్ణయించాలి. మనీ ప్లాంట్, స్నేక్ ప్లాంట్ లాంటివి నీడలోనే చక్కగా పెరుగుతాయి.



వాటికి ఎండ తగిలితే వెంటనే ఆకులు ఎండిపోతాయి. సక్యులెంట్స్, మందారం, ఆర్కిడ్స్ లాంటి మొక్కల కుండీలను రోజూ కాసేపు ఎండలో ఉంచాలి. మొక్కలు ఎండిపోతున్నట్లు కనిపించగానే కుండీలను స్థలం మార్చడం మంచిది.

- కొన్ని మొక్కలు వేగంగా పెరుగుతుంటాయి. వాటికి తగ్గట్టు కుండీలు పెద్దగా లేని పక్షంలో కావాల్సినన్ని పోషకాలు అందక, పెరిగే వేర్లకు స్థలం సరిపోక మొక్కలు ఎండిపోతాయి. మొక్కలు సరిగా ఎదగడంలేదని గమనించిన వెంటనే వాటిని పెద్ద కుండీల్లోకి మార్చాలి.
- మొక్కల పెరుగుదలకు ఎరువులు తప్పనిసరి. రసాయనాలతో కూడిన ఎరువులు కాకుండా కంపోస్టు, ఆవుపేడ, పండ్ల తొక్కలు, వంటింటి వ్యర్థాలను మట్టిలో చేరుస్తూ ఉంటే మొక్కలు ఎండిపోకుండా పచ్చగా ఎదుగుతాయి.

ప్రేక్షకులకు నచ్చితేనే భవిష్యత్తు



'భీమ్లానాయక్' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన సంయుక్తా మేనన్... 'బింబిసార', 'విరూపాక్ష' తదితర చిత్రాలతో విలక్షణ నటిగా గుర్తింపు పొందారు. 'అఖండ తాండవం' లాంటి తెలుగు సినిమాలతో పాటు ఇతర భాషా చిత్రాలతోనూ బిజీగా ఉన్న ఆమె... తన గురించి, తన కెరీర్ గురించి 'నవ్య'తో ప్రత్యేకంగా మాట్లాడారు.

మీరిప్పుడు ఎలాంటి పాత్రల్లో నటిస్తున్నారు?

నేను పోషిస్తున్న పాత్రలన్నీ వేటికవే ప్రత్యేకమైనవి. 'బ్లాక్ గోల్డ్' సినిమాలో పోలీస్ ఆఫీసర్ పాత్ర పోషించాను. ప్రస్తుతం పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమాలో నా పాత్ర పూర్తి భిన్నంగా ఉంటుంది. అలాగే 'అఖండ తాండవం'లో కూడా నా పాత్ర వినూత్నంగా ఉండబోతోంది. ఇన్ని వైవిధ్యమైన పాత్రల్లో ఇమిడిపోగలుగుతానని నేను కూడా అనుకోలేదు. కానీ ప్రతి పాత్రనూ ఆస్వాదిస్తాను. ఒక పాటలో భాగంగా చక్కని డాన్స్‌ను ప్రదర్శించవలసి వచ్చినా, సన్నివేశంలో భాగంగా భావోద్వేగాలను ప్రదర్శించవలసి వచ్చినా... పూర్తి ప్రతిభను కనబరచడానికి శాయశక్తులా ప్రయత్నిస్తాను.

ఇన్ని భిన్నమైన పాత్రల్లో నటించడం, వరుస షూటింగ్‌లు.. ఇదంతా మీకు కష్టంగా ఉంటుందా?

లేదు. నేనెప్పుడూ అలా అనుకోను. చేస్తున్న పనిని ప్రేమించడం నా నైజం. మక్కువ కలిగిన పని చేసేటప్పుడు ప్రతి క్షణం ఆనందాన్ని అనుభవిస్తాం. ఆ పని శ్రమలా తోచదు. ఒక్కో రోజు షూటింగ్‌తో ఒంట్లో ఉన్న శక్తినంతా ఖర్చు చేయాల్సిన అవసరం ఉందనిపిస్తుంది. కానీ షూటింగ్ ముగించుకుని, సాయంత్రం జిమ్‌లో వ్యాయామం చేసి, ఇంటికి వచ్చి, గంట సేపు పెంపుడు కుక్కలతో ఆడుకున్న తర్వాత కూడా... అలసిపోయిన భావన కలగదు.

మీరు ఎక్కడికి వెళ్లినా... పెంపుడు కుక్కలను కూడా వెంటబెట్టుకు వెళ్తూ ఉంటారా?

నాకు మూడు పెంపుడు కుక్కలున్నాయి. నోవా, ఆర్య, రుద్ర వాటి పేర్లు. మూడు భిన్నమైన కుక్కలే! మూడిటిలో రుద్ర పెద్దది. 45 కిలోల బరువు ఉండే రుద్ర... నా మీదకు దూకేసి ఆటలాడే ప్రయత్నం చేస్తూ ఉంటుంది. మేము మా పెంపుడు కుక్కలను కూడా కుటుంబ సభ్యుల్లాగే పరిగణిస్తాం.

సినీనటిగా, కథానాయికగా ఎదుగుతానని చిన్నప్పుడు అనుకున్నారా?

లేదు. ఎప్పుడూ అనుకోలేదు. నాకసలు అలాంటి ఆలోచనే ఉండేది కాదు. ఇదంతా విధి ఫలితమే! నేను కేరళలోని ఒక అందమైన గ్రామంలో పుట్టాను. ఆ గ్రామం కేరళ, తమిళనాడు సరిహద్దులో ఉంది. అంత మారుమూల గ్రామం నుంచి సినీ రంగంలోకి ప్రవేశించే మార్గమే లేనప్పుడు, దాని గురించి ఆలోచించే అవకాశం కూడా ఉండదు కదా? కాబట్టి బాగా చదువుకొని, డాక్టరు కావాలని కోరుకునేదాన్ని. ప్రపంచమంతా చుట్టి రావాలని అనుకునేదాన్ని. బడిలో చదువుకునే రోజుల్లో సాంస్కృతిక కార్యక్రమాల్లో ఎక్కువగా పాల్గొనేదాన్ని. పుస్తకాలు ఎక్కువగా చదివేదాన్ని. చిన్మయ స్కూల్‌లో చదివే రోజుల్లో వేదాలతో పరిచయం ఏర్పడింది. నేను పెద్దయ్యాక నటిని అవుతానని నా కుటుంబం, స్నేహితులు, బంధువులు ఎవరూ ఊహించలేదు.

> **ఖాళీ సమయాల్లో ఏం చేస్తారు?**
>
> నేను పుస్తకాలు ఎక్కువగా చదువుతాను. షూటింగ్‌లో ఖాళీ ఉంటే.. 'కిండిల్'లో పుస్తకాలు చదువుతాను. ఖాళీ సమయాల్లోనే కాదు, సంతోషంగా ఉన్నా, విచారంగా ఉన్నా, ప్రయాణం చేయవలసివచ్చినా పుస్తకాలనే ఎంచుకుంటాను.
>
> 

సినిమాల్లోకి ఎలా ప్రవేశించారు?

యాదృచ్ఛికంగా జరిగింది. ఇంటర్ పూర్తయ్యాక కాలేజీలో చేరాలని అనుకుంటూ ఉండేదాన్ని. మా గ్రామ ప్రజలు కొన్ని వార్షిక సంచికలు ముద్రించేవారు. గ్రామీణుల కథలు, అనుభవాలు వాటిలో ప్రచురితమవుతూ ఉండేవి. ఒక సందర్భంలో ఆ సంచిక ముఖ చిత్రం కోసం వాళ్లు నన్ను సంప్రతించారు. నా ఫొటో ఆ సంచిక ముఖ చిత్రంగా అచ్చయింది. అలాగే నేను సందర్శించే ఒక బ్యూటీ పార్లర్... పాలక్కాడ్‌లో బ్యుటీషియన్స్ కోసం ఒక మేకప్ సెమినార్‌ను నిర్వహించింది. ఆ సెమినార్‌కు ఒక సెలబ్రిటీ మేకప్ ఆర్టిస్ట్ ఆధ్వర్యం వహించింది. ఆ ఆర్టిస్ట్‌కు మోడల్‌గా వ్యవహరించవలసిన అమ్మాయి సమయానికి సెమినార్‌కు చేరుకోలేకపోయింది. దాంతో మా అమ్మ బలవంతం మీద... నేను మోడల్‌గా వ్యవహరించవలసి వచ్చింది. అప్పుడు నన్ను పోర్ట్‌ఫోలియో తయారుచేసుకోవాలనీ, మోడలింగ్ అవకాశాల కోసం ప్రయత్నించాలనీ ఆ మేకప్ ఆర్టిస్ట్ సలహా ఇచ్చింది. ప్రొఫెషనల్ మేకప్‌లో నేను భిన్నంగా కనిపిస్తున్నట్టు మొదటిసారిగా గ్రహించాను. ఆ తర్వాత ఆ మేకప్ ఆర్టిస్ట్, నేనూ ఫేస్‌బుక్ ఫ్రెండ్స్‌గా మారిపోయాం. 'వనిత' అనే మ్యాగజైన్‌కు ఫొటోగ్రాఫర్‌గా వ్యవహరించే ఒక వ్యక్తి... ఓనమ్ పండుగ కోసం నన్ను ఫొటోషూట్ చేస్తానని అడిగారు. ఆ ఫొటోలు పబ్లిష్ అయిన తర్వాత, నాకు సినిమా అవకాశాలు రావడం మొదలుపెట్టాయి. అప్పటివరకూ నాకు సినీ వాతావరణం గురించి ఏమాత్రం తెలీదు. షూటింగ్‌లు ఎలా జరుగుతాయో, లొకేషన్లు ఎలా ఉంటాయో కూడా తెలీదు. అయితే రెండో సినిమా తరువాత... ఈ రంగంతో ప్రేమలో పడిపోయాను. అనంతరం గొప్ప దర్శకుల దర్శకత్వంలో రూపొందిన అంతర్జాతీయ సినిమాలు చూశాను. గొప్ప నటుల ప్రతిభను అర్థం చేసుకోవడానికి, నటిగా నన్ను నేను ఆవిష్కరించుకోవడానికి ప్రయత్నించాను. అయితే నాలోని నటిని వెలికి తీయడానికి తగిన దర్శకుడు, తగిన కథ, తగిన సహనటులు అవసరమనే విషయాన్ని కూడా గ్రహించాను. అలా అంశాలన్నీ అనుకూలించినప్పుడు, కచ్చితంగా నటనా ప్రతిభను చాటుకోవచ్చని నేను నమ్ముతాను. 'విరూపాక్ష' సినిమా విషయంలో అదే జరిగింది.

సున్నితమైన నటన, సాంస్కృతిక మూలాలు, ప్రాంతీయతలను ప్రతిబింబించే కథాంశాలు మలయాళ సినిమాకు ఆయువుపట్లు. కానీ ఇక్కడ వినోదమే ప్రధానం. ఈ రెండు ప్రపంచాలకు సమన్వాయం ఎలా చేస్తున్నారు?

భారతదేశంలో ఒక నటిగా సినిమా పరిశ్రమను అన్వేషించేటప్పుడు... భిన్నమైన రాష్ట్రాలకు చెందిన భిన్నమైన సినీ పరిశ్రమల లోతుపాతులను అన్వేషించాలి. వాటిని యథాతథంగా స్వీకరించాలి. భిన్న రాష్ట్రాల ప్రేక్షకుల ఇష్టాయిష్టాలు కూడా భిన్నంగానే ఉంటాయి. భారతీయ సినీ పరిశ్రమ ఒకటే అయినప్పటికీ ప్రేక్షకులు భిన్నంగా ఉంటారు. అలాగని సినిమా కమర్షియల్ అయినంత మాత్రాన దానికి తగ్గట్టు మన నటనను మార్చుకోవలసిన అవసరం లేదని భావిస్తాను. అయితే ఒక పాత్ర నాకు తగినది కాదని అనిపించినప్పుడు... దాన్ని అంగీకరించడానికి వెనకాడతాను. అలా వద్దనుకున్న పాత్రలు కూడా ఉన్నాయి. నేను తెలుగు సినీ రంగంలోకి అడుగు పెట్టిన ఈ రెండేళ్ల కాలంలో తెలుగు ప్రేక్షకులు చక్కని నటనను, కథను చూడాలనుకుంటున్న విషయాన్ని గ్రహించాను. ప్రేక్షకులకు నచ్చినప్పుడే నటులకు భవిష్యత్తు ఉంటుంది. కాబట్టి వాళ్లకు నచ్చినది అందించగలగాలి.

మీరు తెలుగు ఎలా నేర్చుకున్నారు?

నటనా ప్రతిభ కనబరచాలంటే మొదట భాష తెలుసుకోవాలి. నా సహనటులు చెప్తున్న డైలాగ్స్ నాకు అర్థమైనప్పుడే... నేను మెరుగైన ప్రతిభ కనబరచగలుగుతాను. 'విరూపాక్ష' సినిమా రూపొందే సమయంలో కొవిడ్ వల్ల ఒక నెల ఖాళీ సమయం చిక్కింది. ఆ సమయంలో 'జూమ్' ద్వారా నేను తెలుగు భాష నేర్చుకున్నాను. మొదట్లో రెండు వాక్యాలతో మొదలుపెట్టాను. మొదట్లో తప్పులు మాట్లాడేదాన్ని. అయినా సిగ్గు పడకుండా మాట్లాడుతూనే తెలుగు భాష మీద పట్టు పెంచుకున్నాను. నేనిప్పుడు కొన్ని మాండలికాలను కూడా అనుకరించగలుగుతున్నాను.

మీ ఎమోషనల్ సపోర్ట్ ఎవరు?

నా కుటుంబానికి నేనే ఎమోషనల్ సపోర్ట్. నా ఎమోషనల్ సపోర్ట్... శివుడు. శైవ కాశ్మీర్ స్కూల్‌లో కాశ్మీర్ శైవిజం గురించి నేర్చుకున్నాను.

మీరు చేయబోతున్న తెలుగు ప్రాజెక్టులు?

'స్వయంభూ', 'అఖండ తాండవం' రిలీజ్ కాబోతున్నాయి. పూరీ జగన్నాథ్ గారి సినిమా ఎంతో ఆసక్తికరంగా ఉండబోతోంది. ఈ సినిమాలన్నీ విజయం సాధించాలని కోరుకుంటున్నా! ఫిమేల్ సెంట్రిక్ మూవీ 'బ్లాక్ గోల్డ్' కూడా విడుదల కాబోతోంది. బెల్లంకొండ శ్రీనివాస్‌తో కలిసి ఒక సినిమాలో నటిస్తున్నాను. తమిళంలో కూడా ఒక సినిమాలో నటిస్తున్నాను.

• సీవీఎల్ఎన్ ప్రసాద్

సంకల్పం

ఈ వారసులు... తెరవెనుకే!

ఒకప్పుడు సినీ తారల వారసులు ఎక్కువ శాతం నటన వైపే మొగ్గు చూపేవారు. కానీ ఇప్పుడు ఆ ట్రెండ్ మారుతోంది. కొందరు సినీ ప్రముఖుల వారసులు నటనతో పాటు మిగిలిన రంగాలలో కూడా తమ ప్రతిభను చాటడానికి ఆసక్తి చూపుతున్నారు. దర్శకత్వం, రచన, సంగీతం, వీడియో ఎడిటింగ్ తదితర రంగాల్లో తమదైన ముద్ర వేయడానికి ముందడుగు వేస్తున్నారు.

వంద సంవత్సరాల భారతీయ సినీ చరిత్రను ఒకసారి పరిశీలిస్తే నటీనటుల దర్శకనిర్మాతల వారసులు నటులుగానే వెండితెరకు ఎంట్రీ ఇచ్చిన సందర్భాలు కనిపిస్తాయి. ఆ బాటలో వచ్చి సక్సెస్ అయిన వారి సంఖ్య కూడా ఎక్కువే. కానీ కొత్త తరం వారసుల దృష్టి ఇప్పుడు నటన మీద కంటే మిగిలిన శాఖల మీదే ఎక్కువగా ఉందని చెప్పాలి. ఇలా తెర వెనుకే ఉండి తమ ప్రతిభను చాటడానికి ప్రయత్నిస్తున్న కొందరి వారసుల వివరాలు ఇప్పుడు పరిశీలిద్దాం.



సంగీతంతో పాటు ఎడిటింగ్

ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తనయుడు అకీరా నందన్ తమ ఆరాధ్యదైవం పవర్‌స్టార్‌లాగే హీరో అవుతాడని ఆశించారు మెగా అభిమానులు. అయితే అందుకు భిన్నంగా అతని అడుగులు సాగుతున్నాయి. పవన్‌కల్యాణ్ హీరోగా సుజీత్ తెరకెక్కించిన చిత్రం 'ఓజీ' ఇటీవల విడుదలైన సంగతి తెలిసిందే. ఈ చిత్రానికి సంగీత దర్శకత్వం వహించిన థమన్‌తో కలసి నేపథ్య సంగీతం కోసం వర్క్ చేశాడు అకీరా. ఈ చిత్రంతో పాటూ 'రైటర్స్ బ్లాక్' అనే లఘు చిత్రానికి సంగీతం అందించాడు. కేవలం సంగీతంతోనే సరిపెట్టుకోకుండా వీడియో ఎడిటింగ్‌పైనా దృష్టి పెడుతున్నాడు అకీరా. తన తండ్రి పవన్‌కల్యాణ్ నటించిన సినిమాల్లోని సన్నివేశాలను ఆసక్తికరంగా ఎడిట్ చేసి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేస్తుంటాడు. అకీరా వీడియో ఎడిటింగ్ నైపుణ్యాన్ని మెచ్చుకుంటూ సోషల్‌మీడియా ద్వారా షేర్ చేస్తుంటారు అతని తల్లి రేణూ దేశాయ్.

మెగాఫోన్ పట్టడమే లక్ష్యం

తన నటనతో మాస్ మహారాజాగా అభిమానుల నుంచి పేరు తెచ్చుకున్న రవితేజ తనయుడు మహాధన్ భూపతి రాజు లక్ష్యం కూడా మెగాఫోన్ పట్టడమే. ఈ క్రమంలోనే ప్రభాస్ కథానాయకుడిగా సందీప్ రెడ్డి తెరకెక్కించనున్న 'స్పిరిట్'లో సహాయ దర్శకుడిగా చేరాడు 'అర్జున్ రెడ్డి' 'యానిమల్' వంటి చిత్రాలతో తనకంటూ ఓ ప్రత్యేక పంథా ఏర్పరచుకున్న దర్శకుడు సందీప్ రెడ్డి వంగా దగ్గర దర్శకత్వంలో మెలకువలు నేర్చుకుని ఓ స్టార్ దర్శకుడిగా ఎదగాలని అతని ప్రయత్నం.



రెండు పడవలపై ప్రయాణం



తమిళ కథానాయకుడు విజయ్ తనయుడు జేసన్ సంజయ్ తెరవెనుక కథలను అందంగా చెప్పే దర్శకత్వాన్నే తన రూట్‌గా మార్చుకున్నాడు. సందీప్ కిషన్ కథానాయకుడిగా జేసన్ ఇప్పుడు ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాడు. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ చిత్రం వర్కింగ్ టైటిల్ 'జేఎస్ 01'. అలాగే తన తండ్రి నటించిన 'గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్' సినిమాలో ఓ చిన్న పాత్రలో మెరిశాడు. 'పుల్ ద ట్రిగ్గర్' అనే లఘు చిత్రంతో నటుడిగానూ సత్తా చాటాడు. అయితే తన కెరీర్ ముందుకు సాగే కొద్దీ జేసన్ నటనా, దర్శకత్వం రెండూ కొనసాగిస్తాడా లేదా కేవలం ఒకదానికే పరిమితమవుతాడా అనేది ఆసక్తికరం.



తండ్రితోనే చిత్రం!

బాలీవుడ్ స్టార్ షారుక్ ఖాన్ తనయుడు చూడ్డానికి సినిమా హీరోలా ఉండడంతో కింగ్‌ఖాన్ అభిమానులు కూడా అతను తన తండ్రిలాగే హీరో అవుతారని భావించారు. కానీ అందర్నీ ఆశ్చర్యపరుస్తూ 'బ్యాడ్స్ ఆఫ్ బాలీవుడ్' అనే నెట్‌ఫ్లిక్స్ సిరీస్‌తో ఆర్యన్ దర్శకుడిగా మారిపోయాడు. తన మేకింగ్ స్టైల్‌తో విమర్శకుల్నీ, ప్రేక్షకుల్నీ ఆకట్టుకున్నాడు. ఇప్పుడు ఆర్యన్ తన తదుపరి చిత్రాన్ని థియేట్రికల్‌గా గ్రాండ్‌గా ప్లాన్ చేస్తుండడం విశేషం. దర్శకుడిగా తనకంటూ ఓ మంచి గుర్తింపు వచ్చిన తర్వాత తన తండ్రి షారుక్ ఖాన్‌తో ఓ చిత్రం చేయాలనే ఆలోచనల్లో ఉన్నాడీ యంగ్ సెన్సేషన్. అలాగే, షారుక్ నటించిన 'కభీ ఖుషీ కభీ గమ్' సినిమాలో బాల నటుడిగా సత్తా చాటడంతో పాటు 'ఇంక్రెడిబుల్స్', 'ద లయన్ కింగ్' లాంటి హాలీవుడ్ యానిమేషన్ చిత్రాలకు తన గొంతునూ అందించాడు ఆర్యన్. ఇలా కేవలం స్టార్ హీరోల వారసులే కాదు, ప్రముఖ దర్శకనిర్మాతల తనయులు కూడా దర్శకత్వం వైపు మొగ్గు చూపిస్తున్నారు. దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ తనయుడు రిషి మనోజ్ కూడా 'స్పిరిట్' చిత్రానికి గాను సందీప్ రెడ్డి వంగా దగ్గర అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేరాడు. అలాగే, ఓ లఘు చిత్రంలో హీరోగానూ నటించాడు. నిర్మాత శోభు యార్లగడ్డ తనయుడు కార్తీక్ యార్లగడ్డ ప్రస్తుతం లఘు చిత్రాలు చేసి... ఫీచర్ ఫిల్మ్ డైరెక్టర్ కావాలని అడుగులేస్తున్నాడు.





ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
మెరైన్స్	వెబ్‌సిరీస్	నవంబర్ 10
ఢిల్లీ క్రైమ్ 3	హిందీ సిరీస్	నవంబర్ 13
అమెజాన్ ప్రైమ్		
ప్లే డేట్	ఒరిజినల్ మూవీ	నవంబర్ 12
జియో హాట్‌స్టార్		
జాలీ ఎల్ఎల్‌బీ 3	హిందీ చిత్రం	నవంబర్ 14
జీ 5		
ఇన్‌స్పెక్షన్ బంగ్లా	మలయాళ సిరీస్	నవంబర్ 14
మనోరమా మ్యాక్స్		
కప్లింగ్	మలయాళ చిత్రం	నవంబర్ 14



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,22,000 ▼	1,11,800 ▼	1,64,000 ▼
విజయవాడ	1,24,000 ▼	1,16,000 ▼	1,51,700 ▼
విశాఖపట్నం	1,21,910 ▼	1,11,750 ▲	1,65,000 ▲
రాజమండ్రి	1,22,020 ▲	1,11,850 ▲	1,49,000 ▲
ప్రొద్దుటూరు	1,21,450 ▲	1,11,730 ▲	1,51,600 ▼
ముంబై	1,20,100 ▼	1,10,012 ▼	1,48,275 ▲

బ్యాంకు ఖాతాలో సొమ్ము మరిచిపోయారా..!

రీక్లెయిమ్ చేసుకోండి ఇలా..

మనలో చాలా మందికి బ్యాంకుల్లో పొదుపు ఖాతా (ఎస్‌బీ), కరెంట్ ఖాతాలు లేదా టర్మ్ డిపాజిట్లు ఉంటాయి. కొంతమంది తమ ఖాతాలను రెగ్యులర్‌గా నిర్వహిస్తుంటారు. మరికొంత మంది వాటిని సరిగా నిర్వహించరు.. లేదంటే ఏదో ఒక కారణంతో మర్చిపోతారు. ఒక్కోసారి ఖాతాదారుడు లేదా డిపాజిటర్ చనిపోతే వారి వారసులకు వాటి వివరాలు తెలియకపోవచ్చు. ఇలాంటి సందర్భాల్లోనూ మరుగున పడిన ఈ ఖాతాలు, డిపాజిట్లలోని డబ్బులు తిరిగి క్లెయిమ్ చేసుకోవచ్చు. అదెలాగో తెలుసుకుందాం.



బ్యాంకుల్లో క్లెయిమ్ చేయని డిపాజిట్లు ఏటేటా పెరిగిపోతున్నాయి. ఈ ఏడాది జూన్ నాటికి ఈ మొత్తం రూ.67,000 కోట్లకు చేరింది. దీంతో ఈ మొత్తాన్ని వాటి అసలు ఖాతాదారులు లేదా వారి వారసులకు అప్పగించేందుకు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) చర్యలు చేపట్టింది. ఇందుకోసం అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్స్-గేట్‌వే టు యాక్సెస్ ఇన్ఫర్మేషన్ (ఉద్గమ్) పేరుతో ఒక ప్రత్యేక పోర్టల్ ఏర్పాటు చేసింది. ఈ పోర్టల్ ద్వారా బ్యాంక్ ఎస్‌బీ/కరెంట్ అకౌంట్ ఖాతాదారులు లేదా టర్మ్ డిపాజిటర్లు లేదా వారి వారసులు ఆ ఖాతాల్లోని మొత్తాలను తిరిగి క్లెయిమ్ చేసుకోవచ్చు.

పదేళ్ల పాటు నిర్వహణలో లేకపోతేనే..

బ్యాంకుల్లోని ఏదైనా ఒక ఎస్‌బీ/కరెంట్ ఖాతాను పదేళ్ల పాటు ఆపరేట్ చేయకపోతే బ్యాంకులు దాన్ని ఇన్ ఆపరేటివ్ ఖాతాగా పరిగణించి ఆ ఖాతాలోని మొత్తాన్ని ఆర్‌బీఐ నిర్వహించే డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ (డీఈఏ) ఫండ్‌కు బదిలీ చేస్తాయి. గడువు దాటిన పదేళ్లలోపు వెనక్కి తీసుకోని టర్మ్ డిపాజిట్లను కూడా అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లుగా పరిగణించి డీఈఏ ఫండ్‌కు మళ్లిస్తారు. udgam.rbi.org.in పోర్టల్‌లో లాగిన్ అయి అవసరమైన వివరాలు సమర్పించడం ద్వారా ఆ ఖాతాల్లోని బ్యాలెన్స్ లేదా డిపాజిట్ల మొత్తాన్ని ఖాతాదారులు లేదా వారి వారసులు పొందవచ్చు.

డీఈఏ ఫండ్‌ నుంచి క్లెయిమ్ చేసుకోవచ్చా?

మర్చిపోయిన లేదా క్లెయిమ్ చేయని ఎస్‌బీ/కరెంట్ ఖాతాల్లోని సొమ్మును లేదా ఫిక్స్‌డ్ లేదా టర్మ్ డిపాజిట్లను ఖాతాదారులు లేదా వారి వారసులు ఉద్గమ్ పోర్టల్‌లో లాగిన్ అయి అవసరమైన వివరాలు సమర్పించడం ద్వారా ఆయా బ్యాంకుల నుంచే క్లెయిమ్ చేసుకోవచ్చు. ఇందుకు ఎలాంటి కాలపరిమితి లేదు. బ్యాంకులు ఈ సొమ్మును డీఈఏ నుంచి రీక్లెయిమ్ చేసుకుంటాయి.

డీఈఏ ఫండ్‌కు చేరే ఖాతాల సొమ్ము

పదేళ్లుగా ఆపరేట్ చేయని లేదా గడువు ముగిసి పదేళ్లయినా క్లెయిమ్ చేయని ఈ కింది ఖాతాల్లోని సొమ్ము డీఈఏ ఫండ్‌కు చేరుతాయి. వాణిజ్య, సహకార బ్యాంకుల్లోని ఖాతాలకూ ఈ నిబంధన వర్తిస్తుంది. ఆ ఖాతాలు ఏమిటంటే..

- సేవింగ్స్ బ్యాంక్ డిపాజిట్ ఖాతాలు
- ఫిక్స్‌డ్ లేదా టర్మ్ డిపాజిట్ ఖాతాలు
- క్యుములేటివ్/ రికరింగ్ డిపాజిట్ ఖాతాలు
- కరెంట్ డిపాజిట్ ఖాతాలు
- క్యాష్ క్రెడిట్ ఖాతాలు
- ఏదో ఒక పేరుతో లేదా ఏదో ఒక రూపంలో ఉన్న ఇతర డిపాజిట్ ఖాతాలు
- కేటాయింపుల తర్వాత రుణ ఖాతాల్లోని మిగులు
- లెటర్ ఆఫ్ క్రెడిట్/గ్యారెంటీలతో పాటు ఇతర సెక్యూరిటీ డిపాజిట్లపై జారీ చేసే మార్జిన్ మనీ

ఉద్గమ్ పోర్టల్ పాత్ర

ఈ విషయంలో ఉద్గమ్ పోర్టల్‌ది కేవలం వెసులుబాటు పాత్ర మాత్రమే. ఖాతాదారులకు రావాల్సిన మొత్తాన్ని సంబంధిత బ్యాంక్ చెల్లిస్తుంది. ప్రస్తుతం ఉద్గమ్ పోర్టల్‌లో దేశంలోని 30 బ్యాంకులు సభ్యత్వం కలిగి ఉన్నాయి. కాకపోతే ఈ పోర్టల్ ద్వారా తమ సొమ్మును రీక్లెయిమ్ చేసుకోవాలంటే బ్యాంకు ఖాతాదారులు, డిపాజిటర్లు తమ పేరు, మొబైల్ నంబర్‌తో ముందుగా రిజిస్టర్ చేసుకోవాలి.

ఖాతాను గుర్తించడం ఎలా..?

వ్యక్తిగత ఖాతాదారులైతే ఉద్గమ్ పోర్టల్‌లో తమ పేరు, ఖాతా లేదా డిపాజిట్ ఉన్న బ్యాంకు పేరు ఎంటర్ చేయాలి. వీటికి తోడు ఓటర్, పాన్‌కార్డు నంబర్, డ్రైవింగ్ లైసెన్సు, పాస్‌పోర్టు నంబర్ లేదా ఖాతాదారుని పుట్టిన తేదీ సర్టిఫికెట్.. వీటిలో ఏదో ఒకటి సమర్పించాలి. అదే నాన్ ఇండివిడ్యువల్ ఖాతాలైతే ఆ సంస్థ పేరు, ఖాతా ఉన్న బ్యాంకు పేరుతో పాటు సంస్థ అధీకృత అధికారి సంతకం, పాన్ నంబరు, కంపెనీ గుర్తింపు నంబర్ (సీఐఎన్), కంపెనీని నమోదు చేసిన తేదీ.. వీటిల్లో ఏదో ఒకదాని వివరాలు ఎంటర్ చేయాలి. ఒకవేళ పై వివరాలేవీ లేకపోయినా ఉద్గమ్ పోర్టల్‌లో వ్యక్తిగత, సంస్థాగత ఖాతాదారులు తమ చిరునామా ఎంటర్ చేయడం ద్వారా తమ డిపాజిట్లను క్లెయిమ్ చేసుకోవచ్చు.

ఇతర మార్గాలూ ఉన్నాయి..

ఒకవేళ ఉద్గమ్ పోర్టల్ ద్వారా మర్చిపోయిన ఖాతాలు లేదా డిపాజిట్లు క్లెయిమ్ చేసుకోవడం కష్టమనిపిస్తే.. ఖాతా లేదా డిపాజిట్ ఉన్న బ్యాంకుకు చెందిన ఏదైనా బ్రాంచ్‌కు వెళ్లి ఆధార్, పాస్‌పోర్టు, ఓటర్ ఐడీ కార్డు, డ్రైవింగ్ లైసెన్సు వంటి వివరాలు సమర్పించవచ్చు. బ్యాంకు ఈ వివరాలను నిర్ధారించుకున్న తర్వాత మీ సొమ్మును వడ్డీతో సహా చెల్లిస్తుంది. udgam.rbi.org.in పోర్టల్‌లో లాగిన్ కావడం ద్వారా మీ ఖాతాలో ఎంత మొత్తం ఉన్నదీ తెలుసుకోవచ్చు.

ప్రత్యేక క్యాంపులు

ఎస్‌బీ/కరెంట్ ఖాతాల్లోని అన్‌క్లెయిమ్డ్ మొత్తాలను, ఫిక్స్‌డ్ లేదా టర్మ్ డిపాజిట్లను ఖాతాదారులకు అందించేందుకు ఆర్‌బీఐ ఈ ఏడాది అక్టోబరు నుంచి డిసెంబరు వరకు ప్రతి జిల్లాలో ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తోంది. ఈ క్యాంపుల ద్వారానూ తమ సొమ్మును రీక్లెయిమ్ చేసుకోవచ్చు.

డిజిటల్ గోల్డ్‌కు రక్షణ లేదా..?

అనియంత్రిత ప్లాట్‌ఫామ్స్, సంస్థల ద్వారా పసిడిలో పెట్టుబడులపై ప్రజలను హెచ్చరించిన సెబీ

ముంబై: దేశంలో డిజిటల్ గోల్డ్, ఆన్‌లైన్ పసిడి పథకాల్లో పెట్టుబడులు ఊపందుకున్న నేపథ్యంలో అనియంత్రిత వేదికలు, సంస్థల ద్వారా కొనుగోళ్లపై క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ హెచ్చరించింది. “కొన్ని డిజిటల్/ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్స్ ఇన్వెస్టర్లకు పసిడి లోహం కొనుగోళ్లకు ప్రత్యామ్నాయంగా డిజిటల్ గోల్డ్ లేదా ఈ-గోల్డ్ సాధనాలను ఆఫర్ చేస్తున్నట్లు సెబీ దృష్టికి వచ్చింది. అయితే, వాటిలో పెట్టుబడులకు రక్షణ ఉండదని, సెక్యూరిటీస్ లేదా కమోడిటీ డెరివేటివ్స్‌గా గుర్తింపు లేనందున అవి సెక్యూరిటీస్ మార్కెట్ రక్షణ పరిధిలోకి రావని” శనివారం విడుదల చేసిన ప్రకటనలో సెబీ స్పష్టం చేసింది. ఈ-గోల్డ్ లేదా డిజిటల్ గోల్డ్ స్కీమ్‌లు సెక్యూరిటీస్ మార్కెట్ పరిధికి వెలుపల పనిచేస్తాయి గనుక వాటిల్లో పెట్టుబడులకు తమ రక్షణ ఉండదని తెలిపింది.

నియంత్రణ పథకాలకే సెబీ రక్షణ

పసిడిలో పెట్టుబడులు పెట్టేందుకు నియంత్రిత సంస్థల ద్వారా ఇప్పటికే పలు సాధనాలను అందుబాటులోకి తేవడం జరిగిందని సెబీ పేర్కొంది. ఎక్స్ఛేంజీలో ట్రేడయ్యే గోల్డ్ డెరివేటివ్ కాంట్రాక్టులు, మ్యూచువల్ ఫండ్లు ఆఫర్ చేసే గోల్డ్ ఎక్స్ఛేంజీ ట్రేడెడ్ ఫండ్లు (ఈటీఎఫ్), స్టాక్ ఎక్స్ఛేంజీల్లో ట్రేడయ్యే ఎలక్ట్రానిక్ గోల్డ్ రిసీట్స్ (ఈజీఆర్) ఇందుకు ఉదాహరణలు. సెబీ చట్టం పరిధిలోకి వచ్చే సంస్థలు ఆఫర్ చేసే బంగారం పథకాల్లో పెట్టుబడులు..మాత్రమే మా పర్యవేక్షణ,రక్షణ నియమావళి పరిధిలోకి వస్తాయని నియంత్రణ మండలి స్పష్టం చేసింది.

ఐటీసీ.. 90% నిబంధన!

జీఎస్‌టీలో ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ)ను తీసుకోవటానికి నిబంధనలు ఎలా ఉన్నాయో.. తీసుకున్న క్రెడిట్‌ను వాడుకోవటానికి కూడా అలాగే నిబంధనలు ఉన్నాయి. ఇందులో చాలా మంది పట్టించుకోని విషయం 99 శాతం నిబంధన. ఈ నిబంధన ఏమిటనేది ఒక ఉదాహరణ ద్వారా తెలుసుకుందాం.

నవీన్ చంద్ర పేరుమోసిన బట్టల వ్యాపారి. రాష్ట్రంలోని అన్ని ముఖ్య పట్టణాల్లో షోరూమ్స్ ఉన్నాయి. వ్యాపారం విషయంలో ఎంత నిక్కచ్చిగా ఉంటాడో, ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నుల విషయంలోనూ అంతే కచ్చితత్వం పాటిస్తాడు. కట్టాల్సిన పన్నులను బకాయిలు లేకుండా సకాలంలో చెల్లించాలని తన సిబ్బందికి చెబుతుంటాడు. అలాంటిది జీఎస్‌టీ డిపార్ట్‌మెంట్ నుంచి తనకు ఒక నోటీస్ అందింది. గడిచిన కొన్ని నెలల్లో తాను కట్టాల్సిన పన్ను మొత్తం అంటే 100 శాతం పన్నును ఐటీసీ ద్వారానే చెల్లించారనీ, జీఎస్‌టీ నిబంధనల ప్రకారం ఒక నెలలో టర్నోవర్ రూ.50 లక్షలు దాటితే చెల్లించాల్సిన పన్నులో 99 శాతం మాత్రమే ఐటీసీ ద్వారా చెల్లించి మిగతా మొత్తాన్ని నగదు రూపంలో అంటే క్యాష్ లెడ్జర్ ద్వారా చెల్లించాల్సి ఉండగా.. మొత్తం పన్నును ఐటీసీతో చెల్లించటం చట్ట ఉల్లంఘన కిందకు వస్తుందని, కాబట్టి ఆ తేడా మొత్తాన్ని వెంటనే చెల్లించాలని స్పష్టం చేసింది. తనకు చట్ట ప్రకారం అర్హత ఉన్న ఇన్‌పుట్స్ మీదనే క్రెడిట్ తీసుకున్నాడు. ఆ క్రెడిట్‌నే పన్ను చెల్లింపునకు ఉపయోగించాడు. పన్ను మొత్తాన్ని క్రెడిట్ ద్వారా చెల్లించకూడదా? అని సందేహం వచ్చింది.



ఇదీ GST
రాంబాబు గొండాల

రూ.50 లక్షల టర్నోవర్ దాటితేనే..

ఏదేనీ నెలలో టర్నోవర్ రూ.50 లక్షలు మించితేనే అప్పుడు ఈ 99 శాతం నిబంధన అమల్లోకి వస్తుంది. అంటే చెల్లించాల్సిన పన్నులో 99 శాతానికి మించి ఐటీసీ వాడకూడదు. దీని అర్థం మిగతా ఒక శాతం కచ్చితంగా నగదు చెల్లింపు ద్వారా అంటే క్యాష్ లెడ్జర్ ద్వారా చెల్లించాలి అని. మరి టర్నోవర్ అంటే ఏం తీసుకోవాలి? ఇందులో నెలలో జరిగిన మొత్తం సరఫరాల విలువ నుంచి పన్ను మినహాయింపు ఉన్న సరఫరాల విలువ, జీరో రేటెడ్ సరఫరాల విలువ మినహాయించాలి. (జీరో రేటెడ్ సరఫరా అంటే ఎగుమతులకు లేదా సెజ్‌లకు పంపిన సరఫరా). ఇలా మినహాయించగా మిగిలిన మొత్తాన్ని టర్నోవర్ కింద లెక్కించాలి. ఇలా లెక్కించిన టర్నోవర్ రూ.50 లక్షలు దాటితే ఈ రూల్ వర్తిస్తుంది. అలా అని రూ.50 లక్షల టర్నోవర్ దాటిన ప్రతి కేసులోనూ ఈ 99 శాతం నిబంధన అమలవుతుందని అనుకోకూడదు. దీనికి కొన్ని మినహాయింపులు ఉన్నాయి.

మినహాయింపులున్నాయ్..

గడచిన రెండు ఆర్థిక సంవత్సరాల్లోనూ రిజిస్ట్రేషన్ పొందిన సంస్థ లేదా వ్యక్తి రూ.లక్షకు మించి ఆదాయ పన్ను చెల్లించి ఉన్నా లేదా గడచిన ఆర్థిక సంవత్సరం సదరు సంస్థ లేదా వ్యక్తి రూ.లక్షకు మించి రిఫండ్ పొంది ఉన్నా (ఈ రిఫండ్ అనేది ట్యాక్స్ చెల్లించకుండా చేసే జీరో రేటెడ్ సరఫరాలకు లేదా ఇన్వర్టెడ్ ట్యాక్స్ స్ట్రక్చర్‌కు సంబంధించినవై ఉండాలి) లేదా ఇప్పటి వరకు అయిన టర్నోవర్ మీద ఇప్పటికే నగదులో ఒక శాతానికి మించి కట్టి ఉన్నా, ఇలాంటి సందర్భాల్లో ఈ రూల్ అమలు కాదు మిగతా అన్ని సందర్భాల్లోనూ ఎప్పుడైతే టర్నోవర్ రూ.50 లక్షలు దాటుతుందో అప్పుడు కనీసం ఒక శాతం పన్ను క్యాష్ లెడ్జర్ ద్వారా చెల్లించాలి.

కాబట్టి, జీఎస్‌టీ కింద రిజిస్ట్రేషన్ పొందిన వ్యక్తులు.. ఐటీసీ తీసుకోవటానికి గల నిబంధనలతో పాటు తీసుకున్న క్రెడిట్‌ను ఎలా వాడాలి? ఎంత మేరకు వాడాలి? ఇతరత్రా నియమ నిబంధనలు కూడా తెలుసుకోవాలి.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ లాభం రూ.49 కోట్లు

ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ లిమిటెడ్.. సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.49.43 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలం (రూ.47.65 కోట్లు)తో పోల్చితే లాభం స్వల్పంగా 4 శాతం వృద్ధి చెందింది. సమీక్షా త్రైమాసికంలో కంపెనీ మొత్తం ఆదాయం కూడా రూ.524 కోట్ల నుంచి రూ.657 కోట్లకు పెరిగింది. సెప్టెంబరు ముగిసే నాటికి ఆర్డర్ బుక్ 9,818 ఎలక్ట్రిక్ వాహనాలుగా ఉంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



9వ తేదీ			
హైదరాబాద్	590	విజయవాడ	600
వరంగల్	592	గోదావరి	600
చిత్తూరు	623	విశాఖపట్నం	585
		డజను గుడ్లు రూ. 84	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	100	విజయవాడ	106
వరంగల్	100	గుంటూరు	108
కరీంనగర్	100	ఒంగోలు	108
మహబూబ్‌నగర్	100	చిత్తూరు	103
కర్నూలు	100	నెల్లూరు	108
విశాఖపట్నం	108	అనంతపురం	108
గోదావరి	106		

స్పోర్ట్స్

ఆసియా ‘ట్రోఫీ’ రాబోతోంది!

నఖ్వీతో సమావేశమైన బీసీసీఐ కార్యదర్శి

దుబాయ్: ఆసియాకప్ టీ20 టోర్నీలో చాంపియన్‌గా నిలిచిన టీమిండియాకు దాదాపు నెలన్నర రోజులైనా ట్రోఫీ అందలేదు. అయితే ఈ విషయమై దుబాయ్‌లో జరుగుతున్న ఐసీసీ ఎగ్జిక్యూటివ్ సమావేశంలో బీసీసీఐ, పీసీబీ చైర్మన్ మొహిసిన్ నఖ్వీ మధ్య సానుకూలంగా చర్చలు జరిగాయి. త్వరలోనే ట్రోఫీ మనకు అందుతుందన్న విశ్వాసం ఉందని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా వెల్లడించాడు. ‘అజెండాలో లేనప్పటికీ సీనియర్ ఐసీసీ అధికారుల సమక్షంలో నేను, నఖ్వీ భేటీ అయ్యాం. ఇక ఈ విషయమై ప్రతిష్టంభన తొలగినట్టే’ అని సైకియా తెలిపాడు. సెప్టెంబరు 28న ఆసియాకప్ ఫైనల్లో గెలిచిన భారత్ ఏసీసీ చీఫ్ నఖ్వీ చేతుల మీదుగా ట్రోఫీ అందుకునేందుకు నిరాకరించింది. దీంతో నఖ్వీ కప్‌ను తీసుకెళ్లి తన కార్యాలయంలో భద్రపరిచాడు.

ఆఖరిది వరుణుడి ఖాతాలోకి



- ఆసీస్‌తో ఐదో టీ20 రద్దు
- 2-1తో భారత్‌దే సిరీస్

బ్రిస్బేన్: ఐదు టీ20ల సిరీస్‌లో చివరి మ్యాచ్.. హ్యాట్రిక్ విజయంతో సిరీస్‌ను పట్టేయాలని భారత్ బరిలోకి దిగితే.. ఎలాగైనా సమం చేయాలనే కసితో ఆస్ట్రేలియా పోటీపడింది. దీంతో ప్రఖ్యాత గాబా మైదానంలో ఎవరిది ఆధిపత్యమో తెలుసుకునేందుకు అభిమానులు కూడా ఎనలేని ఆసక్తి ప్రదర్శించారు. కానీ ఆట ఆరంభమై ఐదు ఓవర్లు కూడా పూర్తి కాకుండానే ఫ్యాన్స్ ఉత్సాహంపై వరుణుడు నీళ్లుజల్లాడు. సిరీస్‌లో తొలి మ్యాచ్ తరహాలోనే శనివారం జరిగిన ఐదో టీ20 కూడా వర్షంతో రద్దయ్యింది. కేవలం 29 బంతుల ఆటే సాధ్యమైంది. అయితే ఇప్పటికే 2-1తో ఆధిక్యంలో ఉండడంతో భారత్ ఐదు టీ20ల సిరీస్‌ను కైవసం చేసుకుంది. తద్వారా ఆస్ట్రేలియా గడ్డపై ఈ ఫార్మాట్‌లో టీమిండియా తన అజేయ ఆటతీరును కొనసాగించింది.

అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్ ఇన్నింగ్స్ ధాటిగా సాగింది. ఓపెనర్లు గిల్ (16 బంతుల్లో 6 ఫోర్లతో 29 నాటౌట్), అభిషేక్ శర్మ (13 బంతుల్లో ఫోర్, సిక్స్‌తో 23 నాటౌట్) ఆరంభం నుంచే ఎదురుదాడికి దిగారు. తొలి ఓవర్‌లో చెరో ఫోర్ బాదగా.. అభిషేక్ ఇచ్చిన సులువైన క్యాచ్‌ను మ్యాక్స్‌వెల్ వదిలేశాడు. ఇక మూడో ఓవర్‌లో గిల్ 4 ఫోర్లతో చెలరేగి 16 రన్స్ అందించాడు. తర్వాతి ఓవర్‌లోనే అభిషేక్ ఫైన్ లెగ్‌లో ఇచ్చిన మరో క్యాచ్‌ను డ్వార్షుస్ వదిలేశాడు. అయితే భారత్ 4.5 ఓవర్లలోనే వికెట్ నష్టపోకుండా 52 పరుగులతో నిలిచిన దశలో.. తీవ్రమైన ఉరుములు, మెరుపులు రావడంతో ఆటగాళ్లంతా మైదానం వీడారు. ఆ తర్వాత చిరుజల్లులు మొదలై భారీ వర్షం కురవడంతో మైదానం చిత్తడిగా మారింది. దాదాపు రెండున్నర గంటలు వేచి చూసినా ఫలితం లేకపోయింది. అప్పటికే ఆసీస్‌లో సమయం రాత్రి 9 కావడంతో మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్టు అంపైర్లు ప్రకటించారు. ‘ప్లేయర్ ఆఫ్ ది సిరీస్’గా అభిషేక్ నిలిచాడు.

1 తక్కువ బంతుల్లోనే (528) టీ20ల్లో వెయ్యి పరుగులు పూర్తి చేసిన బ్యాటర్‌గా అభిషేక్. సూర్యకుమార్ (573)ను అధిగమించాడు.

2 తక్కువ ఇన్నింగ్స్ (28)లో టీ20ల్లో వెయ్యి పరుగులు పూర్తి చేసిన రెండో బ్యాటర్‌గా అభిషేక్. విరాట్ (27) ముందున్నాడు.



అభిషేక్

స్కోరుబోర్డు

భారత్: అభిషేక్ (నాటౌట్) 23, గిల్ (నాటౌట్) 29; **ఎక్స్‌ట్రాలు: 0; మొత్తం:** 4.5 ఓవర్లలో 52/0. **బౌలింగ్:** డ్వార్షుస్ 2-0-27-0, బార్ట్‌లెట్ 1.5-0-13-0, ఎలిస్ 1-0-12-0.

గుకేష్‌కు షాక్

మూడో రౌండ్‌లో నిష్క్రమణ
వరల్డ్ కప్ చెస్

పనాజీ: ప్రపంచ కప్ చెస్‌లో పెను సంచలనం చోటు చేసుకుంది. వరల్డ్ చాంపియన్ గుకేష్‌కు మూడో రౌండ్‌లో చుక్కెదురైంది. జర్మన్ గ్రాండ్‌మాస్టర్ ఫ్రెడరిక్ స్వాన్ టాప్‌సీడ్ గుకేష్‌కు షాకిచ్చాడు. శనివారం జరిగిన రెండో క్లాసికల్ గేమ్‌లో తెల్లపావులతో బరిలో దిగినా గ్రాండ్‌మాస్టర్ గుకేష్ 55 ఎత్తుల్లో పరాజయం చవిచూడడం గమనార్హం. ఇద్దరి మధ్య జరిగిన తొలి గేమ్ డ్రా అయిన సంగతి తెలిసిందే. రెండో గేమ్ నెగ్గిన స్వాన్ 1.5-0.5 స్కోరుతో గుకేష్‌ని ఓడించి ముందంజ వేశాడు. భారత గ్రాండ్‌మాస్టర్లు అర్జున్ ఇరిగేసి, ప్రజ్ఞానంద, పెంటేల హరికృష్ణ, వి.ప్రణవ్ కూడా రౌండ్-32కి చేరారు. కార్తీక్ వెంకటరామన్-బోగ్డాన్ డానియల్ (రుమేనియా) మూడో రౌండ్ రెండో గేమ్‌కూడా డ్రా అయ్యింది. దాంతో ఇద్దరూ చెరో పాయింట్‌తో నిలవడంతో పోరు టైబ్రేక్‌కు మళ్లింది.

లాస్‌ఏంజిల్స్ ఒలింపిక్స్‌లో

భారత్ X పాక్ పోరు లేనట్టేనా?

దుబాయ్: చాలా దశాబ్దాల తర్వాత.. చెప్పాలంటే 128 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఒలింపిక్స్‌లో క్రికెట్ పునరాగమనం చేస్తోంది. 2028 లాస్‌ఏంజిల్స్ విశ్వక్రీడల్లో క్రికెట్‌ను ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. టీ20 ఫార్మాట్‌లో నిర్వహించే పోటీల్లో పురుషులు, మహిళల క్రికెట్ జట్లు బరిలో దిగనున్నాయి. అయితే ప్రపంచంలో ఎక్కడ టోర్నీ జరిగినా ఫ్యాన్స్ అంతా ఆసక్తిగా చూసేది భారత్-పాకిస్థాన్ పోరు కోసమే. అలాగే ఒలింపిక్స్‌లోనూ ఈ రెండు జట్లు పరస్పరం తలపడతాయా? అనే ఆసక్తి అభిమానుల్లో ఏర్పడింది. కానీ విశ్వక్రీడల్లో భారత్, పాకిస్థాన్ జట్లు ముఖాముఖి ఢీకొనే అవకాశాలు కనిపించడం లేదు. అసలు పాక్ జట్టుకు ‘లాస్‌ఏంజిల్స్’లో చోటు దక్కడమే గగనంగా మారింది. ఇందుకు ఒలింపిక్స్‌లో క్రికెట్‌కు సంబంధించి ఐసీసీ రూపొందించిన నిబంధనలే. పురుషులు, మహిళల విభాగాలలో ఆరేసి జట్లకే ఐసీసీ చోటు కల్పించింది. ఈ జట్లను ర్యాంకుల ఆధారంగా ఎంపిక చేయాలని ఐసీసీ తొలుత భావించింది. కానీ ఒక్కో ఖండం/ప్రాంతం నుంచి ఒక్కో అత్యుత్తమ జట్టును ఎంపిక చేసి..ఆరో జట్టును క్వాలిఫయింగ్ రౌండ్ ద్వారా తీసుకోవాలని ఐసీసీ తాజాగా నిర్ణయించినట్టు సమాచారం. ఆ ప్రకారం చూస్తే..ఆసియా ఖండం నుంచి ఒక్క జట్టే విశ్వక్రీడల్లో అడుగుపెట్టనుంది. ప్రస్తుతం టీ20లలో టాప్ ర్యాంక్‌లో ఉన్న టీమిండియా ఆసియా నుంచి ఒలింపిక్స్‌కు క్వాలిఫై కానుంది. ఒషియానా నుంచి ఆస్ట్రేలియా, యూరప్ నుంచి ఇంగ్లండ్, ఆఫ్రికా నుంచి దక్షిణాఫ్రికాలకు చోటు లభించనుంది. కారణం ఆయా ప్రాంతాలనుంచి ఈ మూడు జట్లు టాప్‌లో ఉండడమే. ఇక ఒలింపిక్స్‌కు ఆతిథ్యమిస్తున్నందున అమెరికాకూ చోటు దక్కనుంది. మిగిలిన ఒక్క జట్టును గ్లోబల్ క్వాలిఫయర్స్ టోర్నీ ద్వారా ఎంపిక చేస్తారు. కానీ ఈ క్వాలిఫయర్స్‌లో మేటి జట్లు తలపడనున్న నేపథ్యంలో.. ఇందులో విజేతగా నిలిచి పాక్ ఒలింపిక్స్‌కు అర్హత సాధిస్తుందా? చూడాలి.



భారత 91వ గ్రాండ్‌మాస్టర్.. రాహుల్

న్యూఢిల్లీ: భారత చెస్ ఆటగాడు రాహుల్ వీఎస్ గ్రాండ్‌మాస్టర్ (జీఎం) హోదా సాధించాడు. ఫిలిప్పీన్స్‌లో జరిగిన ఏషియన్ చెస్ వ్యక్తిగత చాంపియన్‌షిప్‌లో తమిళనాడుకు చెందిన 21 ఏళ్ల రాహుల్ విజేతగా నిలిచాడు. దీంతో జీఎంకు అవసరమైన చివరి నార్మ్‌ను రాహుల్ అందుకున్నాడు. రాహుల్.. భారత్ తరఫున 91వ గ్రాండ్‌మాస్టరయ్యాడు.

పృథ్వీరాజ్‌కు 4 వికెట్లు



తమిళనాడు 182 ఆలౌట్

ఆంధ్రతో రంజీ

విశాఖపట్నం స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర లెఫ్టామ్ పేసర్ పృథ్వీరాజ్ (4/46) చెలరేగడంతో.. శనివారం మొదలైన రంజీ మ్యాచ్‌లో తమిళనాడు తొలి ఇన్నింగ్స్‌లో 182 పరుగులకే కుప్పకూలింది. పృథ్వీకి తోడు స్పిన్నర్ సౌరభ్ కుమార్ (8.5-4-4-2) పొదుపైన బౌలింగ్‌తో ఆకట్టుకున్నాడు. అయితే 103 పరుగులకే తొమ్మిది వికెట్లు కోల్పోయిన వేళ.. టెయిలెండర్లు విద్యుత్ (40), వారియర్ (29 నాటౌట్) పోరాడి ఆఖరి వికెట్‌కు 79 పరుగులు జోడించారు. ఆ తర్వాత మొదటి ఇన్నింగ్స్ ఆరంభించిన ఆంధ్ర జట్టు తొలిరోజు ముగిసే సరికి 20/1 స్కోరు సాధించింది. క్రీజులో అభిషేక్ (3), విజయ్ (1) ఉన్నారు.

జురెల్ మరో శతకం

భారత్ ‘ఎ’ రెండో ఇన్నింగ్స్ 382/7 డిక్లేర్

బెంగళూరు: భారత్ ‘ఎ’ వికెట్ కీపర్ ధ్రువ్ జురెల్ అద్భుత ఫామ్‌తో దూసుకెళుతున్నాడు. దక్షిణాఫ్రికా ‘ఎ’తో రెండో అనధికార టెస్టులో అతను వరుసగా రెండో శతకం (127 నాటౌట్) బాదాడు. దీంతో.. ఓవర్‌నైట్ స్కోరు 78/3తో శనివారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన భారత్ ‘ఎ’ 382/7 స్కోరు చేసి డిక్లేర్ చేసింది. హర్ష్ దూబే (84), కెప్టెన్ రిషభ్ పంత్ (65) అర్ధసెంచరీలు సాధించారు. మొదట 17 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగిన పంత్.. దూబే అవుటయ్యాక తిరిగి క్రీజులోకి వచ్చి తుఫాన్ ఇన్నింగ్స్‌తో చెలరేగాడు. దీంతో అతడి గాయంపై జట్టుకు ఆందోళన పడాల్సిన అవసరం లేకపోయింది. ఇక, తొలి ఇన్నింగ్స్‌లోనూ జురెల్ అజేయ శతకంతో నిలిచిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత 417 పరుగుల ఛేదన కోసం బరిలోకి దిగిన దక్షిణాఫ్రికా మూడోరోజు ఆట ముగిసేసరికి రెండో ఇన్నింగ్స్‌లో 25/0 స్కోరు చేసింది. ఆటకు ఆదివారమే చివరిరోజు కాగా.. సఫారీలు 392 రన్స్ వెనుకంజలో ఉన్నారు. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ ‘ఎ’ 255, సఫారీ జట్టు 221 రన్స్ చేశాయి.

గంగూలీని ఆపలేరు..



భవిష్యత్‌లో అతడు ఐసీసీ అధ్యక్షుడు అవుతాడు
బెంగాల్ సీఎం మమత

కోల్‌కతా: పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మరోసారి భారత జట్టు మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీకి మద్దతుగా నిలిచారు. ఈక్రమంలో ఆమె కీలక వ్యాఖ్యలు చేశారు. దాదా ఐసీసీ అధ్యక్షుడు కాకుండా ఎవరూ ఆపలేరని స్పష్టంజేశారు. అసలు సౌరవ్ ఈ పాటికే ఐసీసీ చీఫ్ కావాల్సి ఉందన్నారు. వరల్డ్ కప్ గెలిచిన భారత జట్టు సభ్యురాలు రిచా ఘోష్‌ను బెంగాల్ క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఇక్కడ సన్మానించారు. ఈ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా హాజరైన మమత మాట్లాడుతూ.. ‘అసలు ఈ రోజు ఐసీసీ చీఫ్‌గా ఉండాల్సింది ఎవరు? అతడు గంగూలీ తప్ప మరొకరు కాదు. అతడు ఇప్పుడు అధ్యక్షుడు కాకపోయి ఉండొచ్చు. కానీ ఏదో ఒకరోజు దాదా ఆ పదవి తప్పకుండా చేపడతాడు. అప్పుడు అతడిని ఆపడం ఎవరి తరమూ కాదు’ అని వ్యాఖ్యానించారు.

రవిందర్ గోల్డెన్ షూట్

- ఎలవెనిల్‌కు కాంస్యం

షూటింగ్ ప్రపంచ చాంపియన్‌షిప్



కైరో: ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో శనివారం భారత షూటర్లు పతకాలతో సత్తా చాటారు. భారత ఆర్మీలో నాయక్ సుబేదార్‌గా పనిచేస్తున్న 29 ఏళ్ల రవీందర్ సింగ్ 50 మీటర్ల వ్యక్తిగత పిస్టల్ ఈవెంట్‌లో స్వర్ణం సాధించాడు. ఇక, 50 మీటర్ల పిస్టల్ టీమ్ ఈవెంట్‌లో కమల్జీత్, యోగేశ్వర్, రవీందర్‌లతో కూడిన భారత జట్టు రజతం నెగ్గింది. దీంతో రవీందర్ ఖాతాలో రెండు పతకాలు చేరాయి. ఇక, వ్యక్తిగత 10 మీటర్ల రైఫిల్ ఈవెంట్‌లో భారత షూటర్ ఎలవెనిల్ వలరివన్ కాంస్యం దక్కించుకుంది. ఇదే 10 మీటర్ల రైఫిల్ టీమ్ ఈవెంట్‌లో ఎలవెనిల్, మేఘన, శ్రేయాలతో కూడిన భారత త్రయం కాంస్యం అందుకుంది.

బ్యాడ్మింటన్‌కు తైజు గుడ్‌బై



15 ఏళ్ల కెరీర్‌లో 17 టైటిళ్లు
సింధుతో మరపురాని మ్యాచ్‌లెన్నో..

న్యూఢిల్లీ: తైపీకి చెందిన ప్రఖ్యాత షట్లర్ తైజు యింగ్ బ్యాడ్మింటన్‌కు గుడ్‌బై చెప్పింది. తిరగబెడుతున్న గాయాలవల్ల ఈ నిర్ణయం తీసుకున్నట్టు 31 ఏళ్ల ప్రపంచ మాజీ నెంబర్ వన్ తైజు శనివారం వెల్లడించింది. టోక్యో ఒలింపిక్స్ రజత పతక విజేత అయిన తైజు.. తన 15 ఏళ్ల కెరీర్‌లో 17 బీడబ్ల్యూఎఫ్ టైటిళ్లు సొంతం చేసుకుంది. మరో 12 ఈవెంట్లలో రన్నరప్‌గా నిలిచింది. 2024లో ఇండియా ఓపెన్‌తో చివరి బీడబ్ల్యూఎఫ్ టైటిల్ అందుకుంది.

నా పయనంలో నిన్ను కోల్పోతున్నా: సింధు

సమకాలీన బ్యాడ్మింటన్‌లో భారత స్టార్ పీవీ సింధు, తైజు చిరకాల ప్రత్యర్థులు. వీరిద్దరి మ్యాచ్ అంటే బ్యాడ్మింటన్ ప్రియులకు పసందైన విందు. ఆఖరి ర్యాలీ వరకూ ఉత్కంఠగా సాగిన వీరి మ్యాచ్‌లు ఫ్యాన్స్‌ను మునివేళ్లపై నిలబెట్టాయి. అలాంటి తైజు ఆటకు వీడ్కోలు పలకడంతో సింధు భావోద్వేగానికి లోనైంది. ‘15 ఏళ్లుగా నీతో తలపడిన ప్రతి మ్యాచ్ మరపురానిదే. ఆ మ్యాచ్‌ల నుంచి ఓ అథ్లెట్‌గా ఎంతో మెరుగయ్యా’ అని సింధు సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది.

వైవీ సుబ్బారెడ్డి పాత్ర అనుమానాస్పదం

(మొదటి పేజీ తరువాయి)



సుబ్రహ్మణ్యానికి సుబ్బారెడ్డి అప్పగించి భోలే బాబా ఆర్గానిక్ డెయిరీ ప్రైవేట్ లిమిటెడ్ పై విచారణ జరిపించాలని కోరారు. తిరుమలలోని కార్యాలయంలో 2022మే 20న సుబ్రహ్మణ్యం తనను కలిసినప్పుడు ఆ సంస్థలో సేకరించిన నెయ్యి నమూనాలను పరీక్షల కోసం మైసూరులోని సీఎఫ్‌టీఆర్‌ఐ ల్యాబ్‌కు పంపించాలని ఆయన సూచించారు. అదేఏడాది ఆగస్టులో నెయ్యి పరీక్షా ఫలితాలు వచ్చాయి. ప్రీమియర్ అగ్రిఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్, వైష్ణవి డెయిరీ స్పెషాలిటీస్ లిమిటెడ్, భోలేబాబా డెయిరీ సరఫరా చేసిన నెయ్యి కల్తీ జరిగినట్లు తేలింది. బీటా సిటోస్టెరాల్ పరీక్షల నివేదిక ప్రకారం...నెయ్యిని వెజిటెబుల్ ఆయిల్‌తో కల్తీ చేసినట్లు తేలింది. ఈ నివేదికను ప్రొక్యూర్‌మెంట్ జీఎం సుబ్రహ్మణ్యం ఛైర్మన్ దృష్టికి తీసుకెళ్లినా...ఆయన ఆయా కంపెనీలపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. పైగా, 2024వరకు నెయ్యి సరఫరా చేసేందుకు ప్రీమియర్ అగ్రిఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్, వైష్ణవి డెయిరీ స్పెషాలిటీస్ లిమిటెడ్ సంస్థలను ఆయన అనుమతించారు. భోలే బాబా డెయిరీ నుండి సైతం 2022 అక్టోబరు వరకు నెయ్యి సరఫరాకు అనుమతిచ్చారు. భోలేబాబా డైరెక్టర్ పోమిల్ జైన్ (ఏ3) కైలాస్‌చంద్ మంగళ, పీపీ శ్రీనివాసన్ 2022 మే 25న హైదరాబాద్‌లోని వైవీ సుబ్బారెడ్డి క్యాంప్ కార్యాలయంలో కలిశారు. పీఏ చిన్నప్పన్న కేజీ నెయ్యి సరఫరాకు రూ.25 డిమాండ్ చేస్తున్నారని పోమిల్ జైన్....ఛైర్మన్ సుబ్బారెడ్డికి ఫిర్యాదు చేశారు. ఏడాది పాటు ప్లాంట్‌లో ఎలాంటి తనిఖీలు నిర్వహించవద్దని కోరారు. ప్రీమియర్ అగ్రిఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ తరఫున హవాలా ఏజెంట్ అమన్ గుప్తా నుండి ఢిల్లీలోని పాటిల్‌నగర్‌లోని మెట్రోస్టేషన్ వద్ద సుబ్బారెడ్డి పీఏ చినప్పన్న వివిధ సందర్భాల్లో రూ.20 లక్షలు, అలాగే ఆ సంస్థ మేనేజర్ విజయ్‌గుప్తా నుండి రూ.30లక్షలు తీసుకున్నట్లు దర్యాప్తులో తేలింది. సుబ్బారెడ్డి పాత్ర అనుమానాస్పదంగా ఉన్న నేపథ్యంలో సంబంధిత సంస్థలు, వ్యక్తుల నుండి సిట్ సామాచారాన్ని సేకరిస్తోంది" అని కౌంటర్‌లో పేర్కొంది. టీటీడీ శ్రీవారి లడ్డూ తయారీకి నకిలీ నెయ్యి సరఫరా చేసిన వ్యవహారాన్ని దర్యాప్తు చేసేందుకు సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షణలో సుప్రీంకోర్టు సిట్‌ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. కేసు దర్యాప్తులో భాగంగా హైదరాబాద్ శ్రీనగర్ కాలనీలోని యాక్సిస్ బ్యాంక్ మేనేజర్‌కు సిట్ అదనపు ఎస్పీ ఈనెల 12న నోటీసులు ఇస్తూ...సుబ్బారెడ్డి, ఆయన సతీమణికి సంబంధించిన బ్యాంక్ ఖాతాలు, స్టేట్‌మెంట్ వివరాలు ఇవ్వాలని కోరారు. తమ ఖాతా లావాదేవీలు ఇవ్వాలని బ్యాంక్ అధికారులను సిట్ కోరడాన్ని సవాల్ చేస్తూ వారిద్దరూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై ఇటీవల విచారణ జరిపిన కోర్టు కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశించింది. ఈ నేపథ్యంలో సిట్ ఐవో ఇటీవల కౌంటర్ దాఖలు చేశారు.

కల్తీ నెయ్యి కేసులో మరో అరెస్టు

- కెమికల్ వ్యాపారి అజయ్‌కుమార్ అదుపులోకి

తిరుపతి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): టీటీడీకి కల్తీ నెయ్యి సరఫరా చేసిన కేసులో మరో నిందితుడిని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అరెస్టు చేసింది. ఢిల్లీలో రసాయనాల వ్యాపారి అజయ్ కుమార్ సుగంధిని (39) శుక్రవారం రాత్రి అరెస్టు చేసి నెల్లూరు ఏసీబీ కోర్టులో హాజరుపరిచింది. ఆయనకు న్యాయమూర్తి 14 రోజుల పాటు రిమాండు విధించగా, నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించారు. అజయ్‌కుమార్‌ను కస్టడీకి తీసుకుని విచారించేందుకు అనుమతించాలంటూ సిట్ అధికారులు సోమవారం ఏసీబీ కోర్టులో పిటిషన్ దాఖలు చేయనున్నారు. అదేరోజున టీటీడీ మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పీఏ చిన్నప్పన్న కస్టడీ కోసం ఇదివరకే సిట్ దాఖలు చేసిన పిటిషన్‌పై ఏసీబీ కోర్టులో విచారణ జరగనుంది. ఆయిల్స్ అండ్ కెమికల్స్ సంస్థ యజమాని అయిన అజయ్ కుమార్... భోలేబాబా డెయిరీ డైరెక్టర్లు పోమిల్ జైన్, విపిన్ జైన్‌కు నకిలీ నెయ్యి తయారీకి అవసరమైన రసాయనాలు సరఫరా చేసినట్టు సిట్ అధికారులు గుర్తించారు. దక్షిణ కొరియా నుంచి ఢిల్లీకి చెందిన ప్రధాన డిస్ట్రిబ్యూటర్ ఈ రసాయనాలను దిగుమతి చేసుకోగా, వారి వద్ద అజయ్‌కుమార్ తన సంస్థ పేరిట కొనుగోలు చేసినట్టు సిట్ కనుగొంది. మోనో గ్లిజరయిడ్స్, అసిటిక్ యాసిడ్, ఈస్టర్ వంటి రసాయనాలను భోలేబాబా డెయిరీ డైరెక్టర్లకు ఆయన సరఫరా చేశారని, ఆ రసాయనాలతో తయారైన నెయ్యినే వైష్ణవి, ఏఆర్ డెయిరీ పేరుతో టీటీడీకి సరఫరా చేశారని సిట్ గుర్తించింది. మొత్తం మీద భోలేబాబా డెయిరీ తయారు చేసిన నకిలీ నెయ్యిలో 90 శాతానికిపైగా పామాయిల్ కలిపినట్టు గుర్తించారు. కాగా, అజయ్‌కుమార్‌కు, పోమిల్ జైన్, విపిన్ జైన్‌లకు మధ్య రసాయనాల సరఫరాకు, ఆర్థిక లావాదేవీలకు సంబంధించి ఉన్న బంధాన్ని నిర్ధారించే ఆధారాలను సిట్ సేకరించినట్టు సమాచారం. వాటి ఆధారంగానే మూడురోజుల క్రితం ఢిల్లీలో అజయ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని తిరుపతికి తరలించారని, అక్కడి సిట్ కార్యాలయంలో విచారించారని తెలిసింది. అనంతరం శుక్రవారం రాత్రి అరెస్టు చేసి అప్పటికప్పుడు నెల్లూరు ఏసీబీ కోర్టుకు తరలించి రిమాండు నిమిత్తం న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచింది. కల్తీ నెయ్యి కేసులో ఆయనను ఏ16గా రిమాండు రిపోర్టులో పేర్కొంది.

1,64,505 హెక్టార్లలో పంట నష్టం

- రాష్ట్రంలో తుఫాను బాధిత రైతులు 3,27,783 మంది
- రేపు, ఎల్లుండి కేంద్ర బృందం పర్యటన

అమరావతి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా రాష్ట్రంలోని 24 జిల్లాల్లో 3,27,783 మంది రైతులకు చెందిన 1,64,505 హెక్టార్లలో వివిధ పంటలు దెబ్బతిన్నట్టు వ్యవసాయశాఖ తేల్చింది. అత్యధికంగా కృష్ణా జిల్లాలో 31,033, కోనసీమలో 29,537, కాకినాడలో 21,422, తూర్పుగోదావరిలో 15,666, బాపట్లలో 13,258, ప్రకాశంలో 12,280, నంద్యాలలో 11,447, పశ్చిమగోదావరిలో 8,958, ఏలూరులో 5,671, ఎన్టీఆర్ జిల్లాలో 5,039 హెక్టార్లలో పంట నష్టం జరిగినట్టు గుర్తించింది. అలాగే అత్యధికంగా కోనసీమ జిల్లాలో 61,237 మంది, కృష్ణాలో 60,208, కాకినాడలో 47,064, తూర్పుగోదావరిలో 30,729, నంద్యాలలో 23,370, పశ్చిమ గోదావరిలో 20,087, బాపట్లలో 18,563, ప్రకాశంలో 6,872, ఏలూరులో 11,577, ఎన్టీఆర్‌లో 10,137, శ్రీకాకుళం జిల్లాలో 8,289 మంది రైతులు నష్టపోయారని వ్యవసాయశాఖ తుది నివేదికలో పేర్కొంది. కాగా, తుఫాన్ ప్రభావిత ఆరు జిల్లాల్లో ఈనెల 10, 11 తేదీల్లో కేంద్ర బృందం పర్యటించనుంది. కేంద్ర హోంశాఖ సంయుక్త కార్యదర్శి పౌసుమీ బసు నేతృత్వంలోని ఎనిమిది మంది సభ్యుల బృందం రెండు బృందాలుగా విడిపోయి క్షేత్రస్థాయిలో పర్యటించనుంది. సోమవారం ఉదయం 10 గంటలకు రాష్ట్ర సచివాలయంలోని ఆర్టీజీఎస్ సెంటర్‌లో కేంద్ర బృందానికి సంక్షిప్త సమాచారం ఇచ్చేందుకు సంబంధిత శాఖల ఉన్నతాధికారులంతా హాజరు కావాలని నిర్దేశించారు.

'పరకామణి' కేసులో సీఐడీ దర్యాప్తు ముమ్మరం

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 8(ఆంధ్రజ్యోతి): తిరుమల పరకామణి కేసు దర్యాప్తును సీఐడీ డీజీ రవిశంకర్ అయ్యన్నార్ బృందం ముమ్మరం చేసింది. సాంకేతిక సహకారంతో ఆధారాల సేకరణ దిశగా అడుగులేస్తోంది. తొలిరోజైన గురువారం తిరుమలలో పరకామణి, కమాండ్ కంట్రోల్ యూనిట్‌తో పాటు పలు ప్రాంతాల్లో అధికారులు తనిఖీలు చేశారు. ఈ కేసులో నిందితుడు రవికుమార్, ఆయన భార్య, కుమార్తెను శుక్రవారం విచారించి వీడియో రికార్డింగ్ చేశారు. ఇక, పరకామణి కేసులో టీటీడీలో మిగతావారి పాత్రపై ఆరా తీసే క్రమంలో అప్పటి ఏవీఎస్‌వో సతీశ్‌కుమార్‌ను విచారించడానికి త్వరలో నోటీసులు జారీ చేయనున్నట్లు తెలిసింది. కాగా, ఆదాయానికి మించి రవికుమార్ కూడబెట్టిన ఆస్తులపై తనిఖీలు చేయడానికి ఏసీబీ సిద్ధమైనట్లు సమాచారం.

ముందుకు ఎలా వెళ్లాలో నేర్చుకున్నా

సమంత



నటి సమంత, దర్శకుడు రాజ్ నిడిమోరు రిలేషన్‌లో ఉన్నారంటూ కొంత కాలంగా వార్తలొస్తున్న విషయం తెలిసిందే. తాజాగా సమంత షేర్ చేసిన ఓ ఫొటో నెట్టింట వైరల్ అయ్యింది. తన పెర్‌ఫ్యూమ్ బ్రాండ్ లాంచ్ ఈవెంట్‌లో దిగిన ఫొటో అది. ఆ ఫొటోలో సమంత రాజ్‌ని కౌగిలించుకోవడం చర్చనీయాంశమైంది. ఇదే ఈవెంట్‌లో పలువురితో దిగిన ఫొటోలు కూడా సమంత షేర్ చేశారు. ఈ సందర్భంగా తన ప్రయాణాన్ని గుర్తు చేసుకుంటూ 'ఏడాదిన్నరగా నా కెరీర్‌లో ఎన్నో సాహసోపేతమైన అడుగులు వేశాను. ముందుకు ఎలా వెళ్లాలో నేర్చుకున్నా. చిన్న విజయాలను ఇప్పుడు సెలెబ్రేట్ చేసుకుంటున్నా' అని పేర్కొన్నారు. దీంతో రాజ్, సమంత ప్రేమాయణం నిజమేనంటూ నెటిజన్లు చర్చించుకుంటున్నారు.

విజయ్‌ని పెళ్లి చేసుకుంటా

- రష్మిక మందన్న



విజయ్ దేవరకొండతో నిశ్చితార్థం అయ్యిందని, త్వరలోనే పెళ్లి చేసుకోబోతున్నారని కొంత కాలంగా వస్తోన్న వార్తలపై నటి రష్మిక మందన్న ఎట్టకేలకు స్పందించారు. ఇటీవల ఓ యూట్యూబ్ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తనకు కాబోయే భాగస్వామికి ఉండాల్సిన లక్షణాల గురించి వివరించారు. 'నా భాగస్వామికి నన్ను లోతుగా అర్థం చేసుకునే శక్తి ఉండాలి. నా కోసం యుద్ధం చేయడానికైనా వెనుకాడకూడదు. అలాంటి మనిషి కోసం నేను తూటాకైనా ఎదురెళ్తా' అని అన్నారు. డేట్, పెళ్లి విషయాల గురించి ప్రస్తావిస్తూ.. 'ఒకవేళ నేను డేట్ చేయాల్సి వస్తే యానిమేషన్ క్యారెక్టర్ నరుటోతో చేస్తా. పెళ్లి చేసుకుంటే విజయ్‌ని చేసుకుంటా' అని చెప్పారు. కాగా, అక్టోబరు 3న రష్మిక, విజయ్ నిశ్చితార్థం జరిగినట్లు వార్తలు వచ్చాయి. ఈ విషయాన్ని అధికారికంగా ధ్రువీకరించలేదు. అయితే ఈ మధ్య పలు ఇంటర్వ్యూల్లో నిశ్చితార్థం వార్తలపై రష్మిక స్పందించారు. సమయం వచ్చినప్పుడు వెల్లడిస్తానని అన్నారు. ఇప్పుడు విజయ్‌తో పెళ్లి విషయంలో స్పష్టతనిచ్చారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో వీరి వివాహం జరగనున్నట్లు టాలీవుడ్‌లో టాక్ వినిపిస్తోంది.

సోమశిలలో అల్లు అర్జున్



నిత్యం షూటింగ్‌లతో బిజీగా గడిపే హీరో అల్లు అర్జున్ తన కుటుంబ సభ్యులు, చిన్ననాటి మిత్రులతో కలిసి శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం సోమశిల గ్రామం దగ్గర కృష్ణానదిని సందర్శించారు. ఆహ్లాదంగా ఉండే కృష్ణానదిలో సరదాగా బోటింగ్ చేశారు. రెండు గంటలు అక్కడే గడిపారు.

-కొల్లాపూర్, ఆంధ్రజ్యోతి

వినోదం, సందేశం మేళవింపు



సంజీవ్ రెడ్డి

సంతాన లేమి సమస్య నేపథ్యంలో వినోదం, సందేశం మేళవింపుగా రూపొందిన చిత్రం 'సంతాన ప్రాప్తిరస్తు'. కథాంశం గంభీరమైనదైనా సగటు ప్రేక్షకులకు నచ్చేలా అన్ని హంగులతో తెరకెక్కించాం' అని దర్శకుడు సంజీవ్‌రెడ్డి అన్నారు. విక్రాంత్, చాందినీ చౌదరి జంటగా మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈనెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా సంజీవ్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు.

- కొత్తగా పెళ్లైన దంపతులను 'సంతాన ప్రాప్తిరస్తు' అని దీవిస్తారు. కానీ మన సమాజంలో సంతానలేమి సమస్య తీవ్రంగా ఉంది. పురుషుల్లో వంధ్యత్వం సమస్య ఆధారంగా ఇప్పటివరకూ తెలుగులో సినిమా రాలేదు. మా బంధువులు, స్నేహితులు కొందరు ఇలాంటి సమస్యతో బాధపడ్డారు. తర్వాత వారిలో కొందరికి ఆధునిక వైద్యంతో సంతానం కలిగినా, సమాజం, కుటుంబ సభ్యుల నుంచి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బాలీవుడ్‌లో ఈ తరహా కథలతో కొన్ని సినిమాలు వచ్చాయి. కానీ మన దగ్గర రాలేదు. ఈ నేపథ్యంలో కథను చెబితే బావుంటుందనిపించి, స్క్రిప్ట్ సిద్ధం చేశాను. ఇప్పటివరకూ నాలుగు గోడల మధ్య మాట్లాడుకునే అంశాన్ని ఈ సినిమా చూశాక ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్చిస్తారని భావిస్తున్నాను.
- ఓవర్ డ్రామా లేకుండా, హద్దులు దాటకుండా కుటుంబ సభ్యులతో కలసి చూసేలా కథను రూపొందించాం. హీరోకు వీర్యకణాల సంఖ్య తక్కువ ఉండడం అనేది కథలో ప్రధానాంశం.

యువతరాన్ని ఆకట్టుకునేలా...



శ్రీ నందు, యామినీ భాస్కర్ జంటగా వరుణ్ రెడ్డి తెరకెక్కిస్తున్న చిత్రం 'సైక్ సిద్ధార్థ'. ప్రియాంక రెబెకా శ్రీనివాస్, సాక్షి ఆత్రీ కీలక పాత్రలు పోషించారు. స్పిరిట్ మీడియా, నందునెస్ కీప్ రోలింగ్ పిక్చర్స్ బేనర్లపై శ్రీ నందు, శ్యామ్‌సుందర్ రెడ్డి తుడి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. యువతరాన్ని ఆకట్టుకునేలా తెరకెక్కుతున్న ఈ సినిమా టీజర్‌ను శనివారం విడుదల చేశారు మేకర్స్. హైదరాబాద్ యాస మాట్లాడుతూ హైపర్ యాక్టివ్ వ్యక్తిగా శ్రీ నందు చేసిన నటన ఆకట్టుకుంది. డిసెంబరు 12న చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

సునీత దంపతులపై కేసు పెట్టించిన అధికారుల విచారణ

(మొదటి పేజీ తరువాయి)



జగన్‌కు రాజేశ్వర్‌రెడ్డిని పరిచయం చేస్తున్న ఏఎస్ఐ రామకృష్ణారెడ్డి(ఫైల్)

కుళ్లాయప్ప అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పులివెందుల పోలీసులు తాజాగా కేసు కట్టారు. దీంతో త్వరలోనే సదరు అధికారులను విచారణకు పిలిచే అవకాశం ఉందని తెలుస్తోంది. కాగా.. పులివెందులకే చెందిన కుళ్లాయప్ప.. గత నెల 22నే సునీత దంపతులు సహా రామ్‌సింగ్‌పై తప్పుడు కేసు పెట్టిన వారిని విచారించాలని కోరుతూ.. కర్నూలు రేంజ్ డీఐజీకి ఫిర్యాదు చేశారు. దీంతో అప్పట్లోనే కర్నూలు పోలీసులు 'జీరో ఎఫ్ఐఆర్' నమోదు చేసి.. అనంతరం దీనిని పులివెందులకు బదిలీ చేశారు.

ఏం జరిగింది?

వైఎస్ వివేకానందరెడ్డి పులివెందులలోని తన ఇంట్లో 2019, మార్చి 15న దారుణ హత్యకు గురయ్యారు. దీనిపై మొదట సిట్ దర్యాప్తు చేపట్టింది. అనంతరం దర్యాపు సరిగా లేదంటూ వివేకా కుమార్తె సునీత కోర్టును ఆశ్రయించడంతో న్యాయస్థానం సీబీఐ విచారణకు ఆదేశించింది. దీంతో సీబీఐ అధికారులు రంగంలోకి దిగారు. ఈ క్రమంలో వివేకా పీఏ కృష్ణారెడ్డిని విచారించారు. అయితే, తనను సునీత, ఆమె భర్త రాజశేఖర్ రెడ్డి, సీబీఐ ఎస్పీ రామ్‌సింగ్ తనను తప్పుడు సాక్ష్యం చెప్పాలని బెదిరిస్తున్నారంటూ వివేకా పీఏ కృష్ణారెడ్డి పోలీసులకు రివర్స్ ఫిర్యాదు చేశారు. దీంతో 2023, డిసెంబరు 24న పులివెందుల పట్టణ పోలీసులు ఆ ముగ్గురిపై కేసు నమోదు చేశారు. ఈ వ్యవహారంపై సునీత కోర్టును ఆశ్రయించగా.. న్యాయస్థానం తీవ్రంగా పరిగణించి కేసును క్వాష్ చేసింది. ఇదిలా వుంటే, సునీత దంపతులు సహా రామ్‌సింగ్‌పై కేసు పెట్టడానికి వెనుక అసలు ఏం జరిగింది?. తెరవెనుక ఎవరున్నారు?. అనే విషయాలను తేల్చాలని కోరుతూ.. ప్రభుత్వం గతంలోనే పులివెందుల డీఎస్పీని ఆదేశించింది. మరోవైపు పులివెందులకు చెందిన కుళాయప్ప అనే వ్యక్తి కూడా గత నెల 22న కర్నూలు రేంజ్ డీఐజీకి ఫిర్యాదు చేశారు. అప్పట్లో ఈ ముగ్గురిపై కేసు నమోదు చేయడంలో ప్రమేయం ఉందని ఏఎస్పీ, ప్రస్తుతం రిటైరైన రాజేశ్వర్‌రెడ్డి, అదేవిధంగా ప్రస్తుత రాజుపాళెం ఏఎస్ఐ రామకృష్ణారెడ్డిపై అనుమానం వ్యక్తం చేశారు. దీంతో వారిని పులివెందుల పోలీసులు విచారించనున్నారు.

నాడు కేసు వెనుక ఆ ఇద్దరి హస్తం

కుళాయప్ప ఫిర్యాదులో పేర్కొన్న మేరకు.. "సునీత, రాజశేఖర్‌రెడ్డి, ఎస్పీ రామ్‌సింగ్‌పై కేసు నమోదు చేయడం వెనుక అప్పట్లో నెల్లూరులో ఏఎస్పీగా పనిచేసిన రాజేశ్వర్‌రెడ్డి, అప్పట్లో సింహాద్రిపురం మండలంలో ఏఎస్ఐగా పనిచేసిన రామకృష్ణారెడ్డి ప్రమేయం ఉంది. రామకృష్ణారెడ్డి పులివెందుల చుట్టుపక్కల మండలాల్లోని పోలీస్‌స్టేషన్లలో పనిచేస్తూ పులివెందులలో నివాసం ఉంటున్నారు. ఈ నేపథ్యంలో వివేకా హత్య జరిగిన రోజు రక్తపు మరకలు తుడిచే విషయంలో కూడా ఈయన ప్రమేయం ఉంది. అనంతరం వివేకా పీఏ వెంకటకృష్ణారెడ్డి ఇంట్లో.. ఆయనతో రాజేశ్వర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి భేటీ అయ్యారు. వివేకా ఘటనపై ఫిర్యాదు ఎలా చేయాలో?. ఎవరి మీద చేయాలో? వీరిద్దరూ చెప్పారు. ఆ ప్రకారం అప్పట్లో వివేకా పీఏ పులివెందుల అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం ఏఎస్ఐ రామకృష్ణారెడ్డి రాజుపాళెంలో పనిచేస్తుండగా రాజేశ్వర్‌రెడ్డి రిటైర్ అయ్యారు. ఈ ఇద్దరిపై చర్యలు తీసుకోవాలి." అని కుళాయప్ప ఫిర్యాదులో పేర్కొన్నారు.

సంబంధం లేకున్నా 'ముఖ్య నేత' కోసం

ఏఎస్ఐ రామకృష్ణారెడ్డి, అప్పటి ఏఎస్పీ రాజేశ్వర్‌రెడ్డి పులివెందులలోని వైసీపీ ముఖ్య నేతలకు సన్నిహితులని సమాచారం. ఈ కారణంగానే వివేకా హత్య జరిగిన రోజున తనకు సంబంధం లేకపోయినా రామకృష్ణారెడ్డి వివేకా ఇంటికి వెళ్లారని, రక్తపు మరకలు తుడిచేందుకు సాయం చేశారని సమాచారం. రాజేశ్వర్‌రెడ్డి కుమారుడికి నాటి వైసీపీ పెద్దలు ఎంబీబీఎస్ సీటు ఉచితంగా ఇప్పించారని తెలిసింది. రామకృష్ణారెడ్డి బావమరిదికి రాజేశ్వర్‌రెడ్డి కుమార్తెను ఇచ్చి పెళ్లిచేశారు. దీంతో వీరిద్దరి మధ్య బంధుత్వం ఏర్పడింది.

డిసెంబరు 1నుంచి పార్లమెంటు సమావేశాలు

న్యూఢిల్లీ, నవంబరు 8: పార్లమెంటు శీతాకాల సమావేశాలు డిసెంబరు 1 నుంచి 19వ తేదీ వరకు జరగనున్నాయి. కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు ఈ విషయాన్ని శనివారం ప్రకటించారు. 3 వారాలు జరగనున్న ఈ సెషన్‌లో ఉభయ సభలు 15 రోజులు మాత్రమే సమావేశం(సిట్టింగ్స్) కానున్నాయి. దీనిపై విపక్షాలు విమర్శలు వ్యక్తం చేశాయి.

'ఎడ్యుకేట్ గర్ల్స్'కు మెగసెసే అవార్డు ప్రదానం

మనీలా, నవంబరు 8: ప్రతిష్ఠాత్మక రామన్ మెగసెసే పురస్కారాన్ని భారతదేశానికి చెందిన లాభాపేక్ష రహిత స్వచ్ఛంద సంస్థ 'ఎడ్యుకేట్ గర్ల్స్' అందుకొంది. ఆ సంస్థకు అవార్డు ఇవ్వనున్నట్టు ఆగస్టు 31న నిర్వాహకులు ప్రకటించగా శుక్రవారం ఫిలిప్పీన్ రాజధాని మనీలాలో నిర్వహించిన కార్యక్రమంలో అందజేశారు.

పాక్ సైన్యాధిపతికి త్రివిధ దళాలపై పెత్తనం!

ఇస్లామాబాద్, నవంబరు 8: అత్యున్నత స్థాయిలో త్రివిధ దళాల సమన్వయానికి పాకిస్థాన్ కొత్తగా 'చీఫ్ ఆఫ్ డిఫెన్స్ ఫోర్సెస్' (సీడీఎఫ్) అనే పదవిని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. సైన్యాధిపతికే ఈ బాధ్యతలు కూడా అప్పగించనుంది. ప్రస్తుత ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ చేతుల్లో మరింత అధికారాన్ని కేంద్రీకృతం చేయటంలో భాగంగానే ఈ బిల్లును తెచ్చినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.

ఏజీపీలుగా తొమ్మిదిమంది నియామకం

అమరావతి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం తరఫున హైకోర్టులో వాదనలు వినిపించేందుకు తాజాగా తొమ్మిది మందిని సహాయ ప్రభుత్వ న్యాయవాదులు(ఏజీపీలు)గా నియమించారు. న్యాయవాదులు ఖత్రావత్ దిలీప్ నాయక్, దువ్వూరి దావీదు, పెరుమాళ్ల ఉషా, మోదుకూరు చంద్రశేఖర్, మటాడ యువశివస్వామి, అనూరాధ కన్నెధార, జె.నూకపతిరావు, సింగరాజు అనంత వెంకటసాయి కుమార్, తలుపుల బాలకృష్ణలను ఏజీపీలుగా నియమిస్తూ న్యాయశాఖ కార్యదర్శి జి.ప్రతిభా దేవి ఉత్తర్వులు జారీ చేశారు.

మేం ల్యాప్‌టాప్‌లు ఇస్తున్నాం!

(మొదటిపేజీ తరువాయి)



వారాణసీలో ప్రారంభించిన వందే భారత్ రైల్లో విద్యార్థులతో మోదీ

సభల్లో ప్రధాని మాట్లాడుతూ.. "వారు(విపక్ష పార్టీలు) పిల్లలకు తుపాకులు ఇస్తే.. మేం ల్యాప్‌టాప్‌లు ఇస్తున్నాం. వారే కనుక అధికారంలోకి వస్తే.. మీ తలలపై తుపాకులు ఎక్కుపెట్టి చేతులు పైకెత్తమంటారు." అని తీవ్రంగా వ్యాఖ్యానించారు. అంతేకాదు, రాష్ట్రంలోని యువతను విపక్ష పార్టీలు పోకిరీలుగా మారుస్తున్నారని విమర్శలు గుప్పించారు. "ఇక్కడి కొందరు వ్యక్తులు తమ పిల్లలను ముఖ్యమంత్రులుగా, మంత్రులుగా, ఎంపీలు, ఎమ్మెల్యేలుగా చూడాలని భావిస్తున్నారు. కానీ, ఇదే సమయంలో మీ(ప్రజలు) పిల్లలను మాత్రం గూండాలుగా మార్చే ప్రయత్నం చేస్తున్నారు. కానీ, బిహార్ ప్రజలు దీనిని ఎప్పటికీ సహించరు" అని ప్రధాని వ్యాఖ్యానించారు. ప్రధానంగా ఆర్జేడీని లక్ష్యంగా చేసుకుని మోదీ విరుచుకుపడ్డారు. "ఎన్నికల ప్రచారంలో ఆర్జేడీ నేతలు చేస్తున్న వ్యాఖ్యలు.. ప్రచార గీతాలు వింటే మీరు వణికిపోతారు. బిహార్ యువతను ఆర్జేడీ ఏం చేయాలని అనుకుంటోందో ఈ ప్రచారాలే స్పష్టం చేస్తున్నాయి. అమాయక చిన్నారులను వేదికలెక్కించి.. వారితో గ్యాంగ్‌స్టర్లుగా మారుతామని చెప్పిస్తున్నారు. ఇదీ.. ఆర్జేడీ విధానం" అని దుయ్యబట్టారు. ఈ సందర్భంగా ఆర్జేడీ అభ్యర్థి నిర్వహించిన ప్రచార సభలో పదేళ్ల బాలుడు చేసిన 'తుపాకులు, దోపిడీ' వ్యాఖ్యలను ఆయన ప్రస్తావించారు. బిహార్‌లో నేడు తుపాకులు ఎక్కుపెట్టే సంస్కృతి లేదన్న ప్రధాని.. యువత స్టార్టప్స్ కలలను సాకారం చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ క్రమంలో ఆయన 'మాకు తుపాకులు పట్టుకునే సర్కారు వద్దు-మరోసారి ఎన్డీయే సర్కారే ముద్దు' అనే నినాదం ఇచ్చారు.

వారికి నిద్రలేకుండా చేశారు!

ఈ నెల 6న జరిగిన తొలిదశ పోలింగ్‌లో 65.08 శాతం ఓటింగ్ నమోదైంది. ఈ విషయాన్ని ప్రస్తావించిన ప్రధాని మోదీ.. 65 వోల్టుల శక్తితో విపక్షాలకు భారీ షాక్ ఇచ్చారని వ్యాఖ్యానించారు. "విపక్షాలను చావుదెబ్బ కొట్టారు. వారికి 65 వోల్టుల శక్తితో భారీషాకిచ్చారు. నిద్ర లేకుండా చేశారు. ఎన్డీయే అభ్యర్థులకు మద్దతుగా పోలింగ్ కేంద్రాలకు పోటెత్తారు" అని వ్యాఖ్యానించారు. మహిళల అభ్యున్నతికి తానే బ్రాండ్ అంబాసిడర్‌నని మోదీ అభివర్ణించారు. కొంతమంది 'మునగడం ఎలా' అనే విషయంపై సాధన చేస్తున్నారు.. అంటూ ఇటీవల మత్స్యకారులతో కలిసి రాహుల్‌గాంధీ చెరువులో మునిగిన చేపలు పట్టిన విషయాన్ని ప్రస్తావిస్తూ ఎద్దేవా చేశారు.

వారిని ఓటుతో శిక్షించండి!

"బిహార్ మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకొనే ఛట్ ఉత్సవాన్ని డ్రామా, నకిలీ అని వ్యాఖ్యానించి ఇక్కడి వారిని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా అవమానించింది. ఇది మన సెంటిమెంటును అవమానించడం కాదా?. అలాంటివారిని శిక్షించ కూడదా?. అలా శిక్షించాలంటే ప్రజాస్వామ్యంలో మీకున్న మార్గం, శక్తి ఓటే. ఆ ఓటుతోనే వారిని శిక్షించండి." అని మోదీ పిలుపునిచ్చారు. వారి ఓటు బ్యాంకు రాజకీయాల కారణంగా చొరబాటు దారులు కూడా రక్షణ పొందుతున్నారని దుయ్యబట్టారు. రెండో దశ ఎన్నికల్లో ప్రతి బూత్‌లోనూ గత ఎన్నికలకంటే కూడా 100 ఓట్లు ఎక్కువ పడేలా ప్రజలు, కార్యకర్తలు వ్యవహరించాలని ఆయన అభ్యర్థించారు.


160 సీట్లతో ఎన్డీయేకు అధికారం: అమిత్ షా

బిహార్‌లో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ దుకాణం మూత పడనుందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి స్వీప్ చేస్తుందని, 160కి పైగా సీట్లతో మళ్లీ అధికారంలోకి రాబోతోందని తెలిపారు. శనివారం పూర్ణియా, కతిహార్, సుపాల్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభల్లో అమిత్ షా మాట్లాడారు. రాహుల్‌గాంధీ, ఆర్జేడీ నేత తేజస్వియాదవ్ కలిసి బిహార్‌లోని సీమాంచల్ ప్రాంతాన్ని చొరబాటు దారుల అడ్డాగా మార్చారని ఆరోపించారు. సోనియా గాంధీకి, లాలూప్రసాద్ యాదవ్ తమ కుమారుల గురించి బాధపడుతున్నారని, కానీ.. బిహార్‌లో, ఢిల్లీలో కుర్చీలు ఖాళీగా లేవని అమిత్ షా ఎద్దేవా చేశారు. అయితే అమిత్ షా వ్యాఖ్యలను కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రంగా తప్పుబట్టారు. ఏళ్ల తరబడి కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న ఎన్డీయే.. చొరబాట్లను ఎందుకు అరికట్టలేదని ప్రశ్నించారు.

4 వందేభారత్ రైళ్లను ప్రారంభించిన మోదీ

వారాణసీ/లక్నో, నవంబరు 8: అభివృద్ధి దిశగా దేశం దూసుకుపోతోందని ప్రధాని మోదీ తెలిపారు. ఉత్తరప్రదేశ్‌లోని వారాణసీలోని బనారస్ రైల్వే స్టేషన్‌లో శనివారం నాలుగు కొత్త వందే భారత్ రైళ్లను జెండా ఊపి ప్రారంభించారు. ఈ రైళ్లు బనారస్-ఖజురహో, లఖ్‌నవు-సహరాన్‌పూర్, ఫిరోజ్‌పూర్-ఢిల్లీ, ఎర్నాకుళం-బెంగళూరు మధ్య నడవనున్నాయి. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. వందేభారత్, నమోభారత్, అమృత్ భారత్ వంటి రైళ్లలో భారత రైల్వేలో నూతన తరానికి పునాదులు పడ్డాయన్నారు. మౌలిక సదుపాయాల కల్పన అంటే.. కేవలం భారీ ప్రాజెక్టుల నిర్మాణమే కాదని.. వాటి ద్వారా జరిగే పనులు కూడా ఆయా ప్రాంతాలను అభివృద్ధి చేస్తాయని తెలిపారు.

లోకం తీరు



బిహార్‌లో రోడ్డు పక్కన వీవీప్యాట్ స్లిప్పులు

సమస్తీపూర్, నవంబరు 8: బిహార్‌లోని సమస్తీపూర్ జిల్లాలో రోడ్డు పక్కన అధిక సంఖ్యలో వీవీప్యాట్ స్లిప్పులు చెల్లాచెదురుగా పడి ఉండడం కలకలం రేపింది. ఈ ఘటనపై తక్షణమే స్పందించిన ఎన్నికల సంఘం.. ఓ సహాయ రిటర్నింగ్ అధికారిని (ఏఆర్వో) సస్పెండ్ చేయడంతో పాటు ఆయనపై కేసు నమోదు చేసింది. సరైరంజన్ అసెంబ్లీ నియోజకవర్గంలోని ఓ కళాశాల సమీపంలో లభించిన ఈ స్లిప్పులు మాక్‌పోల్‌కు సంబంధించినవని ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ స్పష్టం చేశారు. వాస్తవ పోలింగ్ ప్రక్రియకు సంబంధించిన స్లిప్పులు సురక్షితంగా ఉన్నాయని, ఈ ఘటన వల్ల ఎన్నికల పవిత్రతకు ఎటువంటి భంగం వాటిల్లలేదని ఆయన తేల్చి చెప్పారు. రోడ్డు పక్కన వీవీప్యాట్ స్లిప్పులు చెల్లాచెదురుగా పడి ఉన్న వీడియో వైరల్ కావడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఈవీఎమ్‌లు, వీవీప్యాట్‌ల పనితీరురును పరీక్షించడానికి, ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇవ్వడానికి ప్రతి పోలింగ్ బూత్‌లో మాక్ పోల్స్ నిర్వహిస్తారు. మాక్ పోలింగ్ పూర్తయ్యాక, వీవీప్యాట్ స్లిప్పులను ప్రత్యేక కవర్లో సీలు చేసి సురక్షితంగా దాచాల్సి ఉంటుంది. ఈ విషయంలో నిర్లక్ష్యం వహించినందుకు గాను సంబంధిత అధికారిపై ఎన్నికల సంఘం కఠిన చర్యలు తీసుకుంది.

న్యూస్ పేపర్‌లో పిల్లలకు మధ్యాహ్న భోజనం!



న్యూస్ పేపర్లలో భోజనం చేస్తున్న విద్యార్థులు

- మధ్యప్రదేశ్‌లోని ఓ బడిలో ఘటన
- నా హృదయం ముక్కలైంది: రాహుల్

న్యూఢిల్లీ, నవంబరు 8: మధ్యప్రదేశ్‌లోని ఓ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులు న్యూస్ పేపర్ ముక్కల్లో మధ్యాహ్న భోజనం తింటున్న ఓ వీడియోను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఎక్స్‌లో షేర్ చేశారు. షియోపూర్ జిల్లా హల్పూర్ గ్రామంలోని ఓ మాధ్యమిక పాఠశాలలో ఈ ఘటన వెలుగుచూసింది. బడి కాంపౌండ్‌లో చెత్తాచెదారం మధ్య పిల్లలు వరుసగా కూర్చొని న్యూస్ పేపర్ ముక్కల్లో ఉన్న ఆహారాన్ని తింటున్నట్లుగా ఆ వీడియోలో ఉంది. ఈ వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. వీడియోలోని దృశ్యాలను చూసి తన హృదయం ముక్కలైందని రాహుల్ గాంధీ ఎక్స్ వేదికగా ఆవేదన వ్యక్తం చేశారు. దేశ భవిష్యత్తు అయిన ఏ పాపం ఎరుగని చిన్నారులకు కనీసం ప్లేట్లలో భోజనం చేసే గౌరవం కూడా దక్కకూడదా? అంటూ రాహుల్ హిందీలో ట్వీట్ చేశారు. మధ్యప్రదేశ్‌ను 20 ఏళ్లకు పైగా ఏలుతున్న బీజేపీ.. చిన్నారుల కంచాలను కూడా దొంగిలించిందని ఆరోపించారు. ఇలా చిన్నారుల భవిష్యత్తును నిర్దాక్షిణ్యంగా చిదిమేస్తున్నందుకు మధ్యప్రదేశ్ సీఎం, ప్రధాని మోదీ సిగ్గుపడాలి అని రాహుల్ మండిపడ్డారు. పీఎం పోషణ్ పథకం కింద ఓ స్వయం సహాయక బృందానికి హల్పూర్ పాఠశాలలో పిల్లలకు మధ్యాహ్న భోజనం వడ్డించే కాంట్రాక్టును అప్పగించారు. తాజా వీడియో నేపథ్యంలో జిల్లా కలెక్టర్, సదరు స్వయం సహాయక బృందాన్ని ఆ బాధ్యతల నుంచి తప్పిస్తున్నట్లు ప్రకటించారు. కాగా, మధ్యప్రదేశ్ ప్రభుత్వ అధికారులు శనివారం ఈ పాఠశాలకు స్టీల్ ప్లేట్లను పంపించారు.

మహారాష్ట్ర మంత్రుల మెడకు భూ కొనుగోళ్ల ఉచ్చు

- అక్రమాలపై విపక్షాల ధ్వజం

ముంబయి, నవంబరు 8: మహారాష్ట్రలో మంత్రులకు సంబంధం ఉన్న భూమి కొనుగోలు వ్యవహారాలు వెలుగులోకి రావడంతో రాజకీయాలు వేడెక్కాయి. ఇవి కేవలం కొనుగోళ్లు కావని, కుంభకోణాలంటూ ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్, రవాణా మంత్రి ప్రతాప్ సర్నాయక్‌లపై ఆరోపణలు వస్తున్నాయి. తొలుత పుణెలో అజిత్ పవార్ కుమారుడు పార్థ పవార్ 40 ఎకరాలు కొనుగోలు చేయడం వివాదాస్పదమయింది. విమర్శల నేపథ్యంలో సేల్ డీడ్‌ను రద్దు చేసుకున్నప్పటికీ 'డబుల్ స్టాంప్ డ్యూటీ' కింద ప్రభుత్వానికి రూ.42 కోట్లు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. సేల్ డీడ్‌ను రద్దు చేసుకున్నట్టు 'క్యాన్సిలేషన్ డీడ్'ను రాసుకుంటే ప్రభుత్వానికి రెట్టింపు స్టాంప్ డ్యూటీ చెల్లించాలన్న నిబంధన ఉండడంతో ఇంత భారీ మొత్తం చెల్లించాల్సి వస్తోంది. పార్థ పవార్ తన సమీప బంధువు దిగ్విజయ్ పాటిల్‌తో కలిసి ఏర్పాటు చేసిన అమదియా ఎంటర్‌ప్రైజెస్ తరఫున డాటా సెంటర్ నెలకొల్పడానికి పుణెలోని ముంధ్వా ప్రాంతంలో 40 ఎకరాలు కొనుగోలు చేశారు. ఆ స్థలానికి యజమానులైన 272 మంది శీతల్ తేజస్విని అనే మహిళకు పవర్ ఆఫ్ అటార్నీ ఇవ్వడంతో ఆమెతో ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. ఈ సేల్ డీడ్‌ను సబ్ రిజిస్ట్రార్ ఆర్.బి.తరు రిజిస్టర్ చేశారు. ఇది ప్రభుత్వ భూమి అని, రూ.1,800 కోట్లు విలువ చేసే భూమిని రూ.300 కోట్లకే కొనుగోలు చేశారంటూ ఆరోపణలు వచ్చాయి. పరిస్థితిని గమనించిన అజిత్ పవార్ అది ప్రభుత్వ భూమి అని తన కుమారుడికి తెలియదని శుక్రవారం చెప్పారు. సేల్ డీడ్‌ను రద్దు చేస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వభూమిని కొనుగోలు చేయడం, రిజిస్టర్ చేయడం అక్రమమని ఆరోపిస్తూ రిజిస్ట్రేషన్ ఇన్‌స్పెక్టర్ జనరల్ చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు దిగ్విజయ్ పాటిల్, శీతల్ తేజస్విని, సబ్ రిజిస్ట్రార్ తరులపై కేసు నమోదు చేశారు. మొత్తం వ్యవహారంపై సమగ్రంగా దర్యాప్తు జరిపించాలని ఎన్సీపీ (ఎస్పీ) నాయకుడు శరద్ పవార్ డిమాండు చేయడం గమనార్హం. రవాణా మంత్రి ప్రతాప్ సర్నాయక్ ముంబయిలోని మీరా భయాందర్‌లో రూ.200 కోట్లు విలువ చేసే నాలుగెకరాల భూమిని కేవలం రూ.3 కోట్లకు కొనుగోలు చేశారని కాంగ్రెస్ నేత విజయ్ వాడెట్టివార్ ఆరోపించారు. విద్యాసంస్థలు ఏర్పాటు చేయడానికి దాన్ని కొనుగోలు చేశారని విమర్శించారు. ఈ ఆరోపణలను మంత్రి ఖండించారు.

కలయా.. నిజమా!

- బెజవాడలో మ్యూజిక్ మ్యాస్ట్రో 'లయ' విన్యాసం
- ఏపీలో తొలిసారిగా ఇళయరాజా మ్యూజిక్ కాన్సర్ట్
- అలరించిన ప్రఖ్యాత సంగీత దర్శకుడి షో
- ఉర్రూతలూగించిన ప్రముఖ గాయకుల పాటలు
- 40వేల మంది వీక్షకులతో ఐజీఎంసీ స్టేడియం కిటకిట



హాజరైన సంగీత ప్రియులు, పాట పాడుతున్న ఇళయరాజా

విజయవాడ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా విజయవాడలో ప్రముఖ సంగీత దర్శకుడు మ్యాస్ట్రో ఇళయరాజా మ్యూజిక్ కాన్సర్ట్ ఉర్రూతలూగించింది. దేశంలోనే ప్రసిద్ధ సంగీత దర్శకులలో ఒకరైన ఇళయరాజాకు విజయవాడ సాదర స్వాగతం పలికింది. ఇళయరాజా ఆరాధకులు, ఆయన సంగీతాన్ని ఇష్టపడేవారు.. విజయవాడలో నిర్వహించిన మ్యూజిక్ కాన్సర్ట్‌కు తరలివచ్చారు. అశేష సంఖ్యలో వచ్చిన ప్రేక్షకులతో ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియం కిటకిటలాడిపోయింది. ఇళయరాజా సారథ్యంలో నిర్వహించిన సంగీత కచేరీ ఆద్యంతం ఉర్రూతలూగించింది. ఇళయరాజా హార్మోనియం పరిచయంతో అమ్మవారిని కీర్తిస్తూ తన మాతృభాషలో భక్తిపాట వినిపించారు. ఆ తర్వాత 'జగదానందకారక' పాటతో ఆరంభమైన షో ఏకబిగిన దాదాపుగా మూడున్నర గంటలపాటు సాగింది. వర్ధమాన గాయనీ గాయకులు ఎన్నో మధురమైన పాటలతో అలరించారు. 'సిరిమల్లె పూవా.. సిరిమల్లెపూవా', 'కల యా.. నిజమా', 'ఎన్నోరాత్రులొస్తాయిగానీ', 'ఓ ప్రియా ప్రియా', 'లలిత ప్రియాకమలం', 'కరిగిపోయాను కర్పూర వీణలా', 'జాబిల్లి కోసం ఆకాశమల్లే' వంటి అనేక మెలోడీ హిట్ సాంగ్స్‌ను గాయనీ గాయకులు ఆలపించారు. ప్రముఖ గాయకులు ఎస్పీబీ చరణ్, హరిచరణ్, శ్యామ్ అద్భుతగానం చేశారు. ప్లేబ్యాక్ సింగర్స్ మధు బాలకృష్ణ, ప్రియా హిమేష్, జితిన్ రాజ్, సుర్ముఖి, సారథ్ సంతోష్, అనితలతో పాటు సహాయ గాయకులు తమ గాత్రమాధుర్యంతో వీక్షకులను కట్టిపడేశారు.

నా జీవితం సంగీతం!

కాన్సర్ట్ మధ్యలో ఇళయరాజా.. 'నా జీవితం సంగీతం' అని చెప్పగానే చప్పట్లు మార్మోగాయి. ఒక పాటను విడివిడిగా విడదీస్తే సంగీతం ఎలా ఉంటుందో చూపించారు. ఒక పాటకు సంబంధించి ఒక్కో సంగీత పరికరం వాయిద్యం ఎలా ఉంటుంది? వివిధ సంగీత పరికరాలు కలిస్తే సంగీతం ఎలా ఉంటుంది? పాట తోడైతే ఎలా ఉంటుంది? అన్నీ కలిస్తే పాట ఎంత హృద్యంగా వస్తుందో చూపించారు. ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా 40 వేల మందికి పైగా విజయవాడ ప్రజలు బుక్‌మై షోలో బుక్ చేసుకుని మరీ చూశారు. డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, హోంమంత్రి అనిత , విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే బొండా ఉమా, సినీ దర్శకుడు వంశీ తదితర ప్రముఖులు వీక్షించారు. కార్యక్రమం ముగింపులో బాణసంచా వెలుగుజిలుగులు అబ్బురపరిచాయి.

యూట్యూబ్ చూసి అత్తను చంపిన కోడలు

- దొంగా పోలీస్ ఆటంటూ పెట్రోల్ పోసి హత్య
- అగ్నిప్రమాదమని ఇరుగుపొరుగును నమ్మించే ప్రయత్నం.. విశాఖ జిల్లాలో ఘోరం

పెందుర్తి (విశాఖపట్నం), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తన అత్త చాదస్తంతో వేధిస్తోందని భావించిన ఓ కోడలు.. అత్తను చంపేయాలని నిర్ణయించుకుంది. హత్య చేసి తప్పించుకోవడం ఎలా? అని యూట్యూబ్‌లో వీడియోలు చూసి పక్కా ప్లాన్ వేసింది. అనుకున్నట్లే ప్లాన్ అమలు చేసి అత్తను హత్య చేసింది. కానీ, చివరకు పోలీసుల విచారణలో దొరికిపోయింది. విశాఖపట్నం జిల్లా పెందుర్తి పోలీసులు శనివారం ఆమెను అరెస్టు చేశారు. ఈ దారుణం వివరాలను ఏసీపీ పృథ్వీతేజ, సీఐ సతీశ్‌కుమార్ వెల్లడించారు. పెందుర్తి మండలం వేపగుంట అప్పన్నపాలెంలోని వర్షిణి అపార్టుమెంట్‌లో జయంతి సుబ్రహ్మణ్యం, భార్య లలితాదేవి (30), కుమారుడు ఈశ్వరచంద్ర(10), కుమార్తె శ్రీనయన(8), తల్లి కనకమహాలక్ష్మి(63) నివాసం ఉంటున్నారు. సుబ్రహ్మణ్యం పౌరోహిత్యంతో కుటుంబాన్ని పోషిస్తున్నారు. శుక్రవారం రాత్రి పౌరోహిత్యం పనిపై బయటకు వెళ్లినపుడు సుబ్రహ్మణ్యానికి పొరుగు ఫ్లాట్‌లోని వారు ఫోన్ చేసి 'మీ ఇంటిలో అగ్నిప్రమాదం సంభవించింది. తల్లి కనకమహాలక్ష్మి మరణించారు. కుమార్తె గాయపడడంతో ఆస్పత్రిలో చేర్పించాం' అంటూ చెప్పారు. ఈ సమాచారం తెలిసి సీఐ సతీశ్‌కుమార్ కూడా సంఘటనా స్థలానికి చేరు కుని కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. ఫ్లాట్‌లో పెట్రోల్ వాసన రావడంతో హత్య కోణంలో అనుమానం బలపడింది. వెంటనే కోడలు లలితాదేవి సెల్‌ఫోన్‌ను పరిశీలించారు. ఆమె యూట్యూబ్‌లో చూసిన వీడియోల్లో హత్య చేసి ఏమార్చడం ఎలా?.. అన్న వీడియోలు ఎక్కువగా ఉన్నట్టు గుర్తించారు. ఇదే సమయంలో భార్య ప్రవర్తనపైనా పోలీసుల వద్ద సుబ్రహ్మణ్యం అనుమానం వ్యక్తంచేశాడు. దీంతో వారు పోలీసులు లలితాదేవిని తమదైన శైలిలో విచారించడంతో నేరాన్ని అంగీకరించింది. చాదస్తంతో సూటిపోటి మాటలతో వేధిస్తుండడంతో ఈ దారుణానికి ఒడిగట్టినట్లు తెలిపింది.



నిందితురాలు లలితాదేవి



జయంతి కనకమహాలక్ష్మి

దొంగ, పోలీస్ ఆట అని నమ్మించి

అత్తను హత్య చేయడానికి లలితాదేవి ముందస్తు పథకం ప్రకారం ఓ బంక్‌లో పెట్రోలు కొనుగోలు చేసి ఇంటిలో దాచింది. శుక్రవారం తన భర్త బయటకు వెళ్లాక పిల్లలతో దొంగ.. పోలీస్ ఆడాలని అత్తకు చెప్పి సహకరించాలని కోరింది. ఆటలో భాగంగా పిల్లలు వేరే గదిలో దాక్కోగానే, వాలు కుర్చీలో కూర్చుని ఉన్న అత్త కళ్లకు చున్నీతో గంతలు కట్టి, ఆ తరువాత కాళ్లు, చేతులను తాళ్లతో కట్టేసింది. దాచి ఉంచిన పెట్రోల్‌ను అత్తపై పోసి నిప్పంటించింది. క్షణాల్లో మంటలు వ్యాపించి కనకమహాలక్ష్మి సజీవ దహనమైంది. నానమ్మ కేకలు విని బయటకు వచ్చిన శ్రీనయన మంటలు అంటుకుని గాయపడింది. ఈ ఘోరాన్ని ప్రమాదంగా చిత్రీకరించేందుకు లలితాదేవి ఇంటి నుంచి బయటకు వచ్చి అగ్నిప్రమాదం సంభవించిందని, టీవీ పేలి పెద్దశబ్దం వచ్చిందని గగ్గోలు పెడుతూ రక్షించండంటూ ఇరుగుపొరుగు వారి ముందు నాటకం ఆడింది. వారు వచ్చి చూసి అగ్నిప్రమాదంగానే భావించి సుబ్రహ్మణ్యానికి ఫోన్ చేసి చెప్పారు. ఈ ఘటనకు సంబంధించి సుబ్రహ్మణ్యం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు లలితాదేవిని అరెస్టు చేశారు.

12 ఏళ్ల చిన్నారికి 35 ఏళ్ల వ్యక్తి గుండె

- బ్రెయిన్‌డెడ్ అయిన వ్యక్తి కుటుంబ సభ్యుల ఔదార్యం
- గ్రీన్ చానల్ ద్వారా గుంటూరు నుంచి తరలింపు
- తిరుపతిలో శస్త్రచికిత్స ప్రారంభం

తిరుపతి(వైద్యం), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఓవైపు గుంటూరులో బ్రెయిన్‌డెడ్ అయిన వ్యక్తి కుటుంబంలో అంతులేని శోకం.. మరోవైపు తిరుపతిలో ఇంకా ఈ లోకం ఎరుగని ఓ చిన్నారికి గుండె మార్పిడి చికిత్స కోసం ఎదురు చూపు.. ఈ రెండింటి మధ్య జరిగిన ఉద్వేగభరితమైన క్షణాలు అందరినీ పరుగులు పెట్టించింది. గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న 12 ఏళ్ల బాలుడికి 35 ఏళ్ల వ్యక్తి గుండెను అమర్చే శస్త్రచికిత్స శనివారం రాత్రి తిరుపతిలో చేపట్టారు. బ్రెయిన్‌డెడ్ అయిన వ్యక్తి కుటుంబ సభ్యులు తీరని శోకంలో ఉన్నప్పటికీ.. బాలుడి పట్ల వారి ఔదార్యంతో ఇది సాధ్యమైంది. వివరాలిలా ఉన్నాయి. గుంటూరుకు చెందిన అబ్రహం(35) రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఆయన్ను పరీక్షించిన గుంటూరులోని రమేష్ ఆస్పత్రి వైద్యులు బ్రెయిన్ డెడ్‌కు గురైనట్లు నిర్ధారించారు. బాధితుడి కుటుంబ సభ్యులకు వివరించి అవయవదానంపై అవగాహన కల్పించగా, వారు అంగీకరించారు. వెంటనే ఆస్పత్రి నిర్వాహకులు ఆ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. కర్నూలు జిల్లా నందికొట్కూరుకు చెందిన 12 ఏళ్ల బాలుడు కొంత కాలంగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ రెండు వారాలుగా తిరుపతిలోని శ్రీపద్మావతి హృదయాలయ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాలుడికి గుండె మార్పిడి శస్త్ర చికిత్స చేయాలని వైద్యులు నిర్ధారించి అతడి వివరాలను జీవన్‌ధాన్ పోర్టల్‌లో నమోదు చేశారు. అబ్రహం గుండెను దానం చేయడానికి సిద్ధంగా ఉన్నారన్న విషయం తెలుసుకున్న హృదయాలయ డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తన బృందంతో కలిసి గుంటూరుకు చేరుకున్నారు. అక్కడ బ్రెయిన్‌డెడ్‌కు గురైన అబ్రహం నుంచి గుండెను సేకరించారు. అంబులెన్సులో గ్రీన్ చానల్ ద్వారా గన్నవరం ఎయిర్‌పోర్టుకు, అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో శనివారం సాయంత్రం 7.50 గంటలకు బయల్దేరి 9.30 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడ్నుంచి ప్రత్యేక అంబులెన్సులో గ్రీన్‌చానల్ ద్వారా 9.50 గంటలకు శ్రీపద్మావతి హృదయాలయ ఆస్పత్రికి తీసుకువచ్చారు. ఆ గుండెను ఆపరేషన్ థియేటర్‌లోకి గుండె మార్పిడి శస్త్ర చికిత్స ప్రారంభించారు.

సేవింగ్స్‌కు సూపర్ మస్కా

(మొదటి పేజీ తరువాయి)

మీటింగులూ, రూ.కోట్ల ఖర్చు, నెల రోజుల సంబరాలూ సామాన్యులకు సూపర్ జీఎస్టీ ప్రయోజనాలు కల్పించడంలో విఫలమయ్యాయి. సూపర్ జీఎస్టీ అమల్లోకి వచ్చినా సేవింగ్స్ మాత్రం కనపడడం లేదు. ప్రజలు ప్రతి రోజు ఉపయోగించే మందులు, నిత్యావసరాలపై తగ్గిన పన్ను ప్రయోజనాలు రిటైల్ మార్కెట్లోనే ఆగిపోతున్నాయి. ముఖ్యంగా మెడికల్ షాపుల్లో దోపిడీ ఎక్కువగా ఉంది. రాష్ట్రవ్యాప్తంగా ఒకటి, రెండు చోట్ల మినహాయిస్తే ఎక్కడా కూడా పాత, కొత్త ధరల బోర్డులు లేవు. ఎలక్ట్రానిక్స్, కార్లు, బైకుల షోరూములు, డీమార్ట్, మోర్, రిలయన్స్ లాంటి జాతీయస్థాయి సూపర్‌మార్కెట్లలో తప్ప ఎక్కడా.. జీఎస్టీ తగ్గింపు రేట్లు ప్రజలకు అందడం లేదు.

తగ్గని మందుల ధరలు

రాష్ట్రవ్యాప్తంగా ఆస్పత్రులకు అనుబంధంగా ఉన్న మెడికల్ షాపుల్లో తగ్గిన జీఎస్టీ రేట్లు అమలు కావడం లేదు. వైద్యుడు రాసిన ఈ మందులకు జీఎస్టీ తగ్గింపు వర్తించదని చెప్తున్నారు. బయటి మెడికల్ షాపులవాళ్లు ఇప్పటికే 20 శాతం డిస్కౌంట్ ఇస్తున్నామని చెప్తున్నారే తప్ప రేట్లు తగ్గించడం లేదు. జీఎస్టీ సంస్కరణల్లో భాగంగా.. క్యాన్సర్, జన్యుసంబంధిత, అరుదైన వ్యాధులు, గుండె జబ్బులకు వినియోగించే 36 ప్రాణాధార ఔషధాలపై పన్ను పూర్తిగా తొలగించారు. వైద్యం కోసం ఉపయోగించే బ్యాండేజ్, డయాగ్నోస్టిక్ కిట్లు, గ్లూకోమీటర్లపై పన్ను 12 శాతం నుంచి 5 శాతానికి తగ్గింది. మరెన్నో ఔషధాలు, వైద్య పరికరాల పన్నులు తగ్గించారు. దేశంలో వైద్యసేవల ఖర్చును తగ్గించేందుకు ప్రభుత్వం ఈ చర్యలు తీసుకుంది. కానీ, ఆస్పత్రి బిల్లుల్లోగానీ, మందుల బిల్లుల్లో గానీ తగ్గింపు కనిపించడం లేదు. అయినప్పటికీ రాష్ట్రవ్యాప్తంగా ఏ ఒక్కచోట కూడా ప్రభుత్వం వైపు నుంచి ఆకస్మిక తనిఖీలుగానీ, విజిలెన్స్ దాడులుగానీ జరగకపోవడం ఆశ్చర్యకరం.

పాత ధరలకే అమ్మకాలు

రాష్ట్రవ్యాప్తంగా పేరుమోసిన పెద్దపెద్ద సూపర్ మార్కెట్లలో మాత్రమే జీఎస్టీ తగ్గింపు అమలవుతోంది. కానీ, ఇక్కడ కొనే వారెంతమంది? కేవలం సిటీల్లో మాత్రమే అవి అందుబాటులో ఉంటాయి. మిగతావాళ్లంతా కిరాణా షాపుల్లో కొనుక్కుంటారు. కిరాణా వ్యాపారులు పాతస్టాక్.... పాత ధరలకే హోల్‌సేల్‌గా కొన్నామంటూ ధరలు తగ్గించడం లేదు. లేదా పరిమాణం పెంచామంటూ చెబుతున్నారు. పాలు, ఆహారపదార్థాలు, నిత్యావసరాల్లో ఏ వస్తువుపై ఎంత జీఎస్టీ తగ్గిందన్న ఒక్క బోర్డు కూడా ఎక్కడా కనిపించడం లేదు. దుకాణదారులు చెప్పిందే రేటు. నిత్యావసరాలకు సంబంధించి రిటైల్ మార్కెట్లో జీఎస్టీ తగ్గింపు అమలు కావడం లేదు. ఉదాహరణకు విజయవాడలో 250 ఎంఎల్ కూల్‌డ్రింక్ ధర గతంలో రూ.20 ఉండేది. జీఎస్టీ తగ్గింపు వల్ల దీని ధర రూ.18కి తగ్గింది. ఎమ్మార్పీ రూ.18 అని ఉన్నప్పటికీ కూడా రిటైలర్లు రూ.20కే విక్రయిస్తున్నారు. లీటర్ వాటర్ బాటిల్ ధర రూ.13.36కి తగ్గింది. కానీ, రిటైల్ మార్కెట్లో ఇంకా రూ.20కే విక్రయిస్తున్నారు. ఇలాంటివి కోకొల్లలు. స్టేషనరీ, వస్త్రాలు, పాదరక్షలు బయట షాపుల్లో అయినా, ఆన్‌లైన్‌లో అయినా ధరలు తగ్గించడం లేదు. షాపుల వద్ద గానీ, ఆన్‌లైన్ పోర్టల్స్‌లో గానీ పాత, కొత్త ధరల బోర్డులు కనిపించడం లేదు. ఎవరైనా అడిగితే పండగ ఆఫర్లు అమల్లో ఉన్నాయి.. ప్రత్యేక డిస్కౌంటు ఇస్తున్నాం.. మొత్తం బిల్లుపై 5 శాతం తగ్గిస్తున్నామంటూ చెబుతున్నారు. జీఎస్టీ 2.0 రాకముందు ఉన్న స్టాక్‌పై సవరించిన ఎమ్మార్పీని స్టాంపింగ్, స్టిక్కర్, ఆన్‌లైన్ ప్రింటింగ్ ద్వారా మార్చుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. కానీ, ఇవి ఎక్కడా సక్రమంగా అమలు కావడం లేదు.

ప్రభుత్వానికీ, ప్రజలకూ నష్టమే


ప్రజలు నిత్యం వాడే ఎఫ్ఎంసీజీ ఉత్పత్తులైన టూత్‌బ్రష్, టూత్‌పేస్ట్, సబ్బులు, షాంపూలు, తలనూనెలు, టాల్కమ్ పౌడర్, షేవింగ్ క్రీమ్‌తోపాటు, నెయ్యి, పన్నీరు, బటర్, నమ్కీన్, కెచప్, డ్రైఫ్రూట్స్, కాఫీ పౌడర్‌లను పాత ధరలకే రిటైలర్లు విక్రయిస్తున్నారు. చట్టప్రకారం ప్రజలకు అందాల్సిన ప్రయోజనాలు అందకపోయినప్పటికీ ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో అర్థం కావడం లేదు. జీఎస్టీ ప్రయోజనాలు కొనుగోలుదారులకు దక్కుతున్నాయా లేదా అని తెలుసుకొనే వ్యవస్థలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ వ్యవస్థలు ఏమైనా ఉన్నాయా అనే దానిపై స్పష్టత లేదు.

జీఎస్టీ మోసాలపై ఫిర్యాదులకు..

జీఎస్టీ మోసాలపై ఫిర్యాదులను టోల్‌ఫ్రీ నంబర్ 1915 ద్వారా తెలియజేయొచ్చు. 17 భాషల్లో ఈ అవకాశం ఉంది. పోర్టల్‌లో యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ సృష్టించుకుని ఫిర్యాదు నమోదు చేసే అవకాశం ఉంది. ఇందులో వినియోగదారులు తమ ఫిర్యాదులకు సంబంధించిన పత్రాలను కూడా అప్‌లోడ్ చేయవచ్చు. 88000 01915 నంబరుకు ఎస్ఎంఎస్ పంపిస్తే వినియోగదారులను హెల్ప్‌లైన్ వారు సంప్రదిస్తారు. ఇదే నంబర్‌కు వాట్సప్ ద్వారా కూడా సమాచారం పంపించొచ్చు. ఉమంగ్ యాప్, ఎన్‌సీహెచ్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయొచ్చు. జీఎస్టీ సంస్కరణల తర్వాత అక్టోబరు మొదటివారం వరకు జాతీయ వినియోగదారుల హెల్ప్‌లైన్‌కు 3981 మంది ఫిర్యాదు చేశారు. అత్యధికంగా పాలరేట్లు తగ్గలేదంటూ ఫిర్యాదులు వచ్చాయి.



అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలో కురుబలతో కలిసి ర్యాలీలో పాల్గొన్న మంత్రి లోకేశ్



లోకేశ్ ఆవిష్కరించిన భక్త కనకదాస కాంస్య విగ్రహం

వైసీపీ పాలనలో చీకటి రాజ్యం

(మొదటి పేజీ తరువాయి)

వివరించారు. భక్త కనకదాస 538వ జయంతిని పురస్కరించుకుని అనంతపురం జిల్లా కల్యాణదుర్గం ప్రధాన కూడలిలో ఏర్పాటుచేసిన తొమ్మిది అడుగుల విగ్రహావిష్కరణ కార్యక్రమంలో లోకేశ్ పాల్గొన్నారు. ఈ విగ్రహాన్ని స్థానిక ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ, కనకదాస తన గొప్ప పాటలతో శ్రీకృష్ణుడిని తన వైపు తిప్పుకున్నారని, అహంకారాన్ని వీడితే మోక్షం లభిస్తుందనే గొప్ప సూక్తిని చాటారని శ్లాఘించారు. యువగళం పాదయాత్రలో కురుబలకిచ్చిన హామీ మేరకు భక్త కనకదాస జయంతిని అధికారికంగా రాష్ట్ర పండగగా నిర్వహిస్తున్నామని లోకేశ్ అన్నారు. పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు బీరప్ప దేవాలయాలను టీటీడీ సహకారంతో నిర్మిస్తామని, ఆ దేవాలయాల (గుడికట్ల) పూజారులకు త్వరలోనే గౌరవ వేతనం అందజేస్తామని తెలిపారు. తెలుగుదేశం పార్టీ అంటేనే బీసీల పార్టీ అని, వారిని అన్ని విధాలుగా బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. కురబ సోదరులను మరువబోమని, గుండెల్లో పెట్టుకొని చూసుకుంటామన్నారు. "కురబలకు రాజకీయ, ఆర్థిక స్వాతంత్ర్యం టీడీపీతోనే వచ్చింది. కురుబ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి, ఆ వర్గాల అభ్యున్నతికి పనిచేశాం. దాదాపు రూ.300 కోట్లు వారికోసం ఖర్చుచేశాం. గొర్రెల కొనుగోలుకు సబ్సిడీ రుణాలు, బీమా అందించాం. 50 శాతం సబ్సిడీతో రూ.4 లక్షల వరకూ రుణ సౌకర్యం కల్పించాం. ఈ వర్గానికి చెందిన మంత్రి సవిత తండ్రి రామచంద్రారెడ్డి ఉమ్మడి రాష్ట్రంలో 14 శాఖలు నిర్వహించారు. ఆయన ఎంపీగానూ పనిచేశారు. మరో కురబ నేత బీకే పార్థసారథి ఎంపీగానే కాకుండా ఎమ్మెల్యేగా కూడా పనిచేశారు. కురబ సాధికార సమితి రాష్ట్ర సభ్యులు నాగరాజు కర్నూలు ఎంపీగా, బత్తిన వెంకటరాముడు జడ్పీ చైర్మన్‌గా పనిచేశారు. మార్కెట్ యార్డ్ చైర్మన్లుగా, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులుగా ఎంతో మంది కురుబలకు స్థానం కల్పించిన పార్టీ టీడీపీ." అని లోకేశ్ తెలిపారు. కురబ సోదరుల కోసం కమ్యూనిటీ భవనాలను ఏడాదిలోపు పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామని మంత్రి హామీ ఇచ్చారు.



బిహార్ చాంబర్ ఆఫ్ కామర్స్ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి లోకేశ్

రాష్ట్రాలు బలపడితేనే దేశాభివృద్ధి

- బిహార్ పారిశ్రామికవేత్తలు, చాంబర్ ఆఫ్ కామర్స్ సమావేశాల్లో మంత్రి లోకేశ్

అమరావతి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాలు బలోపేతమైతేనే దేశం కూడా అభివృద్ధి సాధిస్తుందని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. బిహార్ ఎన్నికల్లో ఎన్డీయే తరపున ప్రచారం నిర్వహించేందుకు ఆయన శనివారం మధ్యాహ్నం అనంతపురం జిల్లా కల్యాణదుర్గం పర్యటన ముగించుకుని పట్నా పర్యటనకు వెళ్లారు. బిహార్ ఇండస్ట్రీస్ అసోసియేషన్, ఆ రాష్ట్ర చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. ఎన్డీయేను గెలిపించాల్సిన ఆవశ్యకతను వారికి వివరించారు. ఆయా సమావేశాల్లో లోకేశ్ మాట్లాడుతూ... దేశ ప్రజలు ప్రధానిగా సరైన సమయంలో సరైన నేతను ఎన్నుకున్నారని, దీంతో గత పదేళ్లుగా భారత్ అనూహ్యంగా అభివృద్ధి చెందిందని తెలిపారు. బిహార్ కూడా నితీశ్‌కుమార్‌కు ముందు, తర్వాత అన్న విధంగా అభివృద్ధి సాధించిందని పేర్కొన్నారు. సమర్థ నేత వల్లే బిహార్ అభివృద్ధి సాధిస్తోందని తెలిపారు. కాగా, ఆదివారం ఉదయం 10 గంటలకు పట్నాలో ఎన్డీఏకి మద్దతుగా లోకేశ్ విలేకరుల సమావేశం నిర్వహిస్తారు. మధ్యాహ్నం అక్కడినుంచి బయలుదేరి విజయవాడ చేరుకుంటారు.

తిరుమలలో భక్త కనకదాస పీఠం

రెండెకరాల్లో ఏర్పాటుకు లోకేశ్ కృషి.. మంత్రి సవిత

పెనుకొండ టౌన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కురుబల ఆరాధ్య దైవం భక్త కనకదాస పీఠాన్ని తిరుమలలో ఏర్పాటు చేస్తామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ పట్టణంలో నిర్వహించిన కనకదాస 538వ జయంతి వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. కనకదాస విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తిరుమలలో రెండెకరాల్లో భక్తకనకదాస పీఠం ఏర్పాటుకు సీఎం చంద్రబాబు, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుతో మంత్రి లోకేశ్ చర్చించారని తెలిపారు. కురుబలకు, బీసీలకు ఆదరణ-3 లబ్ధి త్వరలో చేకూరుతుందని తెలిపారు.

వైసీపీ అంతరించిపోతున్న పార్టీ

- అవాస్తవాలతో మరింత నీచానికి దిగజారుతోంది
- తల్లి, చెల్లి కన్నా జగన్‌కు ఆస్తులే ముఖ్యం: బీజేపీ ఎమ్మెల్యే ఆది

అమరావతి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): అంతరించిపోతున్న వైసీపీ అవాస్తవాలతో మరింత నీచానికి దిగజారుతోందని బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'తల్లీ, చెల్లిని ఆస్తుల కోసం కోర్టుకు లాగిన స్వార్థపరుడు జగన్. ఇటువంటి వ్యక్తి నాయకత్వంలోని వైసీపీ అంతరించి పోవడం ఖాయం' అని ఆదినారాయణరెడ్డి వ్యాఖ్యానించారు.

పెండింగ్ ప్రాజెక్టుల పూర్తిపై దృష్టి పెట్టండి

- లింక్ ప్రాజెక్టులతో ఉపయోగం లేదంటున్నా డీపీఆర్‌ల పేరుతో హడావిడి అవినీతికి స్కెచ్: షర్మిల

అమరావతి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): 'పనికిరాని ప్రాజెక్టుకు డీపీఆర్‌ల మీద, నిధుల సమీకరణ మీద పెట్టే దృష్టి పెండింగ్‌లో ఉన్న 56 ప్రాజెక్టులను పూర్తి చేయడంపై కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టడం లేదు' అని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. ఈ మేరకు ఆమె శనివారం ఓ ప్రకటన చేశారు. 'నిన్న బనకచర్ల, నేడు నల్లమల సాగర్. పోలవరం లింక్ ప్రాజెక్టుకు అనుమతులు రాకున్నా... చంద్రబాబు ఆశమాత్రం చావలేదు. అనుసంధానంపై ఉన్న శ్రద్ధ పోలవరం పూర్తి చేయడంపై లేదు. పెండింగ్ ప్రాజెక్టులను గాలికి వదిలేసి లింక్ ప్రాజెక్టును పట్టుకుని తిరుగుతున్నారు. పోలవరంతో సహా 56 ప్రాజెక్టులను పూర్తి చేయడానికి నిధులు లేవుకానీ... రూ.58 వేల కోట్లతో పోలవరం - నల్లమల సాగర్ లింక్ కడతారంట. ఇది భారీ అవినీతికి స్కెచ్ కాకపోతే మరేంటి? లింక్ ప్రాజెక్టుతో ఉపయోగం లేదని జల వనరుల నిపుణులు మొత్తుకుంటున్నా డీపీఆర్‌ల పేరిట హడావిడి ఎందుకు?' అని షర్మిల ప్రశ్నించారు.

యాపిల్ గ్లోబల్ సప్లై చైన్‌లోకి ఆంధ్ర

- దానికి గేట్ వేగా మారిన కుప్పం
- యువత భవిష్యత్ నాశనం చేయడమే జగన్ లక్ష్యం: పంచుమర్తి

అమరావతి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): జగన్ పాలనలో రాష్ట్రం అధోగతి పాలయిందని ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ విమర్శించారు. 'ఈ రోజు రాష్ట్ర చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన రోజు. అమెరికా దిగ్గజం యాపిల్ కోసం ఐఫోన్ చాసిస్‌కు అవసరమైన హై-గ్రేడ్ అల్యూమినియం ఇక నుంచి కుప్పం నుంచే సరఫరా అవుతుంది. హిండాల్కో రూ.586 కోట్ల పెట్టుబడితో కుప్పంలో పరిశ్రమ ఏర్పాటు చేస్తోంది. దీని ద్వారా 613 ప్రత్యక్ష ఉద్యోగాలతోపాటు లాజిస్టిక్స్, సేవలు, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో వేలాది అనుబంధ ఉపాధి అవకాశాలు వస్తాయి. ఆంధ్రప్రదేశ్‌ను యాపిల్ గ్లోబల్ సప్లై చైన్‌లోకి లాగే గేట్ వేగా కుప్పం మారింది. చంద్రబాబు, లోకేశ్ కష్టపడి పరిశ్రమలు తీసుకొస్తుంటే సిగ్గులేకుండా జగన్ రెడ్డి దొంగ మెయిల్స్ పంపి అభివృద్ధిని అడ్డుకుంటున్నాడు. రాష్ట్ర యువత భవిష్యత్తును నాశనం చేయడమే జగన్ లక్ష్యం. జగన్ వలన పిల్లలు చెడిపోతున్నారు. తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలి' అని పంచుమర్తి సూచించారు.

పోలీసులను గూండాలంటారా?: పట్టాభిరామ్

హిందూపురం, మడకశిర టౌన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): 'రోడ్లపైకి వచ్చి వైసీపీ నాయకులు అరాచకాలు చేస్తున్నారు. అడ్డుకుంటున్న పోలీసులను ఆ పార్టీ నాయకులు గూండాలు, రౌడీలు అనడం సమంజసం కాదు' అని రాష్ట్ర స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్ అన్నారు. శ్రీసత్యసాయి జిల్లా హిందూపురంలో శనివారం ఆయన పర్యటించారు. మోతుకపల్లివద్ద పాత డంపింగ్ యార్డ్, గుడ్డంపల్లివద్ద డంపింగ్ యార్డ్‌ను పరిశీలించారు. పాత డంపింగ్ యార్డ్‌ను వెంటనే శుభ్రం చేసి పార్కుగా మార్చాలని, దానికి ఎన్టీఆర్ పేరు పెట్టాలని అధికారులకు సూచించారు.

పెనమలూరు ఇన్‌స్పెక్టర్‌కు కోర్టు నోటీసులు

- మరో ఇద్దరు ఎస్ఐలకు కూడా..
- తనను కొట్టారని న్యాయాధికారికి చెప్పిన భాస్కర్‌రెడ్డి

విజయవాడ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కృష్ణా జిల్లా పెనమలూరు ఇన్‌స్పెక్టర్ జె.వెంకటరమణ, ఎస్ఐలు రమేశ్, శివప్రసాద్‌లకు విజయవాడ రెండో అదనపు జ్యుడిషియల్ కోర్టు న్యాయాధికారి రాధిక షోకాజ్ నోటీసులు జారీ చేశారు. సామాజిక మాధ్యమాల్లో అసభ్యంగా పోస్టింగ్‌లు పెట్టిన కేసులో పెనమలూరు మండలం చోడవరం గ్రామానికి చెందిన మాలేటి భాస్కర్‌రెడ్డిని పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అతడిని శుక్రవారం రాత్రి కోర్టులో హాజరుపరిచారు. ఈ సందర్భంగా పోలీసులపై న్యాయాధికారికి భాస్కర్‌రెడ్డి ఫిర్యాదు చేశాడు. స్టేషన్‌లో సిబ్బందిని మొత్తం బయటకు పంపేసి ఇన్‌స్పెక్టర్, ఎస్ఐలు ఇష్టానుసారంగా కొట్టారని చెప్పాడు. దీంతో న్యాయాధికారి వారిద్దరికీ నోటీసులు జారీ చేశారు.



కుప్పంలో ఏర్పాటు చేస్తున్న పలు పరిశ్రమలకు వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తున్న సీఎం చంద్రబాబు

కుప్పానికి పారిశ్రామిక కళ

నియోజకవర్గానికి ఏడు పరిశ్రమలు

- రూ.2,203.5 కోట్ల పెట్టుబడులు
- వర్చువల్ శంకుస్థాపనలో సీఎం వెల్లడి

కుప్పం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా కుప్పంలో పారిశ్రామిక విప్లవానికి నాంది పలుకుతున్నామని సీఎం చంద్రబాబు అన్నారు. రూ.2,203.5 కోట్ల పెట్టుబడులతో అక్కడ ఏర్పాటవుతున్న7 పరిశ్రమలకు శనివారం ఆయన అమరావతి నుంచి వర్చువల్‌గా శంకుస్థాపన చేశా రు. కుప్పంలోని 4 మండలాల పరిధిలో ఏర్పాటు కానున్న ఈ పరిశ్రమలకోసం ప్రభుత్వం 241 ఎకరాల భూమిని కేటాయించింది. డెయిరీ, ల్యాప్‌టాప్, మొబైల్ ఏక్సెసరీస్, వంట నూనెల తయారీ, ఫుడ్ ప్రాసెసింగ్, ఎలక్ట్రిక్ వాహనాల ఉత్పత్తి రంగాల్లో ఉన్న హిండాల్కో, శ్రీజ డెయిరీ, ఏస్ ఇంటర్నేషనల్, ఎస్వీఎఫ్ సోయా, మదర్ డెయిరీ, ఈ రాయిస్, అలీప్ పరిశ్రమలు కుప్పంలో ఏర్పాటు చేయడానికి సీఎం శ్రీకారం చుట్టారు. అంతేకాక రూ.6,339 కోట్ల పెట్టుబడితో కుప్పానికి త్వరలోనే మరో ఎనిమిది పరిశ్రమలు రానున్నాయని, వీటి ద్వారా ఏకంగా 43 వేలమందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని సీఎం చెప్పారు. కుప్పంలో ఎయిర్ పోర్టు నిర్మాణానికి కొందరు అడ్డుపడుతున్నారని, అలాంటి ఆలోచనలు మాని అభివృద్ధికి సహకరించాలని కోరారు. పరిశ్రమల అభివృద్ధికోసం భూములిచ్చిన రైతులను సీఎం అభినందించారు.

మిట్టల్ స్టీల్‌కు పర్యావరణ అనుమతి వాయిదా

- పర్యావరణ నిర్వహణకు 3540 కోట్ల వ్యయం అంచనా

అనకాపల్లి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నక్కపల్లి ఏపీఐఐసీ పారిశ్రామిక పార్కులో ఏర్పాటుకానున్న ఆర్సెల్లార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ప్లాంటుకు పర్యావరణ అనుమతుల జారీపై కమిటీ తన నిర్ణయాన్ని వాయిదా వేసింది. ఈ మేరకు సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఒక ప్రకటన విడుదల చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పారిశ్రామిక అభివృద్ధిలో భాగంగా నక్కపల్లి ఏపీఐఐసీ సెజ్‌లో 8.2 మిలియన్ టన్నుల వార్షిక ఉత్పత్తి సామర్థ్యంతో ఆర్సెల్లార్ మిట్టల్ స్టీల్ ప్లాంటు ఏర్పాటుకు ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. తమ రూ.1.5 లక్షల కోట్ల ఉక్కు కర్మాగారానికి పర్యావరణ అనుమతుల కోసం పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖలకు 'ఆర్సెల్లార్ మిట్టల్' దరఖాస్తు చేసుకుంది. ఈ మేరకు ఏర్పాటైన నిపుణుల కమిటీ అక్టోబరు 30న సమావేశమైంది. వివిధ అంశాలపై చర్చించిన కమిటీ మరింత సమగ్ర సమాచారం సేకరించిన తరువాత అనుమతులు జారీ చేసే ఉద్దేశంతో పర్యావరణ అనుమతుల ఇచ్చే అంశాన్ని వాయిదా వేసింది. నక్కపల్లి ఏపీఐఐసీ పారిశ్రామిక పార్క్‌కు పర్యావరణ అనుమతులు ఉన్నందున, ఇప్పుడు స్టీల్‌ప్లాంటుకు ప్రత్యేకంగా తీసుకోవాల్సిన అవసరం లేదన్న యాజమాన్యం వాదనపై కంట్రోలర్ ఆఫ్ పొల్యూషన్ నుంచి వివరణ తీసుకోవాలని కమిటీ నిర్ణయించినట్టు తెలిసింది. మిట్టల్ స్టీల్ ప్లాంటు కోసం పర్యావరణ నిర్వహణకు సుమారు రూ.3,540 కోట్లు వ్యయం అవుతుందని కమిటీ అంచనా వేసింది.

కఠినంగా ఉంటా!

(మొదటి పేజీ తరువాయి)



టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న సీఎం చంద్రబాబు

ఎమ్మెల్యేలు, మంత్రులకు మాత్రం ఈ కార్యక్రమంలో పాల్గొనే తీరిక కూడా దొరకడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఏడాదికి రూ.34 వేల కోట్లతో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. శనివారం టీడీపీ కేంద్ర కార్యాలయానికి చంద్రబాబు వచ్చారు. ప్రజల నుంచి విజ్ఞప్తులు స్వీకరించిన అనంతరం పార్టీ బ్యాక్ ఆఫీసు సిబ్బంది, ప్రోగ్రాం కమిటీ సభ్యులతో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో పార్టీ కార్యక్రమాల అమలు, ప్రజాప్రతినిధుల పాత్ర, పార్టీ నేతల వ్యవహారశైలిపై సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. కొందరు ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రుల వ్యవహారశైలిపై సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజలు ఎంతో బాధ్యతగా మనల్ని గెలిపించినప్పుడు వారిని పట్టించుకోకుండా హైదరాబాద్, బెంగళూరుల్లో కూ ర్చుని వ్యాపారాలు చక్కబెట్టుకోవడం ఏమిటన్నారు. కొందరు ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు పేర్లు ప్రస్తావించి మరీ ఎవరేం చేస్తున్నారో అన్నీ తనకు తెలుసని, ఇకపై కఠినంగానే ఉంటానని స్పష్టం చేశా రు. పింఛన్ల పంపిణీ, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన 48 మంది ఎమ్మెల్యేల జాబితాను బ్యాక్ ఆఫీసు సిబ్బంది సీఎం ముందు ఉంచారు. వారందరి నుంచి వివరణ తీసుకుని తన కు తెలియజేయాలని సీఎం ఆదేశించారు. పార్టీ ప్రతిష్ఠాత్మకంగా భావించే కార్యక్రమంలో కూడా ఎమ్మెల్యేలు పాల్గొనకపోతే ఎలా అని చంద్రబాబు ప్రశ్నించారు. పార్టీ కార్యకలాపాలు, ప్రజాసమస్యల పరిష్కారం, నాయకుల బాధ్యతలపై సీఎం స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు.

చెక్కుల పంపిణీలో నిర్లక్ష్యం వద్దు

పింఛన్ల పంపిణీతో పాటు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ, కార్యకర్తల బీమా చెక్కుల పంపిణీ కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా పాల్గొనాలని సీఎం ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు ప్రజలు, కార్యకర్తలతో మాట్లాడాలని, వారి నుంచి ప్రభుత్వ పనితీరు, ఇతర సమస్యలపై ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని సూచించారు. ప్రజాసేవలో నేతలు నిబద్ధతతో వ్యవహరించాలని, క్షేత్రస్థాయిలో ఉంటూ ప్రభుత్వ కార్యక్రమాలకు తప్పనిసరిగా హాజరవ్వాలని స్పష్టం చేశారు. కొన్ని నియోజకవర్గాల్లో సీఎంఆర్ఎఫ్ చెక్కులు గడువు ముగిసిపోయినా పంపిణీ చేయకుండా ఉంచేస్తున్నారని, ఇలాగైతే వందల కోట్ల ప్రయోజనం వృథా అవుతుందని సీఎం వ్యాఖ్యానించారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టండి

ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రతి ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రి ప్రజావేదిక కార్యక్రమంలో పాల్గొని తీరాల్సిందేనని చంద్రబాబు ఆదేశించారు. శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో నిర్వహించిన గ్రీవెన్స్‌కు అనూహ్య స్పందన వచ్చిందని, ప్రజాప్రతినిధులకు ఇలాంటివే సంతృప్తిని ఇస్తాయని వ్యాఖ్యానించారు. వారంలో ఒకరోజు కచ్చితంగా అర్జీలు స్వీకరించాలని స్పష్టం చేశారు. నియోజకవర్గ స్థాయిలో పరిష్కారం కాని సమస్యలకు జిల్లా స్థాయిలో, అక్కడ పరిష్కారం కాని సమస్యలకు రాష్ట్రస్థాయిలో పరిష్కారం చూపాలని సీఎం ఆదేశించారు. ఇన్‌చార్జి మంత్రులు ఎమ్మెల్యేలు నిర్వహిస్తున్న గ్రీవెన్స్ వివరాలను తెప్పించుకుని, సమస్యల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని సూచించారు. ప్రతి ఎమ్మెల్యే ప్రజల నుంచి వినతులు తీసుకోవడంతో పాటు తమకు వచ్చిన అర్జీలు పరిష్కారం అయ్యేవరకు పని చేయాలని ఆదేశించారు. సమస్య తన వద్దకో, లోకేశ్ వద్దకో వస్తేనే పరిష్కారం అవుతుందనే భావన ఉండకూడదన్నారు. టీడీపీ ఆవిర్భావం నుంచి ఉన్న కార్యకర్తలను కాదని ఎమ్మెల్యేలు తమకు నచ్చిన కార్యకర్తలను మాత్రమే ప్రోత్సహిస్తున్నారని, వారిలో వైసీపీ నుంచి వచ్చిన వారు కూడా ఉన్నారన్న విషయం తన దృష్టికి వచ్చిందని, ఇకపై అలాంటివి పునరావృతం కాకూడదని హెచ్చరించారు. పార్టీనే నమ్ముకుని ఉన్న సీనియర్ కార్యకర్తల్ని కలుపుకొని పోవాలని, ఈ అంశంపై క్షేత్రస్థాయి నుంచి ఎప్పటికప్పుడు సమాచారం తెప్పించుకుంటానని అన్నారు.

తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టండి

వైసీపీ నేతలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఎప్పటికప్పుడు తిప్పికొడుతూ వాస్తవాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నేతలకు సీఎం సూ చించారు. పీపీపీ విధానంలో మెడిక ల్ కాలేజీల నిర్మాణం వల్ల పేదలకు నాణ్యమైన వైద్యం అందడంతో పా టు పేద విద్యార్థులకు మెరుగైన విద్య అందుతుందన్నారు. అసత్యాలతో అడ్డుకునేందుకు వైసీపీ నేతలు కుట్రలు చేస్తున్నారని ఆగ్రహం వ్య క్తం చేశారు. మొంథా తుఫాను సమయంలో ప్రభుత్వం తక్షణమే స్పందించి రైతులు, ప్రజలకు అండ గా నిలబడితే జగన్ మాత్రం విషం చిమ్ముతున్నారని అన్నారు. జగన్ దుర్మార్గాలను పదే పదే ప్రజల్లోకి తీసుకెళ్లాలని నేతలను కోరారు. బిహార్ ఎన్నికల్లో ఇప్పటికీ లాలూ జంగిల్ రాజ్ విషయమే ప్రచారాస్త్రంగా ఉందని గుర్తు చేశారు. ప్రభుత్వం గతంలో కన్నా సంక్షేమం, అభివృద్ధి ఎక్కువగా చేస్తోందని, నిధుల కొరత ఉన్నా ఎక్కడా వెనుకడుగు వేయడం లేదన్నారు.

అమరావతి బ్రాండ్ ఇమేజ్ పెరిగింది

అమరావతి బ్రాండ్ ఇమేజ్ పెరిగిందని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. హైదరాబాద్ స్థాయిలో అమరావతిలోనూ భారీ ఈవెంట్లు జరుగుతున్నాయని, ప్రభుత్వం కూడా ప్రోత్సహిస్తోందన్నారు. తెలంగాణలో పెట్టుబడి పెట్టేందుకు సిద్ధమైన కంపెనీలు కొన్ని కారణాల వల్ల నెల్లూరు జిల్లా నాయుడుపేటలో రూ.6 వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు రావడం శుభపరిణామమని అన్నారు. విశాఖలో ఈ నెల 14, 15 తేదీల్లో జరిగే పెట్టుబడుల సదస్సు ఈసారి నిర్మాణాత్మకంగా జరగనుందన్నారు. క్వాంటమ్ కంప్యూటర్ సిద్ధమైందని, అనుకున్న సమయానికి అమరావతికి వచ్చేలా చూస్తున్నామని చెప్పారు. అవినీతి నిర్మూలనకు సమగ్ర చర్యలు చేపడుతున్నామని, రెవెన్యూలో సమస్యల పరిష్కారంపైనా దృష్టి సారిస్తున్నామని అన్నారు.

తప్పంతా కొలికపూడిదే..!

(మొదటి పేజీ తరువాయి)

వర్ల రామయ్య, పంచుమర్తి అనురాధ, ఎంఏ షరీఫ్, కొనకళ్ల నారాయణ, బీసీ జనార్దన్‌రెడ్డిలు విచారణ నివేదిక ను అందించారు. కొలికపూడి శ్రీనివాస్ వ్యవహారశైలి తొలి నుంచీ పార్టీ సిద్ధాంతాలకు భిన్నంగా ఉందని, తప్పటడుగు వేసిన ప్రతిసారీ క్రమశిక్షణ కమిటీ పిలిచి వివరణ తీసుకుంటూనే ఉన్నా ఆయన తన శైలిని మార్చుకోలేదని కమిటీ తన నివేదికలో పేర్కొంది. ఎమ్మెల్యేగా ఎన్నికైన నాటి నుంచి 16 నెలల కాలంలో మూడుసార్లు కొలికపూడి క్రమశిక్షణ కమిటీ ముందు హాజరయ్యారని, ప్రతిసారీ తప్పయిందని ఒప్పుకోవడం.. మరోసారి పునరావృతం కాకుండా చూసుకుంటానని చెప్పడం ఆయనకు రివాజుగా మారిందని పే ర్కొంది. ఏకంగా పార్టీ ఎంపీపైనే డబ్బు లు తీసుకుని టికెట్ ఇచ్చారని బహిరంగ ఆరోపణలు చేయడం క్రమార్హం కాదని కమిటీ సభ్యులు అభిప్రాయపడ్డారు. తాను చేసిన ఆరోపణలకు రు జువులు ఉన్నాయంటూ క్రమశిక్షణ కమిటీ ఎదుట చెప్పిన కొలికపూడి ఒక్క ఆధారాన్ని కూడా చూపించలేదని తెలిపారు. టీవీ చానళ్లలో వచ్చిన తన కార్యక్రమాలను పెన్ డ్రైవ్‌లో వేసి దాన్నే ఆధారంగా పరిగణించాలని కోరారని నివేదికలో పేర్కొన్నారు. కొలికపూడి తీరు బాధ్యతారాహిత్యంగా ఉందని, కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొంది.

అధిష్ఠానం వారించినా.. 'నా నియోజకవర్గంలో ఎంపీకి ఏం పని?.' అని క్రమశిక్షణ కమిటీ సభ్యుల ఎదుట కొలికపూడి తన వాదన వినిపించారని, ఎంపీ తన నియోజకవర్గంలో జోక్యం చేసుకోకుండా చూడాల ని కూడా కోరారని నివేదికలో పేర్కొన్నారు. అయితే, ఈ వాదన సరికాదన్న కమిటీ.. ఎంపీగా తన పార్లమెంటు పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గా ల్లో కేశినేని పర్యటించకుండా అడ్డుకోవడం సమంజసం కాదని తెలిపింది. అయినా తిరువూరు పర్యటన సమయంలో చిన్ని ముందుగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లాకు సమాచారం అం దించి, ఆయన అనుమతితోనే పర్యటించారని పేర్కొంది. అక్టోబరు 19న కొలికపూడి మాట్లాడుతూ.. "ఎంపీ చిన్ని కార్యాలయంలో కొంత మందితోపాటు తిరువూరు పరిశీలకులు కూడా డబ్బు లు తీసుకుని పదవులు ఇస్తున్నారు." అని ఆరోపించారని నివేదికలో పేర్కొన్నారు. అప్పట్లో తప్పయిందన్న కొలికపూడి.. తన తీరును మాత్రం మార్చుకోలేదని నివేదికలో వివరించారు. కాగా, తాను ఎమ్మెల్యే కొలికపూడి, ఎంపీ చిన్నిని పిలిచి మాట్లాడతానని చంద్ర బాబు కమిటీకి తెలిపారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 , RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.